జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | గురువారం 23 జూలై 2026 | సంపుటి: 19 | సంచిక: 138 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , ఆషాఢ మాసము , తిథి: పాడ్యమి - 11:53:40 వరకు నక్షత్రంపుష్యమి - 21:47:53 వరకు కరణంబవ - 11:53:40 వరకు, బాలవ - 22:21:00 వరకు పక్షంశుక్ల యోగంహర్షణ - 08:04:35 వరకు, వజ్ర - 28:30:30 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


### తెలంగాణకు కేంద్రం శుభవార్త

**అదనపు ధాన్యం కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్**

**8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలుకు ఆమోదం**

హైదరాబాద్,జులై22(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం భుభవార్త తెలిపింది.రాష్ట్రంలో రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా వడ్ల కొనుగోలు చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఉన్న కొనుగోలు లక్ష్యానికి

### సీసీఐ పునరుద్ధరణపై మీ వైఖరి ఏంటి?

**జిల్లా అభివృద్ధికి సిమెంట్ ఫ్యాక్టరీ అతి ముఖ్యం**

**సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ నేత కేటీఆర్ లేఖ**

హైదరాబాద్,జూలై22(ప్రజాజ్యోతి): ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఆదిలాబాద్ అభివృద్ధికి

మిగతా 2లో..

# అట్టుడికిన తెలంగాణం

## కాంగ్రెస్, బిజెపి పోటాపోటీ ఆందోళనలు

### లోక్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం

గాంధీభవన్ ముట్టడికి బీజేపీ నేతల దూకుడు

ఇరువర్గాల పరస్పరం దాడులతో ఉద్రిక్తత

రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన పోలీసులు

నగరంలో పలువురు కాంగ్రెస్, బీజేపీ నేతల అరెస్ట్

బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి

రామచంద్రరావు, ఎమ్మెల్యే రాకేశ్‌ల ముందస్తు అరెస్ట్

కరీంనగర్‌లో బండి కార్యాలయంపై దాడికి యత్నం

**హైదరాబాద్‌లోని తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు భారీగా మోహరించి ఇరు వర్గాలను చెదరగొట్టారు.**




హైదరాబాద్,జూలై22(ప్రజాజ్యోతి): కాంగ్రెస్, బీజేపీ ఆందోళనలతో బుధవారం హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లోక్‌భవన్ ముట్టడికి పిలుపునివ్వగా, మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ఎదుట కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ఖండిస్తూ బీజేపీ నాయకులు గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో ఇరువర్గాలు ముట్టడికి బలయుదేరడంతో పాటు పరస్పర దాడులకు తెగించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న నిరసనలతో నాంపల్లి బీజేపీ కార్యాలయం దగ్గర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ ఆఫీస్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు యత్నించారు. కాంగ్రెస్ నేతలు రాకుండా మిగతా 2లో..

### అక్రమాలకు అడ్డాగా

# దేశ వ్యవస్థ

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాల్సిందే

పదేళ్లలో 152 పేపర్ లీక్ కేసులు

ఒక్క కేసులో కూడా దోషులను తేల్చలేదు

మీడియా సమావేశంలో రాహుల్ డిమాండ్

కేంద్రానికి రాహుల్ మూడు డిమాండ్లు

న్యూఢిల్లీ,జూలై22(ప్రజాజ్యోతి): గత 10 ఏళ్లల్లో 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒక్క కేసులో కూడా దోషులు ఎవరో తేలలేదని అన్నారు. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై ఉద్యమిస్తున్న యువతకు మద్దతుగా రాహెల్ గాంధీ బుధవారం ఏర్పాటు చేసిన పత్రికాసమావేశంలో కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. మిగతా 2లో..



### మా సమయం వృథా చేయొద్దు

**విద్యార్థుల నిరసనపై విచారించలేం**

**వీడియోలు చూసే సమయం లేదు**

**పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీం**

న్యూఢిల్లీ,జులై22(ప్రజాజ్యోతి): జాతీయ స్థాయి పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థులు చేపట్టిన 'చలో సంసద్' నిరసన సందర్భంగా పోలీసుల చర్యను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. పిటిషనర్ తరపు న్యాయవాది ఈ అంశాన్ని ప్రస్తావించగా, "మా సమయం వృథా చేయొద్దు" అంటూ భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఘాటుగా

మిగతా 2లో..

### విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవద్దు

- రాజకీయ ప్రయోజనాల కోసం చూడొద్దు
- యూపీఏ హయాంలో ఎన్నో పేపర్లు లీకులు
- బంగాల్, కర్ణాటకలోనూ లీకైన ప్రశ్నపత్రాలు
- నీట్‌పై పార్లిమెంటులో మేం చర్చకు సిద్ధం
- కేంద్ర మంత్రి జేపీ నడ్డా కీలక ప్రకటన

న్యూఢిల్లీ,జులై22(ప్రజాజ్యోతి): నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పేపర్ లీక్‌తో సంబంధమున్న అన్ని అంశాలపై సమగ్ర చర్చకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. విపక్షాలు అడిగే ప్రశ్నలకు మిగతా 12లో..

# నిరసన తెలిపితే పాశవిక దాడులా?

### రాహుల్ గాంధీ రక్తం నేలకు చిందింది

- రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న కేంద్రం
- నిందితులను శిక్షించకుండా విద్యార్థులపై దాడులా?
- కేటీఆర్ బినామీ సంస్థపై బీజేపీకి ఎందుకంత ప్రేమ?
- నరేంద్ర, ధర్మేంద్ర ఇద్దరూ దేశాన్ని దోచుకుంటున్నారు
- కొడంగల్ ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ నిరసన ర్యాలీ

కొడంగల్ జులై 22 ప్రజా జ్యోతి న్యూస్ : నీట్ పేపర్ లీక్ పై పోరాటం చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలిపితే పాశవిక దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి, పోలీసుల పాశవిక దాడులపై కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి నాయకత్వంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ తో బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మార్చిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను మిగతా 2లో..

### నీట్ పరీక్ష అవకతవకలపై నిరసన

జూలై 24న విద్యాసంస్థల బంద్!

హైదరాబాద్,జులై22(ప్రజాజ్యోతి): దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన నీట్ పరీక్ష అవకతవకలు, వరుస పేపర్ లీకేజీల వ్యవహారంపై విద్యార్థి లోకం ఆగ్రహంతో రగిలిపోతోంది. విద్యా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న పదే పదే లోపాలపై విద్యార్థి సంఘాలు సమరశంఖం పూరించాయి. పరీక్షల నిర్వహణలో పూర్తిగా

మిగతా 12లో..

# అమెరికా, ఇరాన్ పరస్పర దాడులు

- టెహ్రాన్‌పై విరుచుకుపడుతున్న అమెరికా
- కువైట్, జోర్డాన్ లపై ఇరాన్ ప్రతిదాడులు
- దాడులతో అట్టుడుకుతున్న పశ్చిమాసియా
- ఇరాన్ పికాక్స్ అణు స్థావరాన్ని పేల్చేస్తాం
- పర్వత సముదాయాన్ని టార్గెట్ చేస్తాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన
- సౌదీతో అమెరికా అణు ఒప్పందం!?
- అమెరికా సాయంతో యురేనియం శుద్ధి
- అణు సహకార ఒప్పందానికి గ్రీన్ సిగ్నల్
- అణ్వాయుధాలను తయారీకి అవకాశం?

వాషింగ్టన్,జులై22(ప్రజాజ్యోతి): పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ దేశాల మధ్య ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గుముఖం పట్టే సూచనలు కనిపించడం లేదు. ఇరాన్ లక్ష్యంగా అమెరికా వైమానిక దాడులను కొనసాగిస్తుండగా, ఇరాన్ సైతం తన ప్రత్యర్థులు, అమెరికా మిత్రదేశాలపై ప్రతీకార దాడులు చేస్తోంది. ఈ క్రమంలో ఇరాన్‌తో శాంతి చర్చలు జరిపే ఆలోచన లేదని అమెరికా అధ్యక్షుడు

మిగతా 2లో..



### సంస్కరణలకు ప్రజల సంక్షేమమే ముఖ్యం

**పౌరుల అవసరాలకనుగుణంగా సంస్కరణలు**

**సంస్కరణలతోనే దేశంలో నిజమైన మార్పు**

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు**

**వికసిత్ భారత్ లక్ష్యాలపై ప్రధాని మోదీ సమీక్ష**

న్యూఢిల్లీ,జులై22(ప్రజాజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ఢిల్లీలోని లోక్ కళ్యాణ్ మార్గ్‌లో గల తన అధికారిక నివాసంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. వికసిత్ భారత్ లక్ష్యాల సాధన దిశగా గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సామాజిక సంక్షేమం, యువత,



మిగతా 12లో..

# అక్రమార్జన..

### ముత్యం వెంకటరమణ అరెస్ట్

ట్రాన్స్‌కో డీఈ ముత్యం ఇంటిపై ఏసీబీ దాడులు

8 బృందాలతో క్షుణ్ణంగా తనిఖీలు..

భారీగా ఆస్తులు, బంగారం, నగదు గుర్తింపు

హైదరాబాద్,జూలై22(ప్రజాజ్యోతి): ట్రాన్స్‌కో డీఈ ముత్యం వెంకటరమణ అరెస్ట్ అయ్యారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అరెస్ట్ చేసింది. అక్రమాస్తులు బయటపడిన తర్వాత ఆయనను అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ ప్రాంతంలో ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) ముత్యం వెంకటరమణ నివాసంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. గత 12 గంటలుగా కొనసాగుతున్న ఈ తనిఖీల్లో రెండు ప్రత్యేక బృందాలు పాల్గొన్నాయి. మొత్తం 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టిన అధికారులు, నగదు, కీలక పత్రాలు, మిగతా 12లో..



### హైదరాబాద్‌లో కుండపోత వర్షం

- జలమయమై ట్రాఫిక్‌కు అంతరాయం
- పలుచోట్ల పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలకు చాన్స్
- మరో 48 గంటలు విస్తారంగా వర్షాలు



హైదరాబాద్,జులై22(ప్రజాజ్యోతి): తెలంగాణలో మరో రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నైరుతి రుతుపవన ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం పూర్తిగా మారిపోయిందని తెలిపింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. గురువారం కూడా రోజంతా ఆకాశం మేఘావృతంగా ఉండి పలుచోట్ల వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. వాతావరణ శాఖ మిగతా 2లో..

# సంపాదకీయం

## ఎజెండాలో నీట్‌పై చర్చ ఎందుకు లేదు!

తప్పు జరిగినప్పుడు ప్రభుత్వంలో ఎవరు ఉంటే వారినే నిందిస్తారు. వారిమీదే విమర్శలు గుప్పిస్తారు. పాలన బ్రహ్మాండంగా చేస్తుంటే..పకడ్బందీగా చర్యలు తీసుకుని ఉంటే నీట్ పేపర్ ఎందుకు లీక్ అవుతుంది. ఎందుకు దుర్మార్గులు పేపర్ అమ్ముకునేందుకు సాహసిస్తారు. ఇలా చేయడం వల్ల ఎందరో విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయి. కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇదంతా కూడా ప్రభుత్వ వైఫల్యంగానే చూడాలి. అన్ని రాష్ట్రాలు తమంత తాముగా ఎంసెట్ నిర్వహించుకుని, పక్కగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే, దానిని కాదని నీట్‌ను ప్రవేశ పెట్టారు. కేంద్రం ఆంధీనంలోని ఎన్‌టిఎ నీట్ నిర్వహణలో ఎందుకు తప్పుచేసింది. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిజానికి పేపర్లు లీక్ చేసిన వారిని, అమ్ముకున్న వారిని బహిరంగంగా ఉరితీయాలి. ఇకపోతే ప్రస్తుతానికి వస్తే... పేపర్ లీక్‌లో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తూ వచ్చారు. దీక్షకు దిగారు, కాక్రోచ్ పార్టీ మొదటి డిమాండ్ ఇదే తమ డిమాండ్ అని ప్రకటించింది. ఢిల్లీలో ఆందోళనకు పిలుపును ఇచ్చింది. అయినా ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదు. దీనిపై ప్రధాని స్పందించలేదు. నిరంతరం విదేశీ పర్యటనలతో గడుపుతున్న ప్రధాని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడడం లేదు. పార్లమెంట్ సమావేశాలకు ముందే ప్రధాని స్పందించి, సిజెపి నేతలను పిలిచి మాట్లాడడం, నీట్‌పై తీసుకుంటున్న చర్యలను వివరించడం జరిగివుంటే బాగుండేది. నిజానికి సమస్యలను పరిష్కరించడం అన్నది ప్రజల కోసమే కదా. మరి ఎందుకు పెద్దగా స్పందించలేదన్నదే సమస్య. ఇకపోతే కాక్రోచ్ పార్టీ చేస్తున్న ఆందోళనలను హైజాక్ చేసేందుకు కాంగ్రెస్ , రాహుల్ గాంధీ యత్నించారనే చెప్పాలి. విద్యార్థుల ఆందోళనలో దూరడం ద్వారా సమస్యకు రాజకీయం పులిమారు. రాహుల్‌కు సమస్యల పట్ల చిత్తశుద్ధి కనిపించడం లేదు. పార్లమెంటులో చర్చించి, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన పెద్దమనిషి రాజకీయ డ్రామాకు తెరతీసారు. ఇకపోతే అధికార పార్టీ నేతలు చేస్తున్న వాదనలో పసలేదు. నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తోందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. ప్రధాని నివాసం ఎదుట రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసనపై స్పందించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఇది భారత రాజకీయ చరిత్రలో ఒక చీకటి రోజని పేర్కొంటూ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాంగ్రెస్ ఉల్లంఘించిందని విమర్శించారు. విమర్శించ డానికి ఎన్నయినా చెప్పవచ్చు. నిజానికి నీట్ అంశంపై చర్చను ఎజెండాలో పెట్టివుంటే సమస్య వచ్చి ఉండేది కాదు. ఎందుకు అజెండాలో పెట్టలేదో ముందుగా కేంద్రం వివరణ ఇవ్వాలి. మొత్తంగా ఇప్పుడు తప్పెవరిదంటే..అధికార పార్టీదే అని చెప్పాలి. సమస్యపై చిత్తశుద్ధి లేకపోవడం వల్లనే దేశ రాజధాని ఢిల్లీ ఆందోళనలతో అట్టుడుకుతోంది. సీజేపీ, కాంగ్రెస్ ధర్నాలతో హైటెన్షన్ నెలకొంది. విద్యార్థులపై లాఠిచార్జ్‌కు నిరసనగా.. ప్రధాని నివాసం దగ్గర 3 గంటలపాటు కాంగ్రెస్ మెరుపుధర్నా నిర్వహించింది. పార్లమెంటు వాయిదా తర్వాత పాదయాత్ర చేసిన కాంగ్రెస్ ఎంపీలు.. నేరుగా ప్రధాని నివాస దగ్గరకు వెళ్లి ధర్నా నిర్వహిచారు. నీట్ పేపర్ లీక్‌పై ప్రధాని, హోంమంత్రి, విద్యాశాఖ మంత్రి రాజీనామాకు రాహుల్ డిమాండ్ చేశారు. కాగా.. రాహుల్, ప్రియాంక సహా.. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ తర్వాత రాత్రి విడుదల చేశారు. 'చలో సంసద్' మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులపై పోలీసుల చర్యలు, కాంగ్రెస్ ధర్నా.. తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం తొలిసారిగా స్పందించారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను రాజకీయ సాధనంగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ వివాదానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయకుండా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ప్రధాన్ ఆరోపించారు. పార్లమెంటులో నీట్ అంశంపై సవివరంగా చర్చించడానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వెలుపల నిరసన చేపట్టారని కేంద్ర మంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సమగ్ర చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం తెలియజేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రజాస్వామ్య చర్చ కన్నా రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాహుల్ గాంధీకి విద్యార్థులు అవసరం లేదు.. గొడవలు సృష్టించడమే లక్ష్యమంటూ పేర్కొన్నారు.. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. విద్యార్థులకు సమాధానాలు, సంస్కరణలు, జవాబుదారీతనం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అంటున్న ధర్మేంద్ర ప్రధాన్ ఇంతకాలం ఎందుకు స్పందించ లేదో చెప్పాలి. విపక్షంలో ఉన్నవారు ఎవ్వరైనా రాజకీయం చేస్తారు. బిజెపి కూడా అదే చేసేది. ప్రజాస్వామ్య నియమాలను, పార్లమెంటరీ సంప్రదాయాలను పాటిస్తే మంచిది. సమస్య ఏదైనా చర్చకు అవకావం రావాలి. ఎందుకంటే ఈ మధ్య కాలంలో పార్లమెంటులో సమర్థవంతంగా చర్చలు సాగడం లేదు. సమస్యలపై ప్రస్తావన జరగడం లేదు.ఇందుకు అధికార పక్షానిదే ప్రధాన బాధ్యత. విద్యార్థులు లేవనెత్తుతున్న సమస్యలపై ప్రభుత్వం చర్చించాలనుకుంటే ఎందుకు ఎజెండాలో పెట్టలేదో చెప్పాలి. ప్రజాస్వామ్యంలోప్రతిపక్ష పార్టీకి నిరసన తెలిపే హక్కు ఉంటుంది. పార్లమెంటులో చర్చలకు అవకాశం రానప్పుడు ఎవ్వరైనా వీధుల్లోనే నిరసనలు తెలుపుతారు. తాము అనుకున్నట్లుగానే పార్లమెంట్ నడవాలని పాలకపక్షం కోరుకోవడం సరికాదు. ప్రజలకు ఏది అవసరమో అది గుర్తించి, చర్చించి, పరిష్కరిస్తే మంచిది. నీట్‌పై చర్చించి, లీకులు లేకుండా, అన్ని రాష్ట్రాలకు ఆమోదయోగ్యంగా నిర్ణయం తీసుకుంటే మంచిది.

## సీసీఐ పునరుద్ధరణపై మీ వైఖరి ఏంటి?

మొదటిపేజీ తరువాయి..

సీసీఐ పునరుద్ధరణ కీలకమని.. రూ.250 కోట్ల రాష్ట్ర వాటాతో పునరుద్ధరణ సాధ్యమేనని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడమే జాప్యానికి కారణమన్న కేటీఆర్ సీసీఐ పునరుద్ధరణపై రేవంత్ ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో చేసిన ప్రతిపాదనలను ప్రస్తావించారు. ఆదిలాబాద్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. రెండున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ చిత్త శుద్ధి లోపం వల్లే జాప్యం జరిగిందని.. సీసీఐపై ఆరు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇటీవలే సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీసీఐ సాధన సమితి బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు / ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసిందని తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు సీసీఐ సాధాన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశాం. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఎ÷–లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ఎ÷–లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ప్లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పడం జరిగిందన్నారు.

## హైదరాబాద్‌లో కుండపోత వర్షం

మొదటిపేజీ తరువాయి..

హెచ్చరికల నేపథ్యంలో హైదరాబాద్‌లో బుధవారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ, సనత్‌నగర్, కృష్ణానగర్, ఫిలింనగర్, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట, పంజాగుట్ట, ఎస్ఆర్‌నగర్‌తో పాటు సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్ ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. కుండపోతతో పలు రహదారులు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టాయి. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో తొలగింపు పనులు కొనసాగుతున్నాయి.

# అట్టుడికిన తెలంగాణం

మొదటిపేజీ తరువాయి..

బీజేపీ నేతలు కర్రలతో అడ్డుకున్నారు. మరోపక్క.. రాజ్ భవన్ ముట్టడికి యత్నించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు నాంపల్లి పీఎస్‌కు తరలించారు. కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి నాంపల్లి పీఎస్‌కు చేరుకున్నారు. ఖైరతాబాద్‌లో కూడా కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. నెక్లెస్ రోడ్డులోని ఐమాక్స్ సమీపంలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం దగ్గరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్ భవన్ ముట్టడికి యత్నించిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఘటనా స్థలంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్దకు చేరుకున్న బీజేపీ నాయకులను అక్కడే అడ్డుకున్నారు. అలాగే లోక్‌భవన్ వైపు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఖైరతాబాద్ సర్కిల్ వద్ద నిలువరించారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ రాష్ట్ర కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కర్రలతో దాడులు జరిగాయని, కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసు వాహనాలపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ముందస్తు చర్యల్లో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తొలుత కాంగ్రెస్ నేతలు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే మంత్రులు, కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో కరీంనగర్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటిని ముట్టడించేందుకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లగా... వారిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా అడ్డుకున్నారు. చేతుల్లో కర్రలతో బండి సంజయ్ ఇంటికి బీజేపీ నేతలు కాపలాగా నిలవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బీజేపీ నేతలపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడులకు తెగబడ్డారు. ఇరుపార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో కరీంనగర్ వీధులు రణరంగాన్ని తలపించాయి. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఉద్రిక్తతలను అదుపు చేసేందుకు లాఠీలకు పనిచెప్పారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను చెదరగొట్టి, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా... కాంగ్రెస్ దాడికి నిరసనగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బీజేపీ శ్రేణులు యత్నించాయి. అయితే వారిని కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడంతో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రెండు ప్రధాన పార్టీల సవాల్–ప్రతిసవాల్‌తో కరీంనగర్‌లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. కాంగ్రెస్, బిజెపిల ఆందోళనలో భాగంగా హైదరాబాద్ బిజెపి కార్యాలయం వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. గాంధీభవన్ ముట్టడికి బీజేపీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో బీజేపీ నేతలు పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తూ నిరసనకు దిగారు. నేతల అరెస్టుల సందర్భంగా పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. బీజేపీ నాయకుల అరెస్టుపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాసం ఎదుట మంగళవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆందోళన చేశారు. దీనికి నిరసనగా బీజేపీ అగ్రనేతలు గాంధీభవన్‌ను ముట్టడించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బీజేపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో హై టెన్షన్ నెలకొంది. కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద కూడా ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు బండి సంజయ్ కార్యాలయం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. కాంగ్రెస్ నేతలను అడ్డుకునే క్రమంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. నంతరం కాంగ్రెస్ కార్యకర్తలు బండి సంజయ్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో ఆఫీసు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత కొనసాగింది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. రాష్ట్రంలో ఒకే రోజు బీజేపీ రాష్ట్ర కార్యాలయం, కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఈ పరిణామాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపడుతున్నారు.

## తెలంగాణకు కేంద్రం శుభవార్త

మొదటిపేజీ తరువాయి..

అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో రైతులకు పెద్ద ఊరట లభించనుంది. కేంద్ర ప్రభుత్వం సవరించిన వరి కొనుగోలు అంచనాను బియ్యం రూపంలో 43 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా తెలంగాణలో రైతులు పండించిన ధాన్యానికి మరింత మార్కెట్ భరోసా లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా వాహనాల స్థాన నిర్దారణ వ్యవస్థ అమలుపై కూడా కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 30 నాటికి



రాష్ట్రంలోని అన్ని అర్హత గల వాహనాల్లో వీఎల్టీఎస్ వ్యవస్థను పూర్తిగా అమలు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ వ్యవస్థ ద్వారా వాహనాల కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించే అవకాశం ఉండటంతో భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయి. అంశాలపై పార్లమెంట్‌లో కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కలిశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వడ్ల కొనుగోలు అంచనాను పెంచినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి సరైన మద్దతు ధరతో కొనుగోలు జరిగేలా కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వ్యవసాయ రంగానికి ఊతమివ్వనుంది. అదనపు కొనుగోళ్లతో రైతులకు ఆర్థిక భరోసా పెరగడంతో పాటు రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత సాఫీగా సాగేందుకు అవకాశం ఏర్పడింది.

## మా సమయం వృథా చేయొద్దు

మొదటిపేజీ తరువాయి..

వ్యాఖ్యానించింది. ఇవాళ ఉదయం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు ఈ పిటిషన్ వచ్చింది. విద్యార్థులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని, అందుకు సంబంధించిన వీడియో ఆధారాలు తన వద్ద ఉన్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. వాటిని పరిశీలించి, రేపు (గురువారం) విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన సీజేఐ.. "మేము వీడియోలు చూడాలనుకోవడం లేదు. వాటిని చూసే సమయం మాకు లేదు. మీ, మా సమయాన్ని వృథా చేయొద్దు" అని స్పష్టం చేస్తూ తక్షణ విచారణ అభ్యర్థనను తోసిపుచ్చారు.

అక్రమాలకు అడ్డాగా

## దేశ వ్యవస్థ

మొదటిపేజీ తరువాయి..

ప్రస్తుత ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థ మొత్తం రిగ్గింగ్ బారిన పడిందని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పనితీరు అసమర్థంగా, అవినీతిమయంగా ఉందని ఆరోపించారు. ఆయన రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఆయన రాజీనామాకు విద్యార్థులు పట్టుబడుతున్నారని, ఇది సరైన డిమాండేనని వ్యాఖ్యానించారు. ఈ దుస్థితికి ప్రతిబింబంగా మారిన ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు. గత పదేళ్లల్లో సుమారు 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయి. అంటే.. సగటున వారానికి ఒక పేపర్ లీక్ జరిగింది. కోట్ల మంది విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడింది. కానీ ఒక్క కేసులో కూడా దోషులెవరో తేలలేదు. ఇలా ఎందుకు జరిగిందని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకప్పుడు దేశానికి సంపదగా ఉన్న విద్యారంగం ఎన్డీయే పాలనలో ధ్వంసమైందని రాహుల్ గాంధీ ఆరోపించారు.

# నిరసన తెలిపితే పాశవిక దాడులా?

మొదటిపేజీ తరువాయి..

అమ్ముకుని బీజేపీ నాయకులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని తెలిపారు. కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని జంతర్ మంతర్ వేదికగా విద్యార్థులు చేపట్టిన నిరసనకు రాజకీయాలకు అతీతంగా పార్టీలు మద్దతు తెలిపాయన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేసి, నీట్ పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవికంగా దాడి జరుపుతారా అంటూ ప్రశ్నించారు. విద్యార్థినులపై దుర్మారంగంగా దాడి చేయడమే కాకుండా.. విద్యార్థుల తలలు పగలగొట్టారన్నారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించకుండా పోయారని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా? ఎవరైనా కిడ్నాప్ చేశారా అని సందేహం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పై పాశవికంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. పాశవిక దాడితో రాహుల్ గాంధీ రక్తం నేలకు చిందిందని, దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని చెప్పారు. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. దేశం కోసం రక్తం చిందించిన గొప్పకుటుంబం ఇందిరమ్మ కుటుంబం అన్నారు. బాంబు దాడితో శరీరం ముక్కలైనా దేశ సమైక్యత కోసం ప్రాణాలిచ్చిన వ్యక్తి రాజీవ్ గాంధీ అని గుర్తు చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నా సోనియా గాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని, కనీసం మంత్రి పదవి తీసుకోలేదని తెలిపారు. మన్మోహన్ సింగ్ ను ప్రధాని చేసి త్యాగనిరతిని చాటుకున్న గొప్ప వ్యక్తి సోనియా గాంధీ అని కొనియాడారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా ఖర్గేను నియమించారు తప్ప పదవులు తీసుకోలేదని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కు అని, పేపర్ లీక్ పై పార్లమెంటులో చర్చ జరగకుండా ప్రధాని అడ్డుకున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఇద్దరూ కలిసి దేశాన్ని దోచుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. తెలంగాణలో బీఆరెస్ అధికారంలో ఉన్న సమయంలో 2019లో ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా సంస్థ అవకతవకలకు పాల్పడిందని గుర్తు చేశారు. ఆ సంస్థ 27 మంది విద్యార్థుల ప్రాణాలు బలిగొందన్నారు. అనుభవం, అర్హత లేకపోయినా రాజకీయ ఒత్తిళ్లతో ఆనాడు కేటీఆర్ తన బినామీ సంస్థ గ్లోబరీనాకు ప్రాజెక్టును అప్పగించిందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని గ్లోబరీనా సంస్థ పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లింది. ఢిల్లీ బీజేపీ వాళ్లతో మాట్లాడుకుని వాళ్లకు కేటీఆర్ కాంట్రాక్టు ఇప్పించారు. నీట్ పరీక్ష నిర్వహించడంతో దొంగతనం చేయొచ్చన్న ధైర్యం వాళ్లకు వచ్చింది. జరిగిన అక్రమాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ పై విద్యార్థులు నిరసన తెలిపారని, ధర్మేంద్ర ప్రధాన్ ను పదవి నుంచి తొలగించకుండా విద్యార్థుల తలలు పగలగొట్టారని కేంద్ర ప్రభుత్వ వైఖరిని సీఎం తప్పుపట్టారు. నరేంద్ర, ధర్మేంద్ర ఇద్దరూ కలిసి దేశాన్ని దోచుకుంటున్నారని, దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. విద్యార్థులు, యువత పక్షాన నిలిచి మోదీపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. అందరం కలిసి పోరాటం చేసి మోడీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధాని చేసుకుందామని శ్రేణులకు సీఎం పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొడంగల్ లో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఉదయం కొడంగల్ లోని నివాసంలో ఎస్ఐఆర్ పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నేరుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా బయలుదేరారు. రాహుల్ గాంధీపై జరిగిన దాడి చిత్రాలతో కూడిన బ్యానర్ తో ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులతో కలిసి భారీ ర్యాలీతో కాలినడకన సీఎం అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, నియోజకవర్గ ముఖ్యనాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమెరికా, ఇరాన్ పరస్పర దాడులు

మొదటిపేజీ తరువాయి..

డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. మరోవైపు, సౌదీ అరేబియాను దిగ్బంధిస్తున్నట్లు ప్రకటించిన హూతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్రంలో 6 నౌకలను అడ్డుకున్నారు. దాంతో అంతర్జాతీయంగా చమురు ధరలు మళ్లీ ఎగబాకుతాయని ఆందోళన ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతోంది. అమెరికా సెంట్రల్ కమాండ్ మంగళవారం నాడు ఇరాన్ మిలిటరీ కమాండ్ కేంద్రాలు, మిస్సైల్, డ్రోన్ లాంచ్ ప్యాడ్‌లు, నేవీ, ఎయిర్ ఫోర్స్ బేస్ వ్యవస్థలే ప్రధాన లక్ష్యాలుగా దాడి చేసింది. ఈ భీకర దాడుల కారణంగా ఇరాన్‌లోని ఫార్స్, హర్మోజ్‌గన్, సిస్తాన్, ఇలామ్, కెర్మన్ వంటి పలు ప్రావిన్సులలో భారీ పేలుళ్లు సంభవించినట్లు ప్రభుత్వ అధికారులు తెలిపారు. అమెరికా దాడులకు ప్రతికారంగా ఇరాన్ కూడా సమీప దేశాలపై తన దాడులను పెంచింది. వరుసగా నాలుగో రోజు కువైట్‌లోని విద్యుత్, అణు ప్లాంట్లపై విరుచుకుపడటంతో పాటు బహ్రెయిన్ వైపు క్షిపణులను ప్రయోగించింది. హర్మూజ్ జలసంధి సమీపంలో ఒక చమురు ట్యాంకర్ నౌకపై ఇరాన్ ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కోర్ దాడి చేసింది. మరోవైపు తమ గగనతలంలోకి దూసుకొచ్చిన ఇరాన్ క్షిపణులు, డ్రోన్లను విజయవంతంగా కూల్చివేశాయని జోర్డాన్ సైన్యం ప్రకటించింది. కాగా.. హర్మూజ్ జల సంధిలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ.. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పీకాక్స్ పర్వతాల్లో ఇరాన్ నిర్మిస్తున్న అణు స్థావరాన్ని త్వరలోనే పేల్చేస్తామని ఆయన ప్రకటించారు. నంతాజ్ అణు శుద్ధి కేంద్రానికి దక్షిణంగా ఉన్న పీకాక్స్ ప్రాంతం.. 2025లో ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య జరిగిన 12 రోజుల యుద్ధంలో అమెరికా దాడుల నుంచి తప్పించుకుని సురక్షితంగా ఉంది. ఈ సమయంలోనే నంతాజ్ నుంచి వేలాది న్యూక్లియర్ సెంట్రిఫ్యూజుల్ని పీకాక్స్ పర్వతాల వద్దకు తరలించి, వాటిని భూమి లోతుల్లో పాతిపెట్టిందని ఇజ్రాయెల్ నిఘా వర్గాలు నివేదికలు వెల్లడించాయి. ట్రంప్ ఓవెల్ ఆఫీసులో మీడియాతో మాట్లాడుతూ..అమెరికా ఆయుధాగారంలోని అత్యంత శక్తివంతమైన బాంబులకు సైతం అందనంత లోతులో ఇరాన్ సెంట్రిఫ్యూజ్‌లను అక్కడికి తరలించి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.


**NOTICE**

IN THE COURT OF THE DISTRICT JUDGE - 1 AND EX-OFFICIO MEMBER OF MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL, AHMEDPUR, TALUKA AHMEDPUR & DISTRICT LATUR. (MAHARASHTRA STATE)

M.A.C.P. No. 04/2025
Gangadhar Vs. Dnyaneshwar
Exh. No. 23.

To,
**RESPONDENT NO.2**
**Shazeb Khan Pathan S/o Zamakhan Pathan**
Age Major, Occu. Business
R/o. Panjesha Tq. And Dist. Adilabad
(State of Telangana Mob. 9000944600).

Take notice that the above named petitioner, claimants have made application to this tribunal claiming compensation U/Sec. 166 Motor V. Act from you.
You being one of the above said respondent No.2 is hereby warned to appear before this tribunal in person or by a pleader duly instructed on the **Dated 15/09/2026 at 10.30 a.m.** in District Judge - I & Ex-Officio Member of MACT, Ahmedpur. It show cause against the application, failing where the said M.A.C.P. application will be heard and determined ex-parte.
Given under my hand and seal of this court this 11/11/2025.

By Order

I/C Superintendent
District Court Ahmedpur.
Dist. Latur.
Maharashtra (State)

**NOTICE**

IN THE COURT OF THE DISTRICT JUDGE - 1 AND EX-OFFICIO MEMBER OF MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL, AHMEDPUR, TALUKA AHMEDPUR & DISTRICT LATUR. (MAHARASHTRA STATE)

M.A.C.P. No. 05/2025
Haribhau & Ors Vs. Dnyaneshwar & Ors
Exh. No. 23.

To,
**RESPONDENT NO.2**
**Shazeb Khan Pathan S/o Zamakhan Pathan**
Age Major, Occu. Business
R/o. Panjesha Tq. And Dist. Adilabad
(State of Telangana Mob. 9000944600).

Take notice that the above named petitioner, claimants have made application to this tribunal claiming compensation U/Sec. 166 Motor V. Act from you.
You being one of the above said respondent No.2 is hereby warned to appear before this tribunal in person or by a pleader duly instructed on the **Dated 15/09/2026 at 10.30 a.m.** in District Judge - I & Ex-Officio Member of MACT, Ahmedpur. It show cause against the application, failing where the said M.A.C.P. application will be heard and determined ex-parte.
Given under my hand and seal of this court this 11/11/2025.

By Order

I/C Superintendent
District Court Ahmedpur.
Dist. Latur.
Maharashtra (State)

**NOTICE**

IN THE COURT OF THE DISTRICT JUDGE - 1 AND EX-OFFICIO MEMBER OF MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL, AHMEDPUR, TALUKA AHMEDPUR & DISTRICT LATUR. (MAHARASHTRA STATE)

M.A.C.P. No. 14/2025
Jayshri & Ors Vs. Dnyaneshwar & Ors
Exh. No. 19.

To,
**RESPONDENT NO.2**
**Shazeb Khan Pathan S/o Zamakhan Pathan**
Age Major, Occu. Business
R/o. Panjesha Tq. And Dist. Adilabad
(State of Telangana Mob. 9000944600).

Take notice that the above named petitioner, claimants have made application to this tribunal claiming compensation U/Sec. 166 Motor V. Act from you.
You being one of the above said respondent No.2 is hereby warned to appear before this tribunal in person or by a pleader duly instructed on the **Dated 15/09/2026 at 10.30 a.m.** in District Judge - I & Ex-Officio Member of MACT, Ahmedpur. It show cause against the application, failing where the said M.A.C.P. application will be heard and determined ex-parte.
Given under my hand and seal of this court this 11/11/2025.

By Order

I/C Superintendent
District Court-1 Ahmedpur.
Dist. Latur.
Maharashtra (State)

## కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలపై తక్షణమే పునఃసమీక్ష చేపట్టాలి

- నెలకు రెండు కార్పొరేట్ మెడికల్ బోర్డులు నిర్వహించి అర్హులైన ప్రతి కార్మికుడిని ఇన్వాలిడేషన్ చేయాలి
- ఏఐటీయూసీ నాయకుల డిమాండ్
- శ్రీరాంపూర్ ఏరియా వ్యాప్తంగా అన్ని గనులు, విభాగాల్లో భారీ ఎత్తున ధర్నాలు



**మంచిర్యాల, 22, జూలై (ప్రజాజ్యోతి) :** సింగరేణిలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలపై తక్షణమే పునఃసమీక్ష చేపట్టి బాధిత కార్మికులకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ నాయకులు సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అలాగే నెలకు కనీసం రెండు కార్పొరేట్ మెడికల్ బోర్డులు నిర్వహించి, అనారోగ్య కారణాలతో దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హ కార్మికుడిని ఇన్వాలిడేషన్ చేసి, వారి వారసులకు నిబంధనల ప్రకారం ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతా రామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపు మేరకు బుధవారం శ్రీరాంపూర్ ఏరియా వ్యాప్తంగా అన్ని గనులు, విభాగాల్లో భారీ ఎత్తున ధర్నాలు నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. శ్రీరాంపూర్–3 గనిలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ కందికట్ల వీరభద్రయ్య, ఎస్ఆర్‌పీఓసీలో బ్రాంచ్ సెక్రటరీ ఎస్.కె. బాజీ సైదా, ఆర్కే--7 గనిలో వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్‌రావు, శ్రీరాంపూర్--1 గనిలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోత్కూరి కొమరయ్య ఆధ్వర్యంలో మెమోరాండంలు అందజేశారు. ఇదే విధంగా అన్ని గనులు, విభాగాల్లో ఏఐటీయూసీ నాయకులు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సింగరేణి వ్యాప్తంగా సుమారు రెండు వేల మంది కార్మికులు గత కొన్ని సంవత్సరాలుగా కార్పొరేట్ మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, కేవలం 120 మందికి మాత్రమే అవకాశం కల్పించడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. ఎంపికైన వారిలో 28 మంది కార్మికులకు మెడికల్ బోర్డుకు హాజరుకావాల్సిన సమాచారం సకాలంలో అందకపోవడం యాజమాన్య వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. దీంతో అర్హులైన కార్మికులు తమ హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ బోర్డుకు హాజరైన 120 మంది కార్మికుల్లో కేవలం 24 మందిని మాత్రమే ఇన్వాలిడేషన్‌కు అర్హులుగా ప్రకటించడం గతంలో నిర్వహించిన మెడికల్ బోర్డులతో పోలిస్తే అత్యంత తక్కువ శాతమని పేర్కొన్నారు. బొగ్గు గనుల్లో, ముఖ్యంగా అండర్‌గ్రౌండ్‌లో దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులు కీళ్ల నొప్పులు, వెన్నెముక సమస్యలు, ఊపిరితిత్తుల వ్యాధులు, శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులు, వినికిడి లోపాలు, శారీరక బలహీనత వంటి అనేక దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ, వాటిని సమగ్రంగా పరిశీలించకుండా ఫలితాలు ప్రకటించడం అత్యంత బాధాకరమని అన్నారు. సింగరేణి కార్మికులు తమ యవ్వనాన్ని, ఆరోగ్యాన్ని సంస్థ అభివృద్ధికి అంకితం చేశారని, అలాంటి కార్మికులు అనారోగ్యానికి గురైన సమయంలో వారికి అండగా నిలవాల్సిన యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధ్యతారాహిత్యమని ఏఐటీయూసీ నాయకులు మండిపడ్డారు. మెడికల్ బోర్డు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఉండాలని, ప్రతి కార్మికుడికి తన ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా వివరించే అవకాశం కల్పించాలని కోరారు. ప్రస్తుతం ప్రకటించిన కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలపై కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, అనేక మంది బాధితులు తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని యాజమాన్యం తేలికగా తీసుకోకుండా వెంటనే ఫలితాలపై పునఃసమీక్ష చేపట్టాలని, అవసరమైతే ప్రస్తుత కార్పొరేట్ మెడికల్ బోర్డును రద్దు చేసి నిపుణులైన వైద్యులతో కొత్త కమిటీని ఏర్పాటు చేసి మరోసారి మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గతంలో దరఖాస్తు చేసుకుని ఇప్పటికీ మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున్న కార్మికులందరికీ అవకాశం కల్పించాలని, నెలకు కనీసం రెండు కార్పొరేట్ మెడికల్ బోర్డులు నిర్వహించి పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని కోరారు. ప్రతి కార్మికుడి ఆరోగ్య పరిస్థితిని నిష్పాక్షికంగా పరిశీలించి, నిజంగా విధులు నిర్వహించలేని స్థితిలో ఉన్న వారిని ఇన్వాలిడేషన్ చేసి, వారి వారసులకు నిబంధనల ప్రకారం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దీంతో కార్మిక కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు సంస్థపై కార్మికుల్లో విశ్వాసం మరింత బలపడుతుందన్నారు. ఏఐటీయూసీ ఎల్లప్పుడూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తుందని, ఈ అంశంపై యాజమాన్యం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే సింగరేణి అన్ని ఏరియాల్లో కార్మికులతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు, ఆఫీస్ బేరర్లు, అన్ని గనుల పిట్ సెక్రటరీలు, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## వ్యాక్సినేషన్ కార్యక్రమాలు నాణ్యంగా నిర్వహించాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్







**మంచిర్యాల, 22, జూలై (ప్రజాజ్యోతి) :** జిల్లాలో వ్యాక్సినేషన్ కార్యక్రమాలు, ప్రాథమిక ఆరోగ్య సేవలు నాణ్యంగా అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ సూచించారు. బుధవారం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాజీవ్‌నగర్ పరిధిలోని సున్నం బట్టివాడ అంగన్వాడీ వ్యాక్సినేషన్ కేంద్రం, అలాగే పాత మంచిర్యాల అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మేదరివాడ వ్యాక్సినేషన్ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి, అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాక్సినేషన్ నిర్వహణ, ఆరోగ్య సేవలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రతి బుధవారం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాలను సమయపాలనతో నిర్వహించాలని సూచించారు. ప్రతి వ్యాక్సినేషన్ సెషన్‌కు ముందుగానే అర్హులైన పిల్లల వివరాలను సిద్ధం చేసుకోవాలని, అన్ని రకాల టీకాలను నిర్ణీత సమయంలో సరైన విధంగా అందించాలని ఆదేశించారు. వ్యాక్సినేషన్‌కు సంబంధించిన ప్రతి వివరాన్ని అదే రోజు యూ--విన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, తదుపరి టీకా తేదీని తల్లులకు తప్పనిసరిగా తెలియజేయాలని సూచించారు. వ్యాక్సినేషన్‌తో పాటు పిల్లల పోషకాహారంపై అవగాహన కల్పించాలని, అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న బాలామృతం తదితర పోషకాహార కార్యక్రమాల గురించి వివరించాలని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంటింటికీ తిరిగి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని, దోమల ద్వారా, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అంగన్వాడీ, మున్సిపల్, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సహకారంతో వ్యాధుల నివారణకు కృషి చేయాలని కోరారు. అలాగే ఇంటింటి సర్వే సందర్భంగా 14 సంవత్సరాలు నిండిన బాలికలకు హెచ్‌పీవీ టీకా అందేలా చర్యలు తీసుకోవాలని, అర్హులైన బాలికల వివరాలను నమోదు చేసుకోవాలని ఆదేశించారు. అలాగే క్షయవ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సకాలంలో వైద్య సేవలు అందించడంతో పాటు అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని జిల్లాలోని అన్ని ఉపకేంద్రాల సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, ఆరోగ్య సిబ్బంది వెంకటసాయి, శైలజ, వనిత, లక్ష్మి, శ్రీకళ, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలి : కలెక్టర్ భవేష్ మిశ్రా





**బాసర, జూలై 22 (ప్రజాజ్యోతి) :** ఆర్జీయూకేటీ విద్యార్థులు విద్య పూర్తిచేసే నాటికే మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందేలా విద్యాబోధన సాగాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. బుధవారం ఆర్జీయూకేటీ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పరిశ్రమలకు అవసరమైన సామర్థ్యాలను పెంపొందించేలా విద్యా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగించి విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఉద్యోగాలకు పోటీపడేలా అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. విద్యార్థు లకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అధ్యాపకులు, ఉద్యోగులకు కూడా మెరుగైన పని వాతావరణం కల్పించాలని సూచించారు. క్యాంపస్‌లో నిరంతర విద్యుత్, సురక్షితమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం, అకాడమిక్, డిజిటల్, క్రీడా సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఉపకులపతి గోవర్ధన్, ఓఎస్డీ మురళీ దర్శన్, తహసీల్దార్ పవన్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బాసర ఆలయంలో వరుణ యాగం









**బాసర, జూలై 22 (ప్రజా జ్యోతి) :** చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలో బుధవారం ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి ఆధ్వర్యంలో వరుణ యాగాన్ని మంగళ వాయిద్యాలతో బాలలయం నుండి వైదికశాల ప్రవేశం అనంతరం గురు ప్రార్థన, వరుణయాగ సంకల్పం, గణపతి పూజ, పుణ్యహవాచణం, నాంది ముఖం, నవగ్రహ మండప వరుణ కళశస్థాపన, అగ్ని ప్రతిష్ట, వరుణ జపములు స్థాపిత దేవతా పూజ హోమములు,శ్రీ నిర్వహించారు. ఆలయ ఈఓ అంజని దేవి మాట్లాడుతూ వర్షాలు బాగా కురిసి పాడి పంటలు పండి రాష్ట్ర,దేశ ప్రజలు అందరూ ఆనందంగా ఉండాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఈవో తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఈవో గంగ శ్రీనివాస్, సూపరింటెండెంట్ లు శివరాజ్, సంజీవ రావు, అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

### తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను

# కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది








- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ
- ప్రియాంక గాంధీతో కలిసి 'సేవ్ లైవ్స్, స్టాప్ నీట్' నినాదాలతో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన

**మంచిర్యాల, 22, జూలై (ప్రజాజ్యోతి) :** నీట్ పరీక్షల నిర్వహణ, వైద్య విద్యలో నెలకొన్న సమస్యలు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీతో కలిసి నిర్వహించిన ఈ నిరసనలో ఆయన నల్ల దుస్తులు ధరించి కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా "సేవ్ లైవ్స్, స్టాప్ నీట్", "మన పిల్లల భవిష్యత్తు అమ్మకానికి కాదు" అనే నినాదాలతో కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. నీట్ పరీక్షల నిర్వహణలో నెలకొన్న లోపాలు, విద్యార్థుల భవిష్యత్తుపై ఏర్పడుతున్న అనిశ్చితి, వైద్య విద్యలో సమాన అవకాశాల కల్పన వంటి అంశాలను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్షల వ్యవస్థపై సమగ్ర పునఃసమీక్ష చేపట్టి, విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. "మన పిల్లల భవిష్యత్తు అమ్మకానికి కాదు" అనే నినాదంతో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతుందని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని ఎంపీ స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎంపీలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నీట్ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడంతో పాటు వారి భవిష్యత్తును కాపాడే విధంగా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

### రాహుల్ గాంధీపై దాడికి నిరసనగా చెన్నూరులో


# కాంగ్రెస్ శాంతియుత ధర్నా





- నల్ల రిబ్బన్లు ధరించి నిరసన.. ప్రధాని మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మల దహనం

**మంచిర్యాల, 22, జూలై (ప్రజాజ్యోతి) :** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై జరిగిన దాడి, అక్రమ అరెస్టును ఖండిస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ), తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) పిలుపు మేరకు బుధవారం చెన్నూరు పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నల్ల రిబ్బన్లు ధరించి శాంతియుత ధర్నా నిర్వహించారు. అనంతరం రహదారిపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో పాటు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సహా కాంగ్రెస్ అగ్రనేతలను అక్రమంగా అరెస్టు చేసి గాయపరచడం అత్యంత ఖండనీయమని అన్నారు. నీట్ (నీట్) ప్రశ్నపత్రాల లీకేజీతో సుమారు 25 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడిందని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలను అగమ్యగోచరంగా మార్చిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామని నాయకులు తెలిపారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, యువత, రైతుల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ల దిష్టిబొమ్మలను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం రహదారిపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో భారీగా పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు .ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు జంగపల్లి సంజయ్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జాడి రాజేందర్, మండల వైస్ ప్రెసిడెంట్ లింగంపల్లి మహేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ శ్రీనివాస్, వైస్ చైర్మన్ నాయకపు వినయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ ప్రసాద్ తివారి, కౌన్సిలర్లు అంబటి శంకర్, అజీముద్దీన్, సుంకరి శిరీష సంతోష్, సుద్దపల్లి సునీత సుశీల్, నజ్మా అమీర్, కో–ఆప్షన్ సభ్యులు సాధనబోయిన క్రిష్ణ, సయ్యద్ సాహిర్, కాజా బేగం ఖలీల్, మండల అధ్యక్షుడు ముత్యాల బాపాగౌడ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శులు చింతల శ్రీనివాస్, కొండ వెంకటేశ్వర్లు, నాయకులు మెరుగు చైతన్య, పాతర్ల నాగరాజు, ఎండీ నవాజ్, దాసరి కమలాకర్, ఎండీ హజ్, ఎండీ సుల్తాన్, ఎండీ ఖదీర్, ఎండీ కరీం, ఎస్కే సలీం, ఎండీ జావీద్, ఎస్కే అతీఫ్, కడవండి మహేష్, నవీన్ సచిన్, లక్ష్మణ్, చింతల వెంకటేష్, ఇబ్రహీం షరీఫ్, ఎండీ వసీం, భోగి మధు, బీమ్ మధు, గుండేటి మధు, తుంగపండి అనిల్, సయ్యద్ ఇంతియాజ్, కట్ల లీనా, లక్ష్మి, తగరం నాగరాజ్, నివురు శేఖర్, శ్రీనివాస్, పెండ్యాల శ్రీకాంత్, లక్ష్మణ్, పెద్దకొండ ప్రశాంత్, చింతకింది ప్రశాంత్, జాడి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



## బాసరలో తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రతిపాదిత భవన స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ భవేష్ మిశ్రా



**బాసర, జూలై 22 (ప్రజాజ్యోతి) :** రాష్ట్ర ప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయ భవనాల నిర్మాణానికి ఇటీవల నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో బాసర నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2 కోట్లకు పైగా నిధులు కేటాయించింది. ఈ నేపథ్యంలో బుధవారం బాసరలో ప్రతిపాదిత తహసీల్దార్ కార్యాలయ నిర్మాణ స్థలాన్ని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించిన అంశాలపై అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పవన్ చంద్రతో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## కుమారి గ్రామములో ఉచిత వైద్య శిబిరం



**నేరడిగొండ, జులై 22 (ప్రజా జ్యోతి) :** మండలంలోని కుమారి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుండి భారీ స్పందన లభించింది. వర్షాకాలం ప్రారంభమై సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఎం ఎల్ ఎస్ పి వైష్ణవి, హెల్త్ సూపర్వైజర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ సాయన్నలు పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్య బృందం మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లక్ష్మణ్, ఉప సర్పంచ్ ఆడేపు రవి, ఆశా కార్యకర్త భూతి పుష్పలతో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ డిప్యూటేషన్ను రద్దు చేయండి



**సోనాల, జులై 22 (ప్రజాజ్యోతి) :** సోనాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారి నవీన్ రెడ్డి ని డిప్యూటేషన్ పై పంపిన అతనిని తిరిగి సోనాల మండల కేంద్రంలో విధులు నిర్వహించడానికీ ఉత్తర్వులు ఇవ్వాలని కోరడమైనది. కలెక్టర్‌కి మరియు జిల్లా వైద్యాధికారి ఆదిలాబాద్‌కి విన్నవించడం జరిగింది. 11 సబ్ సెంటర్లు. 33 గ్రామపంచాయతీలకు. హాస్టల్ విద్యార్థులకు. 20వేల జనాభా గల ఈ ప్రాంత వాసులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారిని ఆకస్మికంగా డిప్రెషన్‌పై పంపడం మూలంగా ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడే ఆస్కారం ఉంది. ప్రస్తుత వర్షాకాల సమయంలో డేంగి మలేరియా విష జ్వరాలు సీజన్ వ్యాధులు. వ్యాపించే తరుణంలో డాక్టర్‌ని వేరే సెంటర్ కు పంపడం ఇక్కడ ప్రజలకు చాలా ఇబ్బందికర పరిణామమని. మా మండల ప్రాంతానికి ఆరోగ్యవంతమైన వైద్య సేవలు అందించాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో సోనాల మండల కన్వీనర్ గాజుల పోతన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కసిరే పోతన్న మాజీ సర్పంచ్ చింతల్ బోరి రాందాస్ పాల్గొనడం జరిగింది.

## ఎన్ఎమ్ఎమ్ఎస్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

**మంచిర్యాల, 22, జూలై (ప్రజాజ్యోతి) :** ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న అర్హులైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జాతీయ ఆదాయ ఆధారిత ప్రతిభా ఉపకార వేతన పథకం (ఎన్ఎమ్ఎమ్ఎస్) 2026--27 స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని మంచిర్యాల జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. విడుదల చేసిన పత్రికా ప్రకటనలో, ఎన్ఎమ్ఎమ్ఎస్ పరీక్షను నవంబర్ 1, 2026 (ఆదివారం) ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జిల్లా ప్రధాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు .2025--26 విద్యా సంవత్సరంలో 7వ తరగతి ఉత్తీర్ణులై ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ ఎయిడెడ్, వసతి సౌకర్యం లేని మోడల్ పాఠశాలల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జనరల్, బీసీ విద్యార్థులు కనీసం 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కనీసం 50 శాతం మార్కులు సాధించి ఉండాలని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించరాదని పేర్కొన్నారు. కేంద్ర విద్యాలయాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు కారని స్పష్టం చేశారు. దరఖాస్తు రుసుము జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులకు రూ.50గా నిర్ణయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపుకు ఆగస్టు 24, 2026 చివరి తేదీ కాగా, దరఖాస్తులు, నామినల్ రోల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి సమర్పించేందుకు సెప్టెంబర్ 1, 2026 వరకు అవకాశం ఉందని వివరించారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు అర్హులైన విద్యార్థులను గుర్తించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయించాలని, రాత పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు టీఏ, డీఏ వర్తిస్తాయని తెలిపారు. ఈ ప్రకటనను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.

# గుడిపల్లి గ్రామంలో ఆగని ఆర్.టి.సి బస్సులు

-ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు,ప్రజలు

నాగర్ కర్నూల్ : జులై 22 (ప్రజా జ్యోతి)
నాగర్ కర్నూల్ మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో ఆర్టీసీ సిబ్బంది బస్సులు ఆపకుండా వెళ్లడంతో విద్యార్థులు,ప్రజలు,ప్రయివేట్ సంస్థల ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నామని తమ ఆవేదనను వ్యక్తం




చేస్తున్నారు. నాగర్ కర్నూల్ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి వచ్చే బస్సు 8:00 గంటలకే రావడంతో విద్యార్థులు వేరేమార్గం లేక సమీపంలోని గుడిపల్లి గ్రామానికి వెళ్ళవలసి వస్తుందని, అక్కడికి వెళ్లినా 9:00 గంటల వరకు బస్సు లేక ప్రయివేట్ వాహనాలలో ఇరవై రూపాయలు చెల్లించి వెళ్లినా సమయానికి వెళ్లలేక పోతున్నామని,మంగళ వారం ఉ: 9:30 గంటలకు వచ్చిన రేవల్లి-వనపర్తి బస్సు ఆపలేదని బస్సుఆపని ఆర్టీసీ కండక్టర్,డ్రైవర్ ల పై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

# ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలి

చిన్నంబావి, జూలై 22 (ప్రజా జ్యోతి)
ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలున్న నేపథ్యంలో రైతులు సంప్రదాయ పంటలతో పాటు తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ శాఖ అధికారి సూచించారు. చిన్నంబావి మండలం పెద్దమారూర్ గ్రామ రైతు వేదికలో బుధవారం నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో ఈ మేరకు పలు సూచనలు చేశారు.వ్యవసాయ విస్తరణ అధికారి ఏఈఓ బి



ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశమున్నందున రైతులు ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకొని పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్, పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, కూరగాయలు వంటి తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు.సదస్సులో రైతులు అడిగిన పలు వ్యవసాయ సంబంధిత సందేహాలకు అధికారులు శాస్త్రీయంగా సమాధానాలు ఇచ్చారు. పంటల నిర్వహణ, నీటి వినియోగం, వాతావరణానికి అనుగుణమైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని గ్రామ రైతులు తెలిపారు. కార్యక్రమంలో ధర్మారెడ్డి, నరసింగరావు, సాయిబాబు, కిరణ్, శ్రీకాంత్, ఆటో నాగేష్, తిప్పలయ్య, తెలుగు మద్దిలేటి, మేకల మద్దిలేటి తదితర రైతులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రికి మరో చారిత్రాత్మక ఘట్టం..!

-ఆపరేషన్ థియేటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

నాగర్ కర్నూల్ : జులై 22 (ప్రజా జ్యోతి)
ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి మరో మైలురాయిగా నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నూతన అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ ను బుధవారం ఎమ్మెల్యే కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి,ఎమ్మెల్సీ కూచుకుళ్ళ







దామోదర్ రెడ్డిలు ప్రారంభించి ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి,ప్రజలకు వేగవంతమైన,నాణ్యమైన, పారదర్శక వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల నమ్మకాన్ని మరింత పెంచేలా ఆధునిక సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఉషా రాణి,ఆర్.ఎమ్.ఓ డాక్టర్.రోహిత్ రోహిత్,మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్,మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు,కౌన్సిలర్లు సింధు,నిజామొద్దీన్,శంకర్,పద్మ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతినిధులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ రహదారులపై అనధికార పార్కింగ్‌లపై ఉక్కుపాదం

- సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలులో రాజీ లేదు: కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, జూలై 22 (ప్రజాజ్యోతి):
జిల్లాలోని జాతీయ రహదారులపై ఆక్రమణలు, అనధికార పార్కింగ్‌లను తక్షణమే తొలగించి రహదారి భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు రహదారి భద్రతకు ఎలాంటి విఘాతం కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ, జాతీయ రహదారి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పెద్దమందడి మండలం వెల్టూరు నుంచి పెబ్బేరు మండలం రంగాపూర్ వరకు జాతీయ రహదారి వెంట ఉన్న ఆక్రమణలు, అనధికార పార్కింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. దాబాలు, వ్యాపార సంస్థల వద్ద వాహనాల పార్కింగ్‌ను నియంత్రించేందుకు అవసరమైన చోట ప్రత్యేక పార్కింగ్ స్థలాలు గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ రహదారులకు ఇరువైపులా 20 మీటర్ల పరిధిలో ఎలాంటి ఆక్రమణలు ఉండరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. రహదారుల వెంట ఉన్న వ్యాపార సంస్థలకు ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయో లేదో సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రమాదాల నివారణకు నిరంతర ప్యాట్రోలింగ్, ప్రమాదకర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఫుడ్ ప్లాజాలు, విశ్రాంతి కేంద్రాల వద్ద కూడా రహదారి భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. వెల్టూరు, కనిమెట్ట, తోమలపల్లి ప్రాంతాల్లో అండర్‌పాస్ పనులను వేగవంతం చేయాలని, కనిమెట్ట వద్ద ప్రమాదకరంగా మారిన రహదారి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ముమ్మళ్లపల్లి సర్వీస్ రోడ్డును వారం రోజుల్లో పూర్తి చేయాలని, మోజెర్ల క్రాస్ రోడ్, పాలెం క్రాస్ రోడ్ వద్ద అండర్‌పాస్ నిర్మాణం లేదా ప్రత్యామ్నాయ భద్రతా చర్యలపై నివేదిక సమర్పించాలని హైవే అధికారులకు సూచించారు. కొత్తకోట మదర్ తెరిసా జంక్షన్‌లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, కొత్తకోట సమీపంలోని అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, వినోద్ కుమార్, జాతీయ రహదారుల పీడీ బన్సల్, ఆర్‌అండ్‌బీ ఈఈ




ఫుడ్ పిరమిడ్ పార్కింగ్‌ను ప్రయాణికులు వినియోగించేలా దిశా నిర్దేశక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి, పరిమళ, డీటీఓ సురేష్ కుమార్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో పారిశుధ్యమే ప్రాధాన్యం

- ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు
- నాలా వెంటనే శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచన

వనపర్తి ప్రతినిధి, జూలై 22 (ప్రజాజ్యోతి):
ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా ప్రతిరోజూ శుభ్రత చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం వనపర్తి పట్టణంలోని రాంనగర్ కాలనీలో ఉన్న బాలుర గిరిజన సంక్షేమ కళాశాల వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, స్టోర్‌రూమ్‌లను పరిశీలించి ఆహార పదార్థాల నిల్వ, పరిశుభ్రతను తనిఖీ చేశారు. అనంతరం హాస్టల్ ఆవరణ, డ్రైనేజీ వ్యవస్థ, మరుగుదొడ్లు, ఇతర వసతులను పరిశీలించారు. హాస్టల్‌లో 140 మంది విద్యార్థుల సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 111 మంది విద్యార్థులు ఉన్నట్లు వార్డెన్ కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థులకు ఎల్లప్పుడూ పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా హాస్టల్ గదులు, మరుగుదొడ్లను ప్రతిరోజూ శుభ్రంగా ఉంచాలని వార్డెన్‌కు కలెక్టర్ ఆదేశించారు. హాస్టల్ సమీపంలోని నాలా చెత్త, పూడికతో ఉండటాన్ని గమనించిన ఆయన వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు నాలాను శుభ్రం చేయించి డ్రైనేజీ సమస్యను పూర్తిగా పరిష్కరించాలని



సూచించారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్.. హాస్టల్‌లో అందుతున్న భోజన నాణ్యత, తాగునీరు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
ఈ తనిఖీలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మధు, మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టుపై కాంగ్రెస్ నిరసన

- గాంధీచౌక్‌లో ధర్నా.. రాజీవ్ చౌక్ లో మోదీ దిష్టిబొమ్మ దహనం

వనపర్తి, జూలై 22 (ప్రజాజ్యోతి):
నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై నిరసన తెలుపుతూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపిస్తూ జిల్లా కాంగ్రెస్







కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వనపర్తి గాంధీచౌక్‌లో నిరసన ధర్నా నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని రాహుల్ గాంధీ ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పకుండా నిర్బంధ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్ష నేతపై అక్రమ కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. నీట్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు న్యాయం చేయడంతో పాటు రాహుల్ గాంధీపై నమోదైన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రాజీవ్ చౌక్ లో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కదిరి రాములు, వనపర్తి మండల అధ్యక్షుడు రవికిరణ్, గోపాల్పేట మండల అధ్యక్షుడు నరహరి, సీనియర్ నాయకుడు లక్కాకుల సతీష్, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఆదిత్య, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు జానకిరాములు తదితరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయుడే

-విద్వేషపూరిత వ్యాఖ్యలతో చిన్నారుల జీవితాలతో ఆటలాడటమా!
-కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులచే ప్లకార్డులు పట్టించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జులై 22 (ప్రజా జ్యోతి):
తమ పిల్లలు చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గ్రామాలలో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపుతుంటే అభం శుభం తెలియని చిన్నారుల మనసులలో విద్వేష పూరిత ప్రసంగాలతోపాటు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులచే ప్లకార్డులు పట్టించి వారి మనసుల్లో విష బీజం నాటుతూ చిన్నారుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎస్జీటీ జీవితాలతో చెలగాటమాడుతున్నాడని తక్షణమే ఉపాధ్యాయుడిపై విచారణ జరిపించి విధుల నుంచి సస్పెండ్ చేయాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.బలరాం రెడ్డి డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్నతనం నుండి పాఠశాలలకు పంపిస్తే క్రమశిక్షణతో పాటు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్న ఆశతో పాఠశాలకు పంపిస్తే చిన్నారులకు చక్కటి పాఠంశాలు బోధించాల్సిన ఉపాధ్యాయుడే టున్నారని, పాఠశాలల నిర్వహణకు,విద్యార్థుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం విరివిగా నిధులు కేటాయిస్తూ వారి జీవితాలను బంగారుమయం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. దీనికి విరుద్ధంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడైన శ్రీధర్ విద్యార్థుల్లో విష బీజాలు నాటుతూ వారి జీవితాలను అగాధంలోకి నెట్టేసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ నెల 21న పాఠశాలలో జరిగిన ఈ ఘటనపై తక్షణమే ఉన్నత స్థాయి



ఉపాధ్యాయుడి శ్రీధర్ను వెంటనే సస్పెండ్ చేయాలని బిజెపి నేతలు డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా మఖ్తల్ మండలంలోని కొత్త పారేవుల ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్ పాఠశాలలో చదువుతున్న అభం శుభం తెలియని చిన్నారులలో కుట్రపూరితంగా విద్వేష పూరిత ప్రసంగాలు,చర్యలు, వ్యాఖ్యలతో వారి మనసుల్లో విష బీజం నాటుతూ వారి ఈ నెల 21న పాఠశాలలో విద్యార్థులతో కేంద్ర ప్రభుత్వానికి,ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించి పాఠశాలలోనే నిరసన చేపట్టడం దుర్మార్గమన్నారు. అభం శుభం తెలియని చిన్నారులను భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టడం దారుణం అన్నారు.
బడుగు,బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులే అధిక శాతం ప్రభుత్వ పాఠశాలలో చదువుకుం కమిటీని వేసి విచారణ జరిపి బాధ్యుడైన ఉపాధ్యాయుడు శ్రీధర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్ రెడ్డి,కర్నె స్వామి,వెంకట్రాములు సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఆగస్టు 24 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు

-గడువులోపు దరఖాస్తులు పూర్తి చేయాలి
-జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్

నాగర్ కర్నూల్ : జులై 22 (ప్రజా జ్యోతి)
నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ,జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ,తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించే 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలకు ఆన్‌లైన్ దరఖాస్తు లను ఈ నెల 24వ,తేదీ వరకు సమర్పించాలని పరీక్షకు హాజరు కావాలనుకునే విద్యార్థులు http://bse.telangana.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా నిర్దేశిత గడువులో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని డి.ఈ.ఓ రమేష్ కుమార్ అన్నారు. ఆన్‌లైన్ నమోదు అనంతరం దరఖాస్తు ఫారం, ఎన్ఆర్ (రెండు కాపీలు),ఎస్.బీ.ఐ కలెక్ట్ ఫీజు రసీదు,ప్రింటెడ్ కాపీలను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధృవీకరించి సెప్టెంబర్ 01 లోపు డి.ఈ.ఓ కార్యాలయంలో సమర్పించాలని, ధృవీకరణ లేని దరఖాస్తులు పరిగణనలోకి తీసు



కోబడవని,బీసీ,ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు తమ కుల ధృవీకరణ ప్రతులను తప్పకుండా జతచేయాలని, దివ్యాంగ అభ్యర్థులు వైద్య ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలని,ధ్రువపత్రాలు సమర్పించని పక్షం లో వారిని జనరల్ అభ్యర్థులుగా పరిగణిస్తామని, ప్రతి అభ్యర్థి ఆదాయ ధృవపత్రాన్ని తప్పనిసరిగా జతచేయాలని,లేనిపక్షంలో దరఖాస్తులు రద్దుచే యబడుతాయని,ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్ష 2026 డిసెంబర్ 1న,ఉంటాయాని ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు ఆలస్యం చేయకుండా గడువులోపు దరఖాస్తు ప్రక్రియపూర్తి చేయాలని డిఇఓ రమేష్ కుమార్ కోరారు.

## పి.యం.శ్రీ జెడ్పీహెచ్ఎస్ మల్దకల్‌లో ఘనంగా (పై) అప్రాక్సిమేషన్ డే నిర్వహణ


మల్దకల్ జూలై 22(ప్రజా జ్యోతి):
జూలై 22 సందర్భంగా పి.యం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మల్దకల్‌లో పై అప్రాక్సిమేషన్ డే ను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సురేష్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు π (పై) విలువ,దాని చరిత్ర,గణితంలో ప్రాముఖ్యత,వృత్తాల చుట్టుకొలత,వైశాల్య గణనలో దాని వినియోగం,అలాగే శాస్త్ర–సాంకేతిక రంగాల్లో పై యొక్క పాత్రను వివరించారు.పై అప్రాక్సిమేషన్ డే



నిర్వహణ ఉద్దేశ్యాన్ని వివరిస్తూ,గణితంపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను తెలియజేశారు.కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పై విలువను 100 దశాంశ స్థానాల వరకు చెప్పడంతో పాటు,ఆర్యభటీయంలో పేర్కొన్న పై విలువకు సంబంధించిన శ్లోకాన్ని పఠించి,దాని భావాన్ని వివరించారు. అలాగే గణితంలో పై విలువ ఉపయోగించే వివిధ సందర్భాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి,తార్కిక ఆలోచనా శక్తి,శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని ప్రధానోపాధ్యాయులు జి. సురేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శుభ, భాస్కర్,జాకీర్ హుస్సేన్,వరలక్ష్మి ,నాగేశ్వర రావు,ప్రదీప్ తదితరులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## మల్దకల్‌లో తొలి విడత ఇంటిగ్రేటెడ్ ఇన్-సర్వీస్ టీచర్స్ శిక్షణ విజయవంతం

మల్దకల్ జూలై 22(ప్రజా జ్యోతి):
మల్దకల్ మండల కేంద్రంలో జూలై 20 నుంచి 22 వరకు నిర్వహించిన తొలి విడత ఇంటిగ్రేటెడ్ ఇన్–సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణలో మండలానికి చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయులు పాల్గొని,నూతన బోధనా విధానాలు, విద్యార్థి కేంద్రిత అభ్యాసం,సమర్థవంతమైన తరగతి గది నిర్వహణ,నిరంతర సమగ్ర మూల్యాంకనం(సి సి ఈ),ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ,సాంకేతికత వినియోగం,కార్యాచరణ ఆధారిత బోధన,సమ్మిళిత విద్య తదితర అంశాలపై శిక్షణ పొందారు.శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ సీతం నాయుడు,సుంకన్న,నాగరాజు, కిషోర్ కుమార్,డీఆర్‌పీ ఆంజనేయులు తమ అనుభవాలను పంచుకుంటూ ఉపాధ్యాయులకు సమగ్ర శిక్షణ అందించారు.కార్యక్రమానికి మల్దకల్ మండల విద్యాశాఖ అధికారి(ఎంఈఓ) జి.సురేష్ హాజరై మాట్లాడుతూ,శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు.నవీన బోధనా పద్ధతులను నిరంతరం అవలంబిస్తూ విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన రిసోర్స్ పర్సన్స్,నిర్వాహక బృందం,అలాగే శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఎంఈఓ అభినందించారు.



## నీట్ పేపర్ లీకేజీపై కేంద్రం వైఖరిని ఖండించిన నాయకులు

- విద్యార్థులపై నమోదైన కేసులు ఎత్తివేయాలి
- మృతుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్
- జేఏసీ, ఎంఆర్పీఎస్, సీపీఐ, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా



**భీమదేవరపల్లి జూలై 22 ప్రజా జ్యోతి :** ఢిల్లీలో నీట్ విద్యార్థులు, యువతపై జరిగిన లాఠీచార్జిని ఖండిస్తూ భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద జేఏసీ, ఎంఆర్పీఎస్, సీపీఐ, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజీల కారణంగా అనేక మంది విద్యార్థులు తీవ్ర నిరాశకు గురయ్యారని, విద్యార్థుల ఉద్యమానికి మద్దతుగా నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ పర్యావరణవేత్త, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్‌ను అక్రమంగా అరెస్ట్ చేయడం, పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొన్న విద్యార్థులు, యువత, వృద్ధులపై విచక్షణారహితంగా లాఠీచార్జి చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, మృతుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం చెల్లించాలని, సోనమ్ వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేయాలని, భవిష్యత్తులో పేపర్ లీకేజీలు జరగకుండా సమగ్ర చట్టం తీసుకురావాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, లాఠీచార్జిలో గాయపడిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ హుస్నాబాద్ నియోజకవర్గ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, జేఏసీ మండల చైర్మన్ ద్యాంగల సారయ్య, ఎంఆర్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాట్ల వెంకటస్వామి మాదిగ, అంబేద్కర్ సంఘ నాయకులు కండె సుధాకర్, మాడుగుల కొమురయ్య, పెద్ద కుమారస్వామి, తాళ్లపల్లి ఆశీర్వాదం, ఆర్. భిక్షపతి, పార్నందుల సురేష్, తాళ్లపల్లి జగన్, పెట్టం కుమారస్వామి, గాన్ల పద్మ, మండల కన్వీనర్ ఎల్తూరు ప్రేమ్‌రాజ్, సీపీఐ మండల కార్యదర్శి ఆదరి రమేష్, సీపీఐ నాయకులు కుమారస్వామి, కిరణ్, కొత్తపల్లి కాంగ్రెస్ నాయకులు సిక ప్రభాకర్, మేకల స్వామి, ఆదిరెడ్డి, పాల రామ్ రెడ్డి, రవి, జేఏసీ నాయకులు చంద్రమౌళి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి

- పరకాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన - మోదీ దిష్టిబొమ్మ దహనం
- నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే రేవూరి





**పరకాల, జూలై 22, (ప్రజాజ్యోతి) :** ఏఐసీసీ అగ్ర నాయకులు, లోక్ సభ ప్రతి పక్ష నేత రాహుల్ గాంధీ మరియు ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ పరకాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మదాసి శ్రీధర్ ఆధ్వర్యంలో పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో ముఖ్య అతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య విలువలను కాలరాసే చర్య అని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని అనచివేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుడిని అరెస్టు చేయడం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా అనేక మంది విద్యార్థులు నష్టపోయారని పేర్కొంటూ దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసు బలప్రయోగం చేయడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్, పరకాల టౌన్ అధ్యక్షులు ఒంటేరు శ్రావణ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతల అరెస్టుపై నిరసన

- ప్రధానమంత్రి దిష్టిబొమ్మ దగ్ధం చేసిన కాంగ్రెస్ శ్రేణులు



**వెంకటాపురం, జులై 22 (ప్రజాజ్యోతి) :** కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అక్రమ అరెస్టులను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. బుధవారం వెంకటాపురం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీపై విద్యార్థులకు మద్దతుగా శాంతియుత వాతావరణంలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్ర నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పోటీ పరీక్ష పేపర్ల లీకేజీ వల్ల ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతుందని మండిపడ్డారు. ఈ ఘటనలకు బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ఉపాధ్యక్షులు దనపనేని వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిడెం సాంబశివ రావు, జిల్లా నాయకులు మన్యం సునీల్, వెంకటాపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ సరస్వతి, బీసీ మర్రిగూడెం సర్పంచ్ రాజేశ్వరి, యూత్ అధ్యక్షులు చిట్టెం సాయి కృష్ణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చిట్యాల సాగర్ మాజీ ఎంపీటీసీ సీతాదేవి, నాయకులు పిల్లారిసెట్టి మురళి, డర్రా రవి, గుండుమల్ల కిరణ్, కుమ్మరి రామకృష్ణ, పిట్ట సాయిబాబు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గిరిజన ఆరోగ్య సేవలు, వైద్య పరిశోధనలకు ములుగులో అత్యాధునిక కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన





- ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ములుగు జిల్లా భ్యూరో చీఫ్ (ప్రజాజ్యోతి) :** గిరిజన ఆరోగ్య సేవలు, వైద్య పరిశోధనలను మరింత బలోపేతం చేసే దిశగా ములుగు జిల్లాలో అత్యాధునిక కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావును ఆయన ఛాంబర్‌లో బీబీనగర్ ఎయిమ్స్ డీన్ రిసెర్చ్ డాక్టర్ రాహుల్ నరాంగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలిసి, ములుగు జిల్లాలో సమ్మక్క - సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ సహకారంతో "సెంటర్ ఫర్ ట్రైబల్ హెల్త్ అండ్ అకడమిక్ ఎక్సలెన్స్" ఏర్పాటు చేసే ప్రతిపాదనపై చర్చించింది. ఈ సందర్భంగా ప్రతిపాదిత కేంద్రం లక్ష్యాలు, గిరిజన ఆరోగ్య సేవల బలోపేతం, వైద్య పరిశోధనలు, అకడమిక్ సహకారం, గిరిజనప్రాంతాల్లో ఆరోగ్య రంగ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతిపాదిత కేంద్రం ద్వారా గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన ఆరోగ్య సేవలను మరింత చేరువ చేయడం, తలసీమియా, రక్తహీనత, టెలీమెడిసిన్ సేవలను విస్తరించడం, సికిల్ సెల్ అనీమియా, మలేరియా, డెంగ్యూ, క్షయవ్యాధి, స్క్రబ్ టైఫస్, జునోసిస్ వ్యాధుల వంటి, గిరిజన ప్రాంతాల్లో అధికంగా కనిపించే వ్యాధులపై ప్రత్యేక పరిశోధనలునిర్వహించడం, గ్రామీణ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం, గిరిజన యువతకు ఆరోగ్య విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందించడం, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ప్రత్యేక శిక్షణ కల్పించడం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో వ్యాధుల పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను విస్తరించడం, ఎయిమ్స్ బీబీనగర్ - సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో వైద్య సేవలు, అకడమిక్ కార్యక్రమాలు, పరిశోధనలను విస్తరించే కార్యాచరణను రూపొందించడం ద్వారా ములుగు జిల్లాను గిరిజన ఆరోగ్య సేవలు, వైద్య పరిశోధనలు, ప్రజారోగ్య అధ్యయనాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డిఎంహెచ్ఓ)డాక్టర్ గోపాల్ రావు, ములుగు ఏరియా, జిల్లా ఆసుపత్రి, ఏటూరు నాగారం ఆసుపత్రుల సూపరింటెండెంట్లు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సురేష్, ఎయిమ్స్ వైద్య బృందం సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంది

- తరగతి గదిలోకి వచ్చిన ప్రతి విద్యార్థి విద్యావంతుడిగా బయటకు వెళ్లాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, జులై 22 (ప్రజాజ్యోతి) :** విద్యారంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని, అయితే వాటికి నిజమైన సార్థకత ఉపాధ్యాయుల బోధనా విధానంపైనే ఆధారపడి ఉంటుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ఆధునిక బోధన--అభ్యాసన పద్ధతులపై లింగాల ఘనపూర్ మండలం నెల్లుట్ల హై స్కూల్ లో నిర్వహిస్తున్న సమగ్ర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమానికి బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే నిరుపేద విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని పేర్కొన్నారు. తరగతి గదిలోకి వచ్చే ప్రతి విద్యార్థి విద్యావంతుడిగా, సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. ఉపాధ్యాయులు ప్రతిరోజూ పాఠ్యాంశాలపై ముందస్తు ప్రణాళికతో సిద్ధమై తరగతులకు హాజరై, విద్యార్థుల్లో నేర్చుకోవాలనే ఆసక్తిని పెంపొందించే విధంగా బోధించాలని సూచించారు. ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకతకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో, విద్యా వ్యవస్థలోనూ అదే స్థాయిలో పారదర్శకత, నాణ్యత ఉండాలన్నారు. విద్యార్థులకు భారత రాజ్యాంగంలోని ఉపోద్ఘాతం, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ప్రజాస్వామ్య విలువలు, ముఖ్యమైన రాజ్యాంగ ఆర్టికల్స్‌పై సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఉన్నత పాఠశాలలో ప్రపంచ పటం, భారతదేశ భౌతిక, రాజకీయ పటాలతో పాటు రాజ్యాంగంలోని ముఖ్యమైన అంశాలు, ఆర్టికల్స్‌ను ప్రదర్శించే సమాచార పట్టికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ప్రపంచం గురించి, దేశం గురించి, రాజ్యాంగం గురించి అవగాహన పెంపొందించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జియోగ్రఫీ ఎంతో ఆసక్తికరమైన సబ్జెక్ట్ అని పేర్కొన్న కలెక్టర్, ప్రపంచ దేశాలు, దీవులు, "గేట్ వే ఆఫ్ యూరప్" వంటి భౌగోళిక అంశాలతో పాటు ఎల్లోరా గుహలు, శిల్పకళా వైభవం, ఎకనామిక్స్‌లో డిమాండ్--సప్లై, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల విధులు, ఎన్నికల కమిషన్ బాధ్యతలు వంటి అంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ప్రపంచ పటంలో వివిధ దేశాల స్థానాలు, భౌగోళిక అంశాలపై ప్రశ్నించి వారి పరిజ్ఞానాన్ని కలెక్టర్ పరిశీలించారు.

విద్యార్థులకు అన్ని విషయాలు ఒకేసారి తెలియవని, కానీ తెలుసుకోవాలనే ఆసక్తిని కలిగించడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని అన్నారు. అనంతరం కలెక్టర్ పదవ తరగతి గదిని సందర్శించి, గణితంలోని పలు అంశాలను విద్యార్థులకు సులభ పద్ధతిలో వివరించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి, వారి అభ్యాస సామర్థ్యాన్ని పరిశీలించి, మరింత కృషి చేసి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు.

## సమృద్ధి వర్షాల కోసం వరుణయాగం






**భీమదేవరపల్లి, జూలై 22 (ప్రజా జ్యోతి) :** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండలంలోని కొత్తకొండ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో బుధవారం వరుణయాగం నిర్వహించారు. అనంతరం స్వామివారికి 108 కలశాలతో మహాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాకతీయుల కాలం నాటి మహిమాన్విత క్షేత్రమైన కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయం ప్రజల విశ్వాసానికి ప్రతీక అని అన్నారు. ఎల్‌నినో ప్రభావం తొలగిపోయి రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండి పాడిపంటలు సమృద్ధిగా పండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు ఎల్‌నినో ప్రభావంపై హెచ్చరిస్తున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో వరుణయాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజల సంక్షేమం, సమృద్ధి వర్షాల కోసం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణతో పాటు దేశమంతా సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. అనంతరం ఆలయ ఈవో కిషన్‌రావు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేయగా, ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, జాలి ప్రమోద్‌రెడ్డి, గోపగాని తిరుపతి, మాడుగుల కొమురయ్య, ఆలయ ఈవో కిషన్‌రావు, యూత్ కాంగ్రెస్ నాయకులు నరేందర్, జక్కుల అనిల్, చిటుకూరి అనిల్, పోగుల శ్రీకాంత్, సీనియర్ నాయకులు మంగ రామచంద్రం, ఉసకోయిల ప్రకాశ్, కొలుగూరి రాజు, ఆదరి రవీందర్, చంద్రశేఖర్ గుప్తా, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఆలయ అర్చకులు, రాజయ్య, మొగిలిపాలెం రాంబాబు, వినయ్ శర్మ, సందీప్, శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ, వివాహ హామీ..

**పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఆరోపణ.. న్యాయం చేయాలని బాధితురాలి వినతి**

**చివరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**



**పర్వతగిరి, జూలై 14 (ప్రజాజ్యోతి) :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామానికి చెందిన ఓ యువతిని, వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేశారని ఆరోపిస్తూ పర్వతగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు సమర్పించిన ఫిర్యాదు ప్రకారం, తమ గ్రామానికి చెందిన ఓ యువకుడు గత కొంతకాలంగా ప్రేమ పేరుతో సన్నిహితంగా ఉంటూ వివాహం చేసుకుంటానని పలుమార్లు హామీ ఇచ్చాడని పేర్కొంది. ఆ నమ్మకంతో తమ మధ్య సన్నిహిత సంబంధం ఏర్పడిందని, అనంతరం యువకుడు మాట మార్చి వివాహానికి నిరాకరించడంతో పాటు అవమానకరంగా మాట్లాడి, బెదిరింపులకు కూడా పాల్పడ్డాడని ఆరోపించింది. ఈ విషయమై గ్రామ పెద్దల సమక్షంలో రాజీ ప్రయత్నాలు జరిగినప్పటికీ ఫలితం లేకపోయిందని, తనను అవమానించిన మరికొందరిపైనా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్లు తెలిసింది. ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేసి, వివాహానికి నిరాకరించడం వల్ల తాను తీవ్ర మానసిక వేదనకు గురయ్యానని పేర్కొన్న బాధితురాలు, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన కేసు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు నిర్వహించి తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరింది.

## ప్రతి ఇంటికి ఐదు మొక్కలు పంపిణీ

ప్రారంభించిన సర్పంచ్ దాసరి రమేష్



**ఖానాపురం/జూలై 22 (ప్రజాజ్యోతి) :** ఖానాపురం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి ఇంటికి ఐదు మొక్కల పంపిణీ కార్యక్రమం సర్పంచ్ దాసరి రమేష్ ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సంరక్షణ కోసం గ్రామంలోని ప్రతి ఇంటికి 5 మొక్కల చొప్పున పంపిణీ చేస్తున్నాం. ఇందులో పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు, పూల మొక్కలు ఉన్నాయన్నారు. హరిత హారం లక్ష్యాలకు అనుగుణంగా గ్రామాన్ని పచ్చదనంతో నింపడమే లక్ష్యం అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత కూడా ప్రతి కుటుంబం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, వార్డు సభ్యురాలు గుండ్లపల్లి మంజుల, ఫీల్డ్ అసిస్టెంట్ యాకయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**వెంకటాపురం, జూలై 22 (ప్రజాజ్యోతి) :** ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆలుబాకలో బుధవారం నిర్వహించిన జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ క్రాంతి కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి ఆశ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బాలింతలు గర్భిణులను సకాలంలో వైద్యశాలకు తరలించాలని ఆదేశించారు. వారానికి రెండు రోజులు ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు. ఇంటింటి మలేరియా సర్వే చేపట్టి, జ్వర పీడితులను గుర్తించి రక్త నమూనాలను సేకరించాలని సూచించారు. అవసరమైన చోట ఆర్డిటి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, భోజనం చేసే ముందు సబ్బుతో చేతులను కడుక్కోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. దగ్గు జలుబు తలనొప్పి వంటి లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా సమీప వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని అన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి పీహెచ్సీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్పిహెచ్ మనోహర్, హెచ్ఈఓ కోటిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఉపాధ్యాయులు ఎక్కడ..?

### పాఠశాలను ముట్టడించిన గ్రామస్తులు

- లాంగ్ లీవ్ అంటూ రోజులు గడుపుతున్న ఉపాధ్యాయులు
- గిరిజన విద్యార్థులకు ప్రశ్నార్థకంగా చదువు
- బాధ్యులపై శాఖ పరమైన కఠిన చర్యలు తీసుకోవాలి

**పలిమెల జూలై 22 (ప్రజా జ్యోతి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం ముకునూరు గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో ముకునూరు గ్రామస్తులు బుధవారం రోజున పాఠశాలను చుట్టుముట్టారు. మండలంలోని ముకునూరు ఎంపీపీ ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠశాలను గ్రామస్తులు చుట్టుముట్టి నిరసనలు తెలుపుతూ ప్రభుత్వం గిరిజన విద్యకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి దారుణంగా ఉందని గ్రామస్తులు తెలుపుతూ ఉపాధ్యాయులు లేకపోవడంతో పిల్లల చదువులు ఆగమ్య గోచరంగా మారాయని ఉపాధ్యాయులు లాంగ్ లీవ్ అంటూ నెలకు రెండు రోజులు లేక మూడు రోజులు మాత్రమే వస్తున్నారని దీంతో పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారిందని, నెలకు రెండు మూడు రోజులు వచ్చి ఉపాధ్యాయులు సంతకాలు పెట్టి పూర్తి జీతం పొందుతున్నారని, పిల్లలకు పాఠాలు చెప్పేవారు లేక మధ్యాహ్న భోజనం కూడా సరిగ్గా అమలు కాకపోవడం తో పిల్లల భవిష్యత్తు ఇబ్బందులలో పడిందని ఓపిక నశించి పిల్లల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు ఏకంగా పాఠశాలను చుట్టిముట్టి ఆందోళన చేస్తూ మా పిల్లల చదువుకోకుండా ఇంటికి పరిమితం అవుతున్నారని ప్రభుత్వ పాఠశాల అంటే ఇదేనా అని ప్రశ్నిస్తూ గిరిజన పిల్లల చదువు గురించి ఎవరు పట్టించుకోవడం లేదు అని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులైన వారిపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

## పలిమెల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యం**

**పలిమెల జులై 22 (ప్రజా జ్యోతి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండల పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ శిరిశెట్టి సంకీర్త్ బుధవారం రోజున ఆకస్మిక తనికీలు నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణను మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేసే దిశగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పలిమెల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ ఆకస్మిక తనిఖీలో భాగంగా ఎస్పీ పోలీస్ స్టేషన్‌లోని పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించడం తో పాటు స్టేషన్ రికార్డులు, క్రైమ్ రిజిస్టర్లు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, అలాగే స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాల పనితీరును, వాటి కవరేజీని ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. దీంతో పాటు స్టేషన్ ప్రాంగణంలో పరిశుభ్రతను పరిశీలించి, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదగా వ్యవహరించాలని, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును వేగవంతం చేయాలని, నేరస్థులకు తగిన శిక్ష పడేలా చట్టపరమైన ఆధారాలను సేకరించాలని సూచించారు. నిరంతరం గస్తీ పెట్రోలింగ్ నిర్వహిస్తూ, రాత్రి వేళల్లో తనిఖీలు తీవ్రతరం చేయాలన్నారు. నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీపడేది లేదని స్పష్టం చేశారు. నేరాల నివారణలో సాంకేతికత పాత్ర కీలకమైనదని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజల రక్షణే ధ్యేయంగా సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పలిమెల ఎస్ఐ సాయి శశాంక్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టుపై కాంగ్రెస్ ఆగ్రహం

మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేసి నాగారంలో నిరసన

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం:

మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట బిక్షం

నాగారం జూలై 22 ప్రజా జ్యోతి:
లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును నిరసిస్తూ బుధవారం నాగారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాగారం బంగ్లా క్రాస్‌రోడ్ వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కన్నెబోయిన వెంకట బిక్షం మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య



విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతూ నిరంకుశ పాలన సాగిస్తోందని విమర్శించారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నించిన బీజేపీ ప్రభుత్వం, అదే రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించడం దురదృష్టకరమని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ పానుగంటి నరసింహారెడ్డి, సర్పంచ్ బయ్యం సుజాత వెంకన్న, కాంగ్రెస్ నాయకులు ఎలమకంటి సోమయ్య, వంగూరి బిక్షం, అనంతుల వెంకటయ్య, కసిరెడ్డి రాంరెడ్డి, వల్లాల భానుప్రకాశ్, కొలిపాక సాయికుమార్, గద్దల సైదులు, చిప్పలపల్లి సోమయ్య, లింగయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్రను జయప్రదం చేయండి

నార్కట్ పల్లి, జూలై 22 ( ప్రజా జ్యోతి ): కల్లు గీత వృత్తిలో ప్రమాదాల నివారణ వన రక్షణ, ఉపాధి, సంక్షేమం,ప్రభుత్వం తీసుకోవలసిన చర్యల గురించి 2026 ఆగస్టు రెండు నుండి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని గీతన్నల చైతన్య యాత్ర పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు




పామనగుండ్ల అచ్చాలు మాట్లాడుతూ, ఆగస్టు రెండు నుండి బయలుదేరిన బస్సు యాత్ర ఆరవ తారీఖున నల్లగొండ జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని ఆయన తెలిపారు. ఈ జిల్లాలో కార్మికులు దాదాపు 20,25 వేల కల్లుగీత కార్మికులు కల్లు గీతా వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తిలో మార్పులు తీసుకవచ్చి ప్రమాదాలను నివారించాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలు మనకు ఇచ్చిన హామీలు పెన్షన్ 4000 రూపాయలు, ఎక్స్గ్రేషియా 10 లక్షలు చెట్ల పెంపకానికి భూమి తదితర డిమాండ్లను పరిష్కారం చేయుటకై ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన అన్నారు. మనకోసం పోరాడి అమరులైన కామ్రేడ్ ధర్మ బిక్షం, తోట్ల మల్సూరు, బైరు మల్లయ్య, వర్ధల్లి బుచ్చిరాములు,బాధిని చెన్నయ్య,లాంటి ఎందరో త్యాగమూర్తులను యాది చేసుకుంటూ ఈ యాత్ర కొనసాగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొప్పు శ్రవణ్, కార్యదర్శి కల్లూరి కంట్లమహేశ్వర్, మాజీ సర్పంచ్ పుల్లెంల అచ్చాలు,బుడిగ నరసింహ, పుల్లెంల మహేష్,శ్రవణ్, సాయి,వేముల నరసింహ, బోయపల్లి భూషణ్,తదితరులు పాల్గొన్నారు.

## మహిళల శక్తి చాటాలి

–జాతీయ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి యల్లావుల ఉమా


హుజూర్ నగర్ జూలై 22 (ప్రజా జ్యోతి):
సమస్యల పరిష్కారంలో మహిళల శక్తిని చాటాలని జాతీయ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి యల్లావుల ఉమా అన్నారు.బుధవారం భారత జాతీయ మహిళా సమాఖ్య



సూర్యాపేట జిల్లా నాలుగవ మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక రాజకీయ సమానత్వం గౌరవప్రదమైన జీవితం అందించే లక్ష్యంతో మహిళా సమాఖ్య పనిచేస్తుందన్నారు. మహాసభలలో సమాఖ్య కార్యక్రమాలను సమీక్షించుకొని, మహిళల సమస్యలపై భవిష్యత్తు పోరాట దిశను నిర్ణయించే విధానాలు రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు సింగినం పుల్లమ్మ,లలిత, వీరమ్మ,జ్యోతి,రాజేశ్వరి, గాయత్రి,రవళి,శోభ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణతో ఉద్యోగం.. యువతకు సువర్ణావకాశం

భూదాన్ పోచంపల్లి, జూలై 22 (ప్రజాజ్యోతి):
మండలం జలాల్ పూర్ లోని స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో




యువతకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అకౌంట్స్ అసిస్టెంట్ (ట్యాలీ ప్రైమ్), బేసిక్ కంప్యూటర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, అడ్వాన్స్‌డ్ వెల్డింగ్, ఈవీ టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణతో పాటు ఉద్యోగ కల్పన సహాయం అందించనున్నారు. 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల అర్హులైన అభ్యర్థులు జూలై 27లోగా దరఖాస్తు చేసుకోవాలని సంస్థ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, కుల ధృవీకరణ పత్రం, ఫొటోలతో సంస్థను సంప్రదించాలని సూచించారు. ఇంకా వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111సంప్రదించాలని తెలిపారు.

# ప్రజాస్వామ్యాన్ని తుపాకులతో కాల్చలేరు

**మోదీ వెంటనే రాజీనామా చేయాలి**

**వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న**

**రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు**

తుంగతుర్తి,జూలై 22,(ప్రజా జ్యోతి):
ఢిల్లీలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ పార్టీ నేతలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ ఆదేశాల మేరకు తుంగతుర్తి మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద బుధవారం శాంతియుత ధర్నా నిర్వహించారు. నిరసనలో పాల్గొన్న నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ తూట్లు పొడుస్తూ ఖూనీ చేస్తున్న మోదీ వెంటనే ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల ప్రశ్నాపత్రాల విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడం దేశానికి మంచిది కాదని,



మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న మాట్లాడుతూ.... ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్ష గొంతును అణచివేయడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు.ప్రజాస్వామ్యంలో తుపాకులు ఎక్కుపెట్టి లీకేజీపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పరీక్షల లీకేజీలపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, యువత, రైతుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని నాయకులు స్పష్టం చేశారు. అలాగే 2029 ఎన్నికల్లో రాహుల్ గాంధీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ గంగరాజు, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బికోజి, కేశవాపురం సర్పంచ్ మిట్ట గడుపుల శ్రీను,నాయకులు నల్లు రామచంద్రారెడ్డి,దాసరి శ్రీను, మాచర్ల అనిల్, కొండ రాజు, పెద్దబోయిన అజయ్, అబ్దుల్,గుగులోతు భాస్కర్, సతీష్ యాదవ్, గుగులోతు రవీందర్,సంజీవ, వెంకటేష్,నాగరాజు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ, ఇండియా కూటమి నేతల అరెస్టును తీవ్రంగా ఖండించిన దైద రవీందర్

నకిరేకల్ జూలై 22 ప్రజా జ్యోతి:
నకిరేకల్ నియోజకవర్గం: ఢిల్లీలో జరిగిన శాంతియుత నిరసన కార్యక్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ తీవ్రంగా ఖండించారు.
ఈ సందర్భంగా దైద రవీందర్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని, అలాంటి రాజ్యాంగబద్ధమైన హక్కును కాలరాస్తూ ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజల తరపున ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆయన విమర్శించారు. రైతులు, యువత, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు, అణగారిన



వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ మరియు ఇండియా కూటమి నాయకులపై ఇటువంటి నిర్బంధ చర్యలు చేపట్టడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే చర్య అని పేర్కొన్నారు. అరెస్టులతో ప్రజల గొంతును ఎవరూ అణచలేరని స్పష్టం చేశారు. రాజకీయ కక్షసాధింపు ధోరణిని కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకుని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని, ప్రతిపక్ష నాయకులపై వేధింపులు, అక్రమ అరెస్టులు వంటి చర్యలను తక్షణమే నిలిపివేయాలని దైద రవీందర్ డిమాండ్ చేశారు.
ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని, ప్రజల హక్కులు, స్వేచ్ఛలను హరించే చర్యలు దేశ ప్రజాస్వామ్యానికి తీవ్ర హానికరమని అన్నారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ మరియు ఇండియా కూటమి నాయకుల అరెస్టును తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని దైద రవీందర్ స్పష్టం చేశారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రిని బర్తరఫ్ చేసేంతవరకు ఉద్యమం ఆగదు

చైర్పర్సన్ తిరుపతమ్మ సుధీర్

నడిగూడెం, జులై 22 ,ప్రజా జ్యోతి:
నీట్ పేపర్ లీకేజ్ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని లేనిపక్షంలో ప్రధాని మోదీ విద్యా మంత్రిని బర్తరఫ్ చేయాలని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ మేరకు రాష్ట్ర మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల ఆదేశం మేరకు నడిగూడెం మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్ నందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ



పర్సన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంటులో నీట్ పై చర్చ పెట్టాలని కోరుతూ మంగళవారం సాయంత్రం ప్రధాని మోదీ ఇంటి ముందు శాంతి యుతంగా ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ కర్గే, కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ,కేసీ వేణుగోపాల్ లను అక్రమఅరెస్టు ను నిరసిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుదీర్ మాట్లాడుతూ 22 లక్షల మంది అభ్యర్థుల జీవితాలతో చెలగాటమాడిన బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని, అమరులైన 22 మంది విద్యార్థులకు కోటి రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను మంత్రి మండలి నుండి బర్తరఫ్ చేయాలన్నారు.నీట్ అంశంపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలన్నారు.భారత ప్రధాని నరేంద్ర మోడీ మౌనం వీడాలని డిమాండ్ చేశారు.అనంతరం నల్ల రిబ్బన్లు నోటికి కట్టుకొని నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కేంద్ర సర్పంచ్ దున్నా శ్రీనివాస్,వివిధ గ్రామాల సర్పంచులు భూత్కూరి వెంకటరెడ్డి, కంభంపాటి సరిత చైతన్య,వేల్పుల సోమయ్య,దాట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు శ్రీనివాస్, కార్యదర్శి గుర్రం నీలిమ గాంధీ, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పందిరి వెంకటరెడ్డి,గడ్డం మల్లేష్ యాదవ్, దేవబత్తిని రమేష్ ప్రసాద్,పాతకోట్ల నాగేశ్వరరావు, కాసాని శివలింగం, తుమ్మల సుబ్బారావు,బొద్దు గోవర్ధన్,గుండు విజయ రామారావు, అనంతుల ఉపేందర్, నూకపంగు వెంకటేశ్వర్లు బాణాల సతీష్ కుమార్, నేలమర్రి శ్యామ్,షేక్ మౌలానా,పల్లపు గోపాల్,కంభంపాటి శ్రీనివాస్,కాసాని శివకృష్ణ,గుంజ తిరుమలేష్, శ్రీరాముల శ్రీనివాస్, కొల్లి వెంకట్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిరీక్షణ ఇంకెన్నాళ్ళు..!?

**లబ్ధిదారుల బుక్ చేసినా రాని ఇసుక**

**రెండు నెలలుగా ఎదురుచూపులు**

**నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు..**

**పెరుగుతున్న అదనపు భారం**

**సరఫరాలో జాప్యంపై ఆందోళన**

**వెంటనే ఇసుక సరఫరా చేపట్టాలి**

**అధికారులకు బాధితుల విజ్ఞప్తి**

నాగారం జూలై 22 ప్రజా జ్యోతి:
నాగారం మండలం పేరబోయినగూడెం ఇసుక రీచ్ నుంచి ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్న లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుకింగ్ చేసి రెండు నెలలు గడిచినా ఇసుక ఇంటి వద్దకు చేరకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పారదర్శకంగా ఇసుక సరఫరా కోసం ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నప్పటికీ, పేరబోయినగూడెం రీచ్ నుంచి బుక్ చేసిన ఇసుక సకాలంలో అందడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. దీంతో నిర్మాణ పనులు నిలిచిపోవడంతో పాటు సిమెంట్, ఇనుము వంటి నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో అదనపు ఆర్థిక భారం పడుతోందని వాపోతున్నారు. ఇసుక ఎప్పుడు సరఫరా అవుతుందనే విషయంపై స్పష్టమైన సమాచారం లేకపోవడంతో బుక్ చేసుకున్న వినియోగదారులు అయోమయంలో ఉన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఇసుక సరఫరాను వేగవంతం చేయాలని, ఆలస్యానికి గల కారణాలను వెల్లడించి సమస్యను పరిష్కరించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. రెండు నెలలుగా ఎదురుచూస్తున్నా ఇసుక అందడం లేదు. మా ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. అధికారులు వెంటనే స్పందించి ఇసుక సరఫరా చేయాలి అని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## హోటళ్లు, రెస్టారెంట్లపై మున్సిపల్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

హుజూర్‌నగర్, జూలై 22: (ప్రజా జ్యోతి):
హుజూర్‌నగర్ పురపాలక సంఘ పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లపై బుధవారం మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా హోటళ్ల వంటగదులు, ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాల పరిశుభ్రతను అధికారులు పరిశీలించారు. నిబంధనలు పాటించని






మూడు సంస్థలకు జరిమానాలు విధించారు. వారాహి ధాబాకు రూ.3,000, దుర్గాభవాని ధాబాకు రూ.2,000, అభిరుచి ఫ్యామిలీ రెస్టారెంట్‌కు రూ.1,000 చొప్పున జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. అశోక్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ బి. మమత, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ఎ. రాజశేఖర్, కంప్యూటర్ ఆపరేటర్ బి. సైదులు, పారిశుధ్య జవాన్లు జి. వెంకటేశ్వర్లు, వి. శ్రీనివాసరావు, ఎం. దుర్గారావు, రాము తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హుజూర్‌నగర్, జూలై 22: (ప్రజా జ్యోతి):
హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బుధవారం కళాశాల ప్రిన్సిపల్ ఎస్. రామారావు తెలిపారు.



కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, గణితశాస్త్రం, తెలుగు సబ్జెక్టుల్లో ఒక్కొక్క పోస్టు చొప్పున అతిథి అధ్యాపకులను నియ మించ నున్నట్లు పేర్కొన్నారు.సంబంధిత సబ్జెక్టులో ఓసీ, బీసీ అభ్యర్థులకు పీజీలో కనీసం 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్/స్లెట్ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్/స్లెట్ అర్హత కలిగిన అభ్యర్థులు అందుబాటులో లేని పక్షంలో సంబంధిత పీజీ అర్హతతో పాటు బోధనా అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించి అనుభవ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు విద్యార్హతలు, అనుభవ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులను జతచేసి జూలై 27వ తేదీ సాయంత్రం 4:30 గంటలలోగా హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్యాలయంలో నేరుగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

## ప్రజాస్వామ్య హక్కులపై దాడి చేస్తున్న మోడీ ప్రభుత్వం

పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గెల్లి రవి

హుజూర్ నగర్, జూలై 22 (ప్రజా జ్యోతి):
శాంతియుతంగా నిరసన తెలియజేసే హక్కు భారతదేశం లో ప్రతి పౌరుడుకి ఉందని నేడు దేశంలో మోడీ పాలనలో ప్రజాస్వామ్య హక్కులపై దాడి జరుగుతుందని హుజూర్ నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గెల్లి రవి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఇందిరా చౌక్ సెంటర్ నందు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను



దగ్ధం చేసి మాట్లాడారు...నీట్ ఎగ్జామ్ పేపర్ లీకేజీ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులపై దాడిని నిరసిస్తూ లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ప్రధాని మోడీ ఇంటి ఎదుట నిరసన తెలుపుతుండగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేసి,ఈడ్చుకెల్లడం ప్రజాస్వామ్య హక్కుపై కేంద్ర ప్రభుత్వం దాడి చేసిందన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు,విద్యార్థులపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండించారు.మోడీ ప్రభుత్వం అక్రమంగా పోలీసుల అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్,బెల్లంకొండ శ్రీను, అజీజ్ పాషా,సుబ్బరాజు, శివరాం,గల్లా వెంకటేశ్వర్లు, గోవిందరావు,తదితరులు,పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా ఖేడ్‌లో ధర్నా



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 22:** ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ఇతర ముఖ్య నేతల అరెస్టును నిరసిస్తూ నారాయణఖేడ్ పట్టణంలోని ఇంద్ర చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కార్ ఆదేశాల మేరకు నిర్వహించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు,



కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య గొంతుకను అణిచివేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ ధర్నాలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### శ్రీ సాయి సంజీవని
# ఆసుపత్రిలో వాస్కులర్ సర్జరీ ఓపీడీ సేవలు



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 22:** నారాయణఖేడ్ పట్టణంలోని శ్రీ సాయి సంజీవని ఆసుపత్రిలో వాస్కులర్ సర్జరీ ఓపీడీ సేవలు అందుబాటులో ఉంటాయని ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ జగన్ మోహన్, డాక్టర్ సుష్మ తెలిపారు. వారు ఒక ప్రకటనలో పేర్కొంటూ.. వాస్కులర్ సర్జరీ నిపుణులు డాక్టర్ కె. అతిరేధ్ ఆగస్టు 4న ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేరికోజ్ వెయిన్స్‌కు లేజర్ మరియు గ్లూ థెరపీ, డీప్ వెయిన్ థ్రాంబోసిస్ (డి.వి.టి), గ్యాంగ్రీన్ ఫుట్, డయాలసిస్ కోసం ఏవీ ఫిస్టులా (ఏ.వి ఫిస్టుల), పెరిఫెరల్ ఆర్టరీ వ్యాధులు తదితర సమస్యలకు ప్రత్యేక వైద్య సేవలు, చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలు మరియు ముందస్తు అపాయింట్‌మెంట్ కోసం 76619 99947, 88861 30320 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### కంగ్టిలో బేటి బచావో
# బేటి పడావో అవగాహన కార్యక్రమం






**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 22:** మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో కంగ్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మండల కేంద్రంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో బేటి బచావో--బేటి పడావో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ నారాయణఖేడ్ ప్రాజెక్టు సీడీపీఓ ఎన్. సుజాత మాట్లాడుతూ..బాలికల విద్య, భద్రత, హక్కులు, సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రతి బాలిక విద్యను అభ్యసించి స్వయం సమృద్ధి సాధించేలా సమాజం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త గడ్డం పల్లవి మాట్లాడుతూ.. బాలికలు విద్యతో పాటు ఆరోగ్యం, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆత్మవిశ్వాసం, స్వీయ రక్షణ అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం బాలికల సాధికారత, విద్య, భద్రతపై ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎండి రహిమొద్దీన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగమణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ కులకర్ణి, ఏఎస్ఐ రవీందర్ గౌడ్, షీ టీమ్ ఏఎస్ఐ తులసిరాం, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### సంగారెడ్డిలో రాహుల్ గాంధీ
# అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ మహా ధర్నా





**కల్హే ర్. 23.జూలై. ప్రజాజ్యోతి** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో కల్హేర్ మండలానికి చెందిన సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కల్హేర్ సర్పంచ్ కోడి గంగారాం, కల్హేర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్ గౌడ్, మండల ఎమాజీ అధ్యక్షుడు బి. పోచయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవదాస్,. పి వెంకటరెడ్డి, వై.ఎన్. రవీందర్ రెడ్డి, మలిదొడ్డి తుకారాం, నాగ్దర్ పోచయ్య, యువ నాయకులు, మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని వారు తెలిపారు.

# ఉత్సాహంగా గణిత బోధన శిక్షణ: ఎంఈఓబి సురేష్

**కల్హేర్, జూలై 22:. ప్రజా జ్యోతి.** సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన కల్హేర్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్త్యంతర శిక్షణ కార్యక్రమం బుధవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గణిత శాస్త్రంపై రిసోర్స్ పర్సన్ భరత్ ప్రత్యేక శిక్షణ అందించారు. శిక్షణలో భాగంగా విద్యార్థుల్లో గణితం పట్ల ఉన్న భయాన్ని తొలగించి, సులభమైన బోధనా పద్ధతుల ద్వారా లెక్కలను ఆసక్తికరంగా నేర్పించే విధానాలను ప్రత్యక్ష బోధనతో వివరించారు. మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా ఆధునిక బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు తమ తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంయు బి సురేష్ సహచర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# “విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే సహించం”

### ★‘చలో లోక్ భవన్’లో కేంద్రంపై మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్ర విమర్శలు






**అందోల్, (ప్రజాజ్యోతి):** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశ రాజకీయాల్లో మరోసారి వేడిని రాజేసింది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసిన ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన “చలో లోక్ భవన్” కార్యక్రమంలో తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కేంద్రంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పేపర్ లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఏళ్ల తరబడి కష్టపడి పోటీ పరీక్షలకు సిద్ధమవుతుంటే, పేపర్ లీకుల వంటి ఘటనలు వారి ఆశలను దెబ్బతీస్తున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. “మా శ్రమకు విలువ లేదా?” అనే విద్యార్థుల ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ సమాధానం చెప్పలేకపోయిందని విమర్శించారు. సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న విద్యార్థుల గొంతు అణచివేయడానికి పోలీసులను వినియోగిస్తోందని ఆరోపించారు.నీట్ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో పాటు ఇతర నాయకులను అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మంత్రి అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే స్వరాలను బలప్రయోగంతో అణచివేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు.

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే: దామోదర్**

నీట్ కుంభకోణానికి పూర్తి నైతిక బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని పేర్కొన్న మంత్రి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోకుండా, న్యాయం కోరుతున్న విద్యార్థులను అణచివేయడం దేశ ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు.

**సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు కోరిన మంత్రి**

నీట్ పేపర్ లీక్‌తో పాటు దేశవ్యాప్తంగా జరిగిన పోటీ పరీక్షల అక్రమాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర దర్యాప్తు జరిపించాలని దామోదర్ రాజనర్సింహ డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచేందుకు సాంకేతిక, పరిపాలనా సంస్కరణలు చేపట్టి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

**రాజకీయంగా ముదురుతున్న వివాదం**

నీట్ పేపర్ లీక్ అంశాన్ని కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమంగా మలుస్తుండగా, కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాల ఒత్తిడి రోజురోజుకూ పెరుగుతోంది. విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షల విశ్వసనీయత, బాధ్యులపై చర్యల అంశాలు ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే తదుపరి నిర్ణయాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

### 24 గంటల్లో చోరీ
# కేసు ఛేదించిన పోలీసులు




**రాయికోడ్ జూలై 22 (ప్రజా జ్యోతి):** స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగాపూర్ గ్రామంలో జరిగిన చోరీ కేసును పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌హెచ్‌వో చైతన్య కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగాపూర్ గ్రామానికి చెందిన కాలిమొల్ల నాగేష్ ఇంట్లో జూలై 18న గుర్తుతెలియని వ్యక్తి తాళం పగులగొట్టి సుమారు 20 తులాల వెండి పట్టీలు,శాంసంగ్ మొబైల్ ఫోన్‌ను అపహరించాడు.మొత్తం చోరీకి గురైన ఆస్తి విలువ రూ.36 వేలుగా గుర్తించారు.ఈ ఘటనపై జూలై 21న పోలీస్ స్టేషన్‌లో క్రైం నెం. 87/2026గా బీఎన్ఎస్ సెక్షన్లు 331(3),303(2) కింద కేసు నమోదు చేశారు. వెంటనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలు,శాస్త్రీయ సాక్ష్యాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సంగాపూర్ గ్రామానికి చెందిన మడిగడ్డ బసవరాజ్‌ను నిందితుడిగా గుర్తించి 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని గౌరవ న్యాయస్థానంలో హాజరుపరచగా,కోర్టు జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌హెచ్‌వో చైతన్య కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి నేరాల నియంత్రణలో సహకరించాలని రాయికోడ్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐఆర్ పై సమీక్ష

### ★ గడువులోగా ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశం



**పటాన్‌చెరు (ప్రజాజ్యోతి)** పటాన్‌చెరు నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) సమీక్ష నిర్వహించారు. పటాన్‌చెరు నియోజకవర్గ కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో సహాయ ఓటరు నమోదు అధికారులు (ఏఈఆర్‌వోలు), బీఎల్‌వో సూపర్వైజర్లతో పాటు సంబంధిత శాఖల అధికారులతో కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, ఎఎస్‌డీ (ఊహణ) పరిశీలన, రేషనలైజేషన్, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దశలో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూనే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు ఖచ్చితంగా నమోదు అయ్యేలా బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పనిచేయాలని తెలిపారు. ఓటర్ల వివరాల సేకరణ, ధ్రువీకరణ, డిజిటలైజేషన్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పెండింగ్ అంశాలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని తహశీల్దార్ లు, డిప్యూటీ కమిషనర్ లు, మున్సిపల్ కమిషనర్లు, సహాయ ఓటరు నమోదు అధికారులు, బీఎల్‌వో సూపర్వైజర్ లు, పాల్గొన్నారు.

### తెలంగాణ జలసిరి పథకం ద్వారా
# భూగర్భ జలాల సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం

### ★ రైతులకు నీటి భద్రతే లక్ష్యంగా నీటి సంరక్షణ పనులు ★ ఎంపీడీవో హరినందన్ రావు



**కల్హేర్, జూలై 22 (ప్రజాజ్యోతి):** భూగర్భ జలాల సంరక్షణతో పాటు రైతులకు శాశ్వత నీటి భద్రత కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా “తెలంగాణ జలసిరి” కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎంపీడీవో హరినందన్ రావు తెలిపారు. “ప్రతి నీటి బొట్టు -- భవిష్యత్తుకు బలం” అనే నినాదంతో ఈ కార్యక్రమం కింద వర్షపు నీటిని ఒడిసిపట్టే పలు నీటి సంరక్షణ నిర్మాణాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు (మ్యాజిక్ సోక్ పిట్స్), ఫార్మ్ పాండ్స్, ఊట కుంటలు (పెర్కొలేషన్ ట్యాంకులు), బోర్ రీచార్జ్ నిర్మాణాలు, వ్యవసాయ బావుల తవ్వకం వంటి పనులను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీటి ద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు రైతులకు సాగునీటి కొరత గణనీయంగా తగ్గే అవకాశం ఉందని వివరించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వివిధ పరిమాణాల్లో ఫార్మ్ పాండ్స్, రీచార్జ్ పిట్స్, పెర్కొలేషన్ ట్యాంకులు నిర్మించడంతో పాటు బోర్‌వెల్ రీచార్జ్ వ్యవస్థలను కూడా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ చర్యల ద్వారా భూగర్భ జలాల పునరుద్ధరణతో పాటు వ్యవసాయానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అధికారులు రైతులు, ప్రజలకు “నీటిని ఆదా చేయండి -- భవిష్యత్తును కాపాడండి” అనే సందేశాన్ని అందిస్తూ, వర్షపు నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ రఘువీర్ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో అనువైన స్థలాలను గుర్తించి సోక్ పిట్స్ తదితర నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందన్నారు. ప్రజలు స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ల సలహాలు, సహకారం తీసుకుని నిర్మాణాల విధివిధానాలపై పూర్తి అవగాహన పొందాలని, ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిసర గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కోరుతున్నారు.

# ఏఐఎఫ్‌బీ పార్టీలో చేరికలు




**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 22:** ఏఐఎఫ్‌బీ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో ఎస్. చిరంజీవి ఆధ్వర్యంలో సుమారు 60 మంది చేరినట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోజి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి. రాములు యాదవ్ తెలిపారు. బుధవారం నారాయణఖేడ్ పట్టణంలో నిర్వహించిన ఏఐఎఫ్‌బీ జిల్లా స్థాయి విస్తృత సమావేశానికి హాజరైన రాష్ట్ర నాయకులు పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జోజి రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణలో ఏఐఎఫ్‌బీ పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలు, విధానాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి బి. రాములు యాదవ్ మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తెలంగాణలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్. చిరంజీవిని ఏఐఎఫ్‌బీ జిల్లా కన్వీనర్‌గా నియమిస్తూ పార్టీ నాయకత్వం బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, మోచప్ప, గణేష్ సోయల్, శోభ, పండరి తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మునగ పంటలో సమగ్ర పోషక
# యాజమాన్యంపై రైతులకు అవగాహన

**రాయికోడ్ జూలై 22 (ప్రజా జ్యోతి):** మండలంలోని నల్లంపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మునగ పంటలో సమగ్ర పోషక యాజమాన్య (ఐ ఎన్ ఎం) అంశంపై క్షేత్ర ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సారిక (ఎంఎఓ),వ్యవసాయ సాంకేతిక నిర్వాహకుడు (ఎటిఎం) శ్రీ రమేష్,వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) శ్రీ నిఖిలేష్ పాల్గొని రైతులకు మునగ పంటలో శాస్త్రీయ సాగు విధానాలు,సమతుల్య పోషక నిర్వహణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మునగ పంటలో అధిక దిగుబడులు,నాణ్యమైన ఉత్పత్తి సాధించాలంటే సేంద్రియ ఎరువులు,రసాయన ఎరువులు,సూక్ష్మ పోషకాలను సమతుల్యంగా వినియోగించడం అవసరమన్నారు.నేల పరీక్ష ఆధారంగా ఎరువులు వేయడం ద్వారా ఎరువుల ఖర్చు తగ్గడంతో పాటు నేల సారవంతత పెరిగి మొక్కల ఎదుగుదల మెరుగుపడుతుందని వివరించారు.పశువుల ఎరువు,వర్మీ కంపోస్ట్, వేపపిండి వంటి సేంద్రియ ఎరువులతో పాటు నత్రజని (ఎన్),భాస్వరం (పి),పొటాష్ (కే),సూక్ష్మ పోషకాలను సరైన మోతాదులో దశలవారీగా అందిస్తే పుష్పాలు,కాయల ఏర్పాటు మెరుగై అధిక దిగుబడి సాధించవచ్చని రైతులకు సూచించారు.అదేవిధంగా మట్టి తేమ సంరక్షణ,కలుపు నియంత్రణ,సకాలంలో నీటి యాజమాన్యం,తెగుళ్లు--పురుగుల సమగ్ర యాజమాన్య (ఐపీఎం) పద్ధతులను పాటించడం ద్వారా మునగ సాగును మరింత లాభదాయకంగా మార్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లంపల్లి గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని మునగ పంటలో సమగ్ర పోషక యాజమాన్యంపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



## నీటిని వదిలి రైతులను ఆదుకోండి



**చిన్నకోడూరు,జులై22,(ప్రజాజ్యోతి):-** ప్రాజెక్టులకు గోదావరి జలాలు వదిలి రైతులను ఆదుకోండి అంటూ గంగాపూర్ గ్రామ రైతులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఎల్నినో నేపథ్యంలో గ్రామంలో గ్రామ సభ నిర్వహించేందుకు వచ్చిన ఎంపిడిఓ జనార్ధన్ తో పాటు ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుండెల్లి భవానివేణు సమక్షంలో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టకుండా పంట పొలాలకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిరుపతితో పాటు రైతులు ఉన్నారు.

### కంటి ఆరోగ్యమే
## భవిష్యత్తుకు వెలుగు





**సిద్ధిపేటఅర్బన్ ,జులై 22,(ప్రజాజ్యోతి):** విద్యతో పాటు ఆరోగ్యాన్ని కూడా సమానంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఇందూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డా. వి.పి.రాజు తెలిపారు. సిద్ధిపేటలోని కళాశాలలో డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ సహకారంతో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపా ల్ శిబిరాన్ని ప్రారంభించి, విద్యార్థులు ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్య నిపుణులు కంటి సంబంధిత సమస్యలను పరీక్షించి, అవసరమైన వారికి వైద్య సలహాలు, తదుపరి చికిత్సకు సంబంధించిన సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో కంటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయన్నారు. శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ వైద్య బృందానికి కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమ నిర్వహణలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్. రామచంద్ర, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ బొడ్డు రఘు తదితరులు పాల్గొన్నారు.

### నీటి భద్రతే భవిష్యత్
## తరాలకు గొప్ప కానుక





**సిద్ధిపేట,జులై 22,(ప్రజాజ్యోతి):** వర్షం కురిసిన చోటే నీటిని భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పెంచడమే క్యాచ్ ది రెయిన్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని సిద్ధిపేట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. సిద్ధిపేట పురపాలక సంఘం సమావేశ మందిరంలో నిర్వహించిన జల్ సంవాద్ -- క్యాచ్ ది రెయిన్అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మున్సిపల్ అధికారులు, సిబ్బందికి ఇంకుడు గుంతల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఇల్లు, ప్రభుత్వ కార్యాలయం, విద్యాసంస్థలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచించిన కమిషనర్, పట్టణంలో నిర్మిస్తున్న కొత్త అపార్ట్‌మెంట్లలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు చెరువులు, కుంటలకు సక్రమంగా చేరేలా డ్రైనేజీ నాళాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన మున్సిపాలిటీలలో సిద్ధిపేట ఒకటని పేర్కొంటూ, పట్టణంలో 2 మీటర్ల వెడల్పు, 3 మీటర్ల లోతుతో 8 నుంచి 10 ఇంకుడు గుంతలు నిర్మించనున్నట్లు తెలిపారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని, అదే భవిష్యత్ తరాలకు నీటి భద్రతను కల్పించే మార్గమని ఆయన అన్నారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ ప్రతినిధులు మని, నవనీత్, పూర్ణచందర్ ప్రొజెక్టర్ ద్వారా ఇంకుడు గుంతల నిర్మాణం, నిర్వహణపై అవగాహన కల్పించి అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, ఏఈ పృథ్వి, టీపీఓ ప్రవీణ్, ఆర్వో శ్రీకాంత్, శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అన్వేష్, రెవెన్యూ అధికారులు ఎల్లారెడ్డి, భరద్వాజ్, వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు

☆ అర్హుల పేర్ల నమోదుపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి ☆ రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి
☆ ఎస్ఐఆర్ పీసీసీ కోఆర్డినేటర్ వెన్నెల ☆ నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి

**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) జూలై 22:** వెల్దుర్తి మండలంలోని మానేపల్లి, కుక్నూరు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. కిసాన్ సెల్ అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి,ఎస్ఐఆర్ పీసీసీ కోఆర్డినేటర్, తెలంగాణ సాంస్కృతిక శాఖ చైర్మన్ వెన్నెల, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాలను పరిశీలించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి అర్హుడి ఓటు భద్రంగా ఉండేలా పార్టీ ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు బీఎల్ఏల ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ,



ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నర్సాపూర్





నియోజకవర్గంలో ఎక్కువ భాగం ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన పనులను కూడా త్వరలో పూర్తి చేసి ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా కృషి చేస్తామని చెప్పారు. ఓటర్లు తమ పేరు, ఇతర వివరాలను తప్పనిసరిగా ఒకసారి పరిశీలించుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు లేదా తప్పులు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులను లేదా కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు బలమైన పునాది అని, ఒక్క అర్హుడి ఓటు కూడా కోల్పోకుండా ప్రజలకు అండగా నిలవడం కాంగ్రెస్ పార్టీ బాధ్యతగా భావిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ రెడ్డి, రాష్ట్ర ఫిషర్మెన్ సెల్ కార్యదర్శి తలారి మల్లేశం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యార్థులపై లాఠీఛార్జికి నిరసన

☆ మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మల దహనం

**నంగునూరు, జూలై 22(ప్రజా జ్యోతి):-** ఢిల్లీలో నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం పట్ల నిరసనగా నంగునూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించలేదని విమర్శించారు. దీనికి నిరసన తెలుపుతున్న విద్యార్థులపై బల ప్రయోగానికి దిగడం దురదృష్టకరమని తెలిపారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సంఘీభావం ప్రకటిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన కార్యక్రమాలను అడ్డుకోవడం, ఆయనను





అరెస్టు చేయడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఈ ఘటనలకు నిరసనగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అచ్చిన సత్తయ్య ఆధ్వర్యంలో నంగునూరు మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించి దిష్టిబొమ్మలను దహనం చేశారు. నిరసన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజుపల్లి సర్పంచి ముక్కెర లింగం, మండల బీసీ సెల్ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాండ్ల రమేశ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బాగు శ్రీకాంత్ యాదవ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాగుల కృష్ణ, కాంగ్రెస్ నాయకులు పంగ రాజశేఖర రెడ్డి, బంగారి నర్సింలు, ఆదిమూలం మైసయ్య, గౌరబోయిన సంపత్, దాసరి కిషన్, రాగుల కనకయ్య, బస్వరాజు రాములు, బండి తిరుపతి, బాలయ్య, తుపాకుల శ్రీనివాస్, సంద బోయిన తిరుపతి, ఆరేపల్లి సురేశ్, పాలెపు నర్సింలు, సుంకరి శేఖర్, గణపురం భాను, ఆవుల నాగరాజు, దబ్బెట మహేశ్, సాంబయ్య, పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. రాజగోపాలపేట ఎస్సై వివేక్ ఆధ్వర్యంలో పోలీసులు దిష్టిబొమ్మల దహనం కార్యక్రమాన్ని అడ్డుకున్నారు.

## దిగుమతులకు అనుమతిస్తే రైతులకు గిట్టుబాటు ధర ఉండదు

☆ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందంపై రైతు సంఘం ఆందోళన

**చేర్యాల,జూలై 22(ప్రజాజ్యోతి):** మన దేశ రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర రాకుండా నష్టం కలిగించే స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం చేర్యాల మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ఆవరణలో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం భారత రైతులను నష్టపరిచే విధంగా



ఉందన్నారు. ఇప్పటికే స్వదేశీ రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేక, ప్రభుత్వం ధాన్యాన్ని కొనే పరిస్థితి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం కారణంగా అమెరికాలో పండే పత్తి, మొక్కజొన్న, గోధుమలు, పాల ఉత్పత్తులు, చికెన్ ఉత్పత్తులు తదితరాలను ఎలాంటి ఆంక్షలు లేకుండా భారత్‌లోకి దిగుమతి చేస్తే, మన రైతులు పండించే పంటలకు తక్కువ ధర వచ్చి దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. ఈ విధానాన్ని వెంటనే నిలిపివేయాలని,రాబోయే రోజుల్లో రైతులను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు ఉధృతం చేస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తుప్పతి రాజు, నంగి మైసయ్య, బియ్య సిద్ధులు, కత్తుల నరసింహా రెడ్డి, పండుగ యాదగిరి, సూర్ణ తిరుపతి, యాదారం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెల్దుర్తి నూతన ఎస్ఐగా కరుణాకర్ రెడ్డి

☆ ప్రజా భద్రతే తొలి ప్రాధాన్యం



**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) జూలై 22:** మెదక్ జిల్లా వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌కు నూతన సబ్ఇన్‌స్పెక్టర్‌గా బి. కరుణాకర్ రెడ్డి బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్లిన ఎస్ఐ టి. రాజు స్థానంలో ఆయన నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్ఐ బి. కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై రాజీ లేకుండా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే పోలీసింగ్, శాంతిభద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యం, ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం అన్నారు. ప్రజల సహకారంతో పారదర్శకంగా, సమర్థవంతంగా పోలీసింగ్ నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఎలాంటి సమస్య వచ్చినా నిర్భయంగా పోలీసులను సంప్రదించంలని, ప్రజల భద్రతే మా బాధ్యత అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

### సంక్షేమానికి
## ప్రతీకగా ఇందిరమ్మ గృహం

☆ ఘనంగా ప్రారంభించిన
గ్రామ సర్పంచ్, మాజీ ఫోరం అధ్యక్షుడు!



**తూప్రాన్ (ప్రజాజ్యోతి) జూలై 22:** తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం మరో కుటుంబంలో సంతోషాలను నింపింది. నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహాన్ని గ్రామ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు చిటుకుల మహిపాల్ రెడ్డి కలిసి ప్రారంభించి గృహ యజమానులు వడ్డే నాగమణి -- మహేష్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహేష్ దంపతులు మాట్లాడుతూ, ప్రభుత్వ సహకారంతో సొంత ఇంటి కల నెరవేరడం జీవితంలో మరచిపోలేని ఆనందమని పేర్కొన్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలు నిరుపేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్ రెడ్డి, వెంకటేశ్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, లింగం, విశ్వరాజ్, శ్రీశైలం, మన్నె తిరుపతి, జిన్న కృష్ణతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# దేశంలో కల్లోలం సృష్టించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు

☆ భారతదేశ ప్రతిష్టను భంగం కలిగించేలా చేస్తున్న వ్యక్తి రాహుల్ గాంధీ
☆ విదేశీ శక్తులతో రాహుల్ గాంధీ చేతులు కలపడం సిగ్గుచేటు
☆ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం ☆ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్

**దుబ్బాక ప్రతినిధి, జులై 22( ప్రజాజ్యోతి)** విదేశీ శక్తులతో చేతులు కలిపి దేశంలో అల్లర్లు సృష్టించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్ అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోడీ గారి నివాసాన్ని ముట్టడించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ఈరోజు దుబ్బాకలో మున్సిపల్ అధ్యక్షుడు గొల్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్ మాట్లాడుతూ... ఒకపక్క పార్లమెంటు సమావేశాలు జరుగుచుండగా ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ పార్లమెంటులో చర్చలో పాల్గొనకుండా దేశంలో కల్లోలం సృష్టించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి నివాసాన్ని ముట్టడించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిదని అన్నారు. ప్రపంచ దేశాలలో భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపచేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ గారి ప్రతిష్టకు, భారతదేశ ప్రతిష్టకు భంగం కలిగించేలా దేశంలో అంతర్గతంగా అల్లర్లు సృష్టించేందుకు కాంగ్రెస్ పార్టీ కొంతమంది దేశ వ్యతిరేక శక్తులతో కలిసి పని చేస్తూ దేశంలో అల్లర్లు సృష్టిస్తుందని అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న నిరసనలపై ప్రతి పౌరుడు ఆలోచించాలని, పేపర్ లీక్ వంటి ఘటనలు జరిగితే వాటిపై నిష్పక్షపాత విచారణ జరగడానికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని దీనిపై







భిన్నాభిప్రాయాలకు తావు లేదని అన్నారు. అయితే, ఏ నిరసన అయినా శాంతియుతంగా, చట్టబద్ధంగా జరగాలని, హింస, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, భద్రతా సిబ్బందిపై దాడులు లేదా ప్రజల్లో ఉద్రిక్తతలు పెంచే చర్యలు జరిగితే, వాటిని ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని, ఇలాంటివి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ, కాక్రోచ్ జనతా పార్టీ ఇలాంటి పార్టీలకు ప్రభుత్వం తగిన విధంగా బదిలిస్తుందని అన్నారు. అనంతరం బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కిష్టంగారి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో విభేదాలను వ్యక్తం చేయడానికి రాజ్యాంగబద్ధమైన మార్గాలు ఉన్నాయని . ఎన్నికలు, చట్టబద్ధ నిరసనలు, న్యాయపరమైన ప్రక్రియలు ఇవే ప్రజాస్వామ్యానికి బలంఅని, దేశ ప్రతిష్ఠ, సామాజిక శాంతి, ప్రజల ఐక్యతకు నష్టం కలిగించే చర్యలు ఏ లక్ష్యంతో జరిగినా సమర్థించకూడదని అన్నారు .ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు సుంకోజు ప్రవీణ్, అంబటి శివప్రసాద్, గాజుల భాస్కర్, పోగుల భూపాల్, గవ్వల రమేష్, రమేష్ రెడ్డి, రమణారెడ్డి, పెంటమ్ కిషన్, నేహాల్ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్, ప్రియాంక అరెస్టులు ప్రజాస్వామ్యంపై దాడి : ఎమ్మెల్యే టీఆర్ఆర్

**– కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి భారీ నిరసన ర్యాలీలో పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే**

**– రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం**



**పరిగి, జూలై 22 (ప్రజాజ్యోతి)** : ఢిల్లీలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అరెస్టులను నిరసిస్తూ కొడంగల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నివాసం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు జరిగిన ఈ ర్యాలీలో పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (ఎస్ఐఆర్) డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి (టీఆర్ఆర్) పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన నిరసన సభలో ఎమ్మెల్యే టీఆర్ఆర్ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ద్వారా ఆయన గొంతును నొక్కివేయలేరని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విలువలను విస్మరించి పోలీసు రాజ్యాన్ని నడపాలని ప్రయత్నిస్తున్నా, భారత ప్రజాస్వామ్యంలో అలాంటి చర్యలు విజయవంతం కావని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర వారసత్వం కలిగిన కుటుంబానికి చెందిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టు ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణించిన టీఆర్ఆర్, దేశ ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజల హక్కుల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ అంతిమ విజయం సాధించే వరకు వెనుకడుగు వేయబోదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ధారా సింగ్ నాయక్, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అంతర్జాతీయ చెస్ టోర్నీలో కేఎల్‌హెచ్ విద్యార్థి రాజా రిత్విక్‌కు రజతం



**హైదరాబాద్, జూలై 22 (ప్రజా జ్యోతి)** : ఫ్రాన్స్‌లో జూలై 11 నుంచి 18 వరకు జరిగిన ప్రతిష్ఠాత్మక మెన్యూర్స్ ఇంటర్నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్-2026లో కేఎల్ డీమ్డ్ టు బి యూని వర్సిటీకి చెందిన కేఎల్‌హెచ్ అజీజ్‌నగర్ క్యాంపస్ విద్యార్థి, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ రన్నరప్‌గా నిలిచి రజత పతకం సాధించినట్లు కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ఇంజినీర్ కోనేరు లక్ష్మణ్ హవీష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ 86 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ టోర్నీలో ఆయన తొమ్మిది రౌండ్లలో ఏడు పాయింట్లు సాధించి అజేయంగా నిలిచినట్లు చెప్పారు. చివరి రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన టాప్ సీడ్ గ్రాండ్‌మాస్టర్ మాక్సిమ్ లగార్డ్ పై విజయం సాధించినట్లు చెప్పారు. విద్యతో పాటు క్రీడలు, పరిశోధన, ఆవిష్కరణలు, వ్యవస్థాపకత తదితర రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తూ అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కేఎల్‌హెచ్ అజీజ్‌నగర్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డా.ఎ.రామకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది రాజా రిత్విక్‌ను అభినందించారు.


## విశ్వేశ్వరయ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ విజయవంతం

- విద్యార్హత పొందిన ప్రతి ఒక్కరికి అవకాశం
- రిలయన్స్ ఫౌండేషన్ కళాశాల యాజమాన్యం




**ఇబ్రహీంపట్నం జూలై 22 ప్రజాజ్యోతి** : విశ్వేశ్వరయ కళాశాలలో రిలయన్స్ ఫౌండేషన్ మరియు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు యువత నుంచి విశేష స్పందన లభించింది. ఇబ్రహీంపట్నం మండలం, ఆదిభట్ల సర్కిల్ పరిధి బొంగుళూరులోని విశ్వేశ్వరయ కళాశాలలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిలయన్స్ ఫౌండేషన్ స్కిల్లింగ్ కార్యక్రమాలు, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఉపాధి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నాయి. ఈ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో ప్రముఖ సంస్థలైన సదర్లాండ్, సోజిలిటీ, డిజిటైడ్, ఫ్రాంక్లిన్ టెక్ కంపెనీలు పాల్గొని అభ్యర్థుల ఇంటర్వ్యూలను నిర్వహించాయి. వివిధ విద్యార్హతలు కలిగిన యువత తమ ప్రతిభను ప్రదర్శించి ఉద్యోగ అవకాశాల కోసం పోటీపడ్డారు. కార్యక్రమంలో పాల్గొన్న సంస్థల ప్రతినిధులు అభ్యర్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం మరియు ఉద్యోగానికి అవసరమైన ఇతర అంశాలను పరిశీలించారు. అర్హత సాధించిన అభ్యర్థులను తదుపరి ఎంపిక ప్రక్రియకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి రిక్రూట్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కె సుధాకర్, సెక్రటరీ కె లక్ష్మీనారాయణ, ట్రెజరర్ బి శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ డి రమేష్, టిపిఓ జయప్రకాశ్ రెడ్డి, హెచ్ఓడీలు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## వెల్టిస్ 'వర్టికల్ ఏఐ అకాడమీ' ప్రారంభం



**హైదరాబాద్, జూలై 22 (ప్రజా జ్యోతి)** : ఏఐ ఆధారిత డిజిటల్ ప్రొడక్ట్ ఇంజినీరింగ్ సంస్థ వెల్టిస్ దేశంలోనే తొలి 'వెల్టిస్ వర్టికల్ ఏఐ అకాడమీ'ను ప్రారంభించిందని వెల్టిస్ చీఫ్ ఏఐ ఆఫీసర్ డా.విశ్వకర్మ జై శంకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అకాడమీకి తొలి ప్రైవేట్ విశ్వవిద్యాలయ భాగస్వామిగా వాక్సెన్ విశ్వవిద్యాలయంతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు చెప్పారు. వాక్సెన్ సెంటర్ ఆఫ్ టాలెంట్ డెవలప్‌మెంట్(సీఓటీడీ), స్టడీ అబ్రాడ్ సెల్ అధిపతి బెర్నార్డ్ భూటియా తోకలసి ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని వాక్సెన్ క్యాంపస్‌లో అకాడమీ ఏర్పాటు చేసి, డేటాబ్రిక్స్ పర్యావరణ వ్యవస్థ ఆధారంగా పరిశ్రమలకు సిద్ధమైన ఏఐ నిపుణులను తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు శిక్షణ, క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన వర్టికల్ ఏఐ నిపుణులను తయారు చేయనున్నట్లు తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుబంధుకు రాం రాం





**– డాక్టర్ మెతుకు ఆనంద్**

**మర్పల్లి, జూలై 22 (ప్రజా జ్యోతి)** : వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మర్పల్లి మండలంలోని సిరిపురం, వీర్లపల్లి గ్రామాల్లో పర్యటించారు. అక్కడ కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలించిన అనంతరం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన, మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు మరింత పెరుగుతుందని రైతులు ఆశించారని, అయితే ప్రస్తుతం రైతుబంధు అమలుపై సందిగ్ధ పరిస్థితి నెలకొందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే రైతుబంధు కొనసాగదనే అభిప్రాయం రైతుల్లో ఏర్పడిందని పేర్కొన్నారు. కౌలు రైతులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపిస్తూ, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు ఆన్‌లైన్‌లో నమోదైందో లేదో మొబైల్ ద్వారా పరిశీలించుకోవచ్చని సూచించారు. దొంగ ఓట్లను అరికట్టేందుకు పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. త్వరలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ గ్రామాలు, మండలాల్లో పార్టీ కోసం పనిచేస్తున్న నాయకుల పనితీరును పార్టీ గమనిస్తోందని తెలిపారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు భవిష్యత్తులోనూ పూర్తి ప్రాధాన్యం ఉంటుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం నమోదు చేస్తున్న కేసులకు భయపడాల్సిన అవసరం లేదని, మరో రెండు సంవత్సరాల తర్వాత బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అలాగే, అప్పటివరకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై, నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# ఓటు హక్కు లేకపోతే చనిపోయిన వారితో సమానం






**కొడంగల్ జూలై 22 ప్రజా జ్యోతి** : ఓటు హక్కు లేకపోతే చనిపోయిన వారితో సమానమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కొడంగల్ నియోజకవర్గ బూతు స్థాయి ఏజెంట్లతో పరిగి తాండూర్ శాసనసభ్యులు టి రామ్మోహన్ రెడ్డి, బుయ్యాని మనోహర్ రెడ్డి లతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఓటు హక్కు కోల్పోకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాల్సిన బాధ్యత బూతు స్థాయి ఏజెంట్ల దేనన్నారు. ఎస్సార్ ప్రక్రియను చేపట్టేందుకు ఆగస్టు 3వ తేదీ వరకు భారత ఎన్నికల సంఘం గడువును పొడిగించడం జరిగిందని, కొడంగల్ నియోజకవర్గంలో 78 శాతం ఎస్ఐఆర్ ప్రక్షాళన చేపట్టడం జరిగిందని ముఖ్యమంత్రి తెలిపారు. నియోజకవర్గంలో 2,51,255 ఓటర్లకు గాను 1,96,620 ఓటర్ల నమోదు గావించడం జరిగిందని మిగతా 54,635 వేల ఓట్ల నమోదును చేయవలసి ఉందని దీనికి బిఎల్ఏ లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఇంకా నమోదు చేసుకొని, వలస వెళ్లిన కుటుంబాలను గుర్తించి ఓటర్లుగా నమోదు అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు. ఓటరు జాబితా పేరు లేనట్లయితే సంక్షేమ ఫలాలు కోల్పోతారు అనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో ఓటర్లుగా నమోదు అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి తెలిపారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళల ఓట్లు తప్పిపోకుండా చూడాలని ఆయన అన్నారు. పేదలకు అండగా నిలబడి అందరూ ఓటు హక్కు నమోదు అయ్యేలా చూడాలని ఆయన తెలిపారు. సర్ ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి తన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొడంగల్, నారాయణపేట్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లు రాజేష్ రెడ్డి, విజయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్లు నందారం ప్రశాంత్, నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి : ఈఆర్వో వాసుచంద్ర




**– రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం**

**– డిజిటైజేషన్ వేగవంతం, ఏ.ఎస్.డి ఓటర్ల ధృవీకరణ, పట్టణ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి**

**పరిగి, జూలై 22 (ప్రజాజ్యోతి)** : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి సంబంధించిన అన్ని ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని పరిగి నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, వికారాబాద్ డివిజన్ ఆర్డీఓ వాసుచంద్ర సూచించారు. బుధవారం పరిగి తహసీల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన ఓటర్ల నుంచి అవసరమైన హార్డ్ కాపీలను సేకరించాలని, ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించి వారి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. వీవీఐపీ, వీఐపీ ఓటర్ల పేర్లు ఓటరు జాబితాలో సక్రమంగా ఉండేలా ప్రత్యేకంగా పరిశీలించాలని సూచించారు. అలాగే ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ (ఏ.ఎస్.డి) ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా ధృవీకరించి రికార్డుల్లో నమోదు చేయాలని, డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని అన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలు, పురోగతి తక్కువగా ఉన్న పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ వారాంతానికి ఎన్యూమరేషన్ ప్రక్రియ కనీసం 80 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నో మ్యాపింగ్ కేటగిరీలో ఉన్న ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించి తగిన చర్యలు చేపట్టాలని, ఏఇఆర్ఓ లు, బీఎల్ఓ లు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు అలాగే ఇతర ఎన్నికల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం, ఓటరు సౌకర్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు.

ఈ సమావేశంలో పరిగి తహసీల్దార్ వెంకటేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధాపూర్ వ్యవహారంపై కలెక్టర్‌తో కాంగ్రెస్ నేతల చర్చ






**– సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌తో తీవ్ర దుష్ఫలితాలు – షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి**

**– కలెక్టర్‌కు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి వివరణ**

**కొత్తూర్ జూలై 22 (ప్రజాజ్యోతి)** : సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే ప్రజలు, రైతులు, పరిసర గ్రామాలపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఈ మేరకు డంపింగ్ యార్డ్ వల్ల కలిగే దుష్ఫలితాలను వివరిస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి ప్రజెంటేషన్ ఇచ్చి వినతిపత్రం అందజేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం, చెత్త నుంచి వెలువడే రసాయనాలు, విషపదార్థాలు నేలలోకి చేరి వ్యవసాయ భూముల నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని కలెక్టర్‌కు వివరించారు. అదేవిధంగా చెత్త కుళ్లడం ద్వారా వెలువడే దుర్వాసన, హానికర వాయువుల కారణంగా గాలి కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని తెలిపారు. డంపింగ్ యార్డ్ పరిసరాల్లో దోమలు, ఈగలు, కీటకాలు పెరిగి అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారిపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. చెత్త నుంచి వచ్చే లీచేట్ (కలుషిత ద్రవం) భూమిలోకి చొచ్చుకుపోతే బోర్లు, బావులు, చెరువులు, ఇతర నీటి వనరులు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని వివరించారు. అలాగే డంపింగ్ యార్డ్‌కు ప్రతిరోజూ భారీ వాహనాల రాకపోకలు పెరగడం వల్ల రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు, దుమ్ము కాలుష్యం, శబ్ద కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. భవిష్యత్తులో జనాభా పెరిగే కొద్దీ చెత్త పరిమాణం పెరిగి సమస్య మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

**ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నాం: కలెక్టర్**

సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటు అంశంపై జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ జేఏసీ సభ్యులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రజల అభ్యంతరాలు, స్థానిక పరిస్థితులను పరిశీలించి ప్రత్యామ్నాయ మార్గాలను చూస్తున్నట్లు కలెక్టర్ సూచనప్రాయంగా వెల్లడించినట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. దీంతో సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ అంశంలో సానుకూల పరిణామాలు చోటుచేసుకుంటాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది. డంపింగ్ యార్డ్‌ను అంగీకరించే ప్రసక్తే లేదు. సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని ప్రజలు, కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, వ్యవసాయం, భూగర్భ జలాలను కాపాడేందుకు ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి అధికారికంగా ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను కోరారు. అవసరమైతే ప్రజల పక్షాన మరింత పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, కొత్తూరు జెడ్పిటిసి మాజీ సభ్యుడు శ్యాంసుందర్ రెడ్డి, జేఏసీ చైర్మన్ అంబటి ప్రభాకర్, కొత్తూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి,కొత్తూరు పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్,సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్,సీనియర్ నేత రవికుమార్ గుప్తా, సిద్ధాపూర్ సర్పంచ్ బాసు నాయక్,ఏనుగు మడుగు తాండ సర్పంచ్ గోవింద్ నాయక్,శేరిగూడభద్రాయపల్లి సర్పంచ్ సుమిత్ర మల్లారెడ్డి, కొడచర్ల తాండ సర్పంచి విష్ణు శాంతి నాయక్,ఎమ్మే బాలరాజ్,రాసుల జంగయ్య, ఖాజా,లింగారం సురేష్ గౌడ్, శంకర్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## సర్‌లో తన ఓటును నమోదు చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





**కొడంగల్ జూలై 22 ప్రజా జ్యోతి** : కొడంగల్‌లోని తన స్వగృహంలో సర్ ప్రక్రియలో పాల్గొని ఏంయుమరేషన్ ఫామ్‌ను బిఎల్ఓకు అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన తన ఓటును కొడంగల్ లోనే నమోదు చేసుకున్నారు.

## అక్రమంగా అరెస్టు చేసిన బిజెపి నాయకులను విడుదల చేయాలి

**– బిజెపి మాజీ మండల అధ్యక్షులు సతీష్ ముదిరాజ్**



**దౌల్తాబాద్ జులై 22 (ప్రజా జ్యోతి)** : బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తు దౌల్తాబాద్ మండల బిజెపి మాజీ మండల అధ్యక్షులు సతీష్ ముదిరాజ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ అనుచిత ప్రవర్తనను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన బీజేపీ శ్రేణులను పోలీసుల ద్వారా అడ్డుకోవడం కాంగ్రెస్ నిరంకుశ వైఖరికి నిదర్శనం అన్నారు. అదేవిదంగా పోలీసులను అడ్డుపెట్టుకుని తెలంగాణలో బీజేపీ గొంతు నొక్కాలని చూస్తే ఊరుకునేది లేదనీ.నీట్ అంశంపై ఎన్డీయే ప్రభుత్వం పార్లమెంట్లో చర్చకు సిద్ధంగా ఉన్నా.రాజకీయ మనుగడ కోసమే కాంగ్రెస్ దిగజారి వ్యవహరిస్తోందనారు. ఇప్పటికైనా డ్రామాలు ఆపి పార్లమెంట్ సజావుగా జరిగేలా సహకరించాలి. అరెస్ట్ చేసిన రామచందర్ రావుతో పాటు ఇతర బీజేపీ నాయకులను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరాలి : జంపన ప్రతాప్




**బోయిన్ పల్లి, జులై 22.(ప్రజా జ్యోతి)** : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ అన్నారు. న్యూ బోయిన్‌పల్లిలోని సాయి గ్రామర్ హై స్కూల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు నోటుబుక్స్, స్టేషనరీ సామగ్రి పంపిణీ చేయడంతో పాటు పాఠశాల ఆయాలకు ఇందిరమ్మ చీరలను అందజేశారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ, 2026--27 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో 90 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు తన తరఫున ల్యాప్‌టాప్‌లను బహుమతిగా అందజేస్తానని ప్రకటించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రత్నమాల, జి. శారదాదేవి, ఉపాధ్యాయులు శశిరేఖ, రజిత, పద్మావతి, ఇంద్రసేన రెడ్డి, రాధా, ఝాన్సీ రాణి, ఫరజానా బేగం, స్థానికులు కరణ్ సింగ్, శరత్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బైక్ టాక్సీలకు ఏకీకృత నియంత్రణ అవసరం : కట్స్ నివేదిక



**హైదరాబాద్, జూలై 22 (ప్రజా జ్యోతి)** : బైక్ టాక్సీలకు దేశ వ్యాప్తంగా ఏకీకృత, సాక్ష్యాధారిత నియంత్రణ చట్రం అవసరమని కట్స్ ఇంటర్నేషనల్ నివేదికలో వెల్లడైందని కట్స్ సంస్థ ప్రతినిధులు బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జాతీయ ఆర్థిక వ్యవహారాల అధికార ప్రతినిధి గోపాల్ కృష్ణ అగర్వాల్ నివేదికను ఆవిష్కరించగా, జాతీయ రహదారి భద్రతా బోర్డు ఛైర్మన్ నితిన్ ఆర్.గోకర్ణ్ ప్రసంగించారని తెలిపారు. రవాణాయేతర బైక్‌లకు షరతులతో అనుమతి, ప్లాట్‌ఫామ్ ఆధారిత జవాబుదారీతనం, ఏకీకృత భద్రతా ప్రమాణాలు, బీమా, హెల్మెట్, పారదర్శక ఛార్జీలు, ప్రోత్సాహకాలతో ఈవీ మార్పును సిఫార్సు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమోల్ కులకర్ణి, ఛవి బన్స్‌వాల్, పరోమా భట్, ప్రవేశ్ బియాని, శాంతను శర్మ, నిఖిల్ రాఠీ, అనిల్ శశి, వీరేంద్ర ఎస్. రాథోర్, శిక్షా శ్రీవాస్తవ, శ్రేయా యాదవ్, సౌరవ్ ధర్ పాల్గొన్నట్లు చెప్పారు.

## గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయించాలి



**మేడ్చల్, జూలై 22 (ప్రజాజ్యోతి)** : ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో రోడ్ల దుస్థితి అధ్వానంగా మారింది. పురపాలిక పరిధి 9వ వార్డు సోమారం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతిని వర్షపు నీటితో దర్శనమిస్తుంది. బుధవారం వార్డు ప్రజలు మీడియాతో మాట్లాడుతూ, గుంతల మయంగా మారిన రోడ్డులో ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక గ్రామ ప్రజలు, వాహనదారులు చెబుతున్నారు. స్థానిక తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ పట్టించుకోని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి గుంతలుగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులు, కౌన్సిలర్ పట్టించుకోని సమస్యను పరిష్కరించాలని అన్నారు.

# ఉపాధి నైపుణ్యాలకు నాచుపల్లి జేఎన్టీయూ ముందడుగు

## జేఎన్టీయూ–స్మార్ట్‌బ్రిడ్జ్ మధ్య అవగాహన ఒప్పందం


జగిత్యాల, జూలై 22, (ప్రజాజ్యోతి): మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్) విద్యార్థులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా స్మార్ట్‌బ్రిడ్జ్ సంస్థతో బుధవారం అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు 150 గంటల



ఉచిత వర్చువల్, ఆఫ్‌లైన్ ఇంటర్న్‌షిప్‌లతో పాటు ఏఐ, మెషిన్ లెర్నింగ్, గూగుల్ క్లౌడ్, డేటా అనలిటిక్స్ వంటి రంగాల్లో ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నారు. అలాగే హ్యాకథాన్‌లు, వర్క్‌షాప్‌లు,అధ్యాపకుల కోసం ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలు కూడా నిర్వహించనున్నారు. గూగుల్, సర్వీస్‌నౌ, మోంగోడీబీ వంటి ప్రముఖ ఐటీ సంస్థల భాగస్వామ్యంతో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు ప్రత్యక్షంగా నేర్చుకునే అవకాశం కల్పిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జి. నరసింహ, టీపీఓ డా. బి. సతీష్ కుమార్, స్మార్ట్‌బ్రిడ్జ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

ఎండపల్లి, జూలై 22, ప్రజా జ్యోతి, మండలంలోని గుల్లకోట గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం చేసి తమ సతీమణి ల పేరుమీద మిధున మళ్లింపు పై ఫిర్యాదు చేయగా బుధవారం ఎంపీడీఓ కృపాకర్ విచారణ చేపట్టారు. గ్రామ పంచాయతీ సాధారణ నిధులు సంబంధించిన



సుమారుగా రూ.2 లక్షల 54 వేల 77 నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని గుల్లకోట కు చెందిన సామాజిక సేవకులు అమరగొండ సత్యనారాయణ ఇంతకు ముందు ప్రజా వాణిలో ఉన్నతాధికారులను ఆశ్రయించి, ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఎంపీడీఓ కృపాకర్ విచారణ చేపట్టారు.ప్రస్తుత సర్పంచ్ ,గత పంచాయతీ కార్యదర్శి వారి సతీమణి ల పేరు మీద నిధులు మళ్లించి గ్రామ పంచాయతీ నిధులు కాజేశారని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా విచారణ అధికారి ఎండ పల్లి ఎంపీడీఓ కృపాకర్ మాట్లాడుతూ ,ఇరువురి స్టేట్మెంట్ నమోదు చేసుకుని ,గ్రామ పంచాయతీ రికార్డ్ లను పరిశీలించి విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్,గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేశం,పిర్యాదు దారు సామాజిక సేవకులు అమరగొండ సత్యనారాయణ,గ్రామస్తులు పాల్గొన్నారు,

# జిల్లా హాస్పిటల్స్ మార్కెటింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు

## జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీకాంత్, సంతోష్

పెద్దపల్లి ప్రతినిధి, జూలై 22 (ప్రజాజ్యోతి): పెద్దపల్లి జిల్లా హాస్పిటల్స్ మార్కెటింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రా పెల్లి రాజ్‌కుమార్



ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా చాటకోళ్ల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా భూస రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఈదునూరి సాగర్, కోశాధికారిగా బొమ్మెన సుమంత్, ప్రచార కార్యదర్శిగా జంగా ప్రశాంత్, కార్యదర్శిగా అడప సంతోష్‌ను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కార్యవర్గ సభ్యులు జిల్లా వ్యాప్తంగా హాస్పిటల్స్ మార్కెటింగ్ రంగం అభివృద్ధికి కృషి చేస్తామని, సభ్యుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్పిటల్స్ మార్కెటింగ్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# సైబర్ మోసాల బాధితులకు శుభవార్త

## మనీ రిజిస్ట్రేషన్ మాడ్యూల్ ద్వారా డబ్బు తిరిగి పొందే అవకాశం

## ఎస్సై రాహుల్ రెడ్డి పలు సూచనలు

ఎల్లారెడ్డిపేట, జూలై 22(ప్రజాజ్యోతి: సైబర్ నేరాల బారిన పడి తమ డబ్బులను కోల్పోయిన బాధితులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో టి ఎస్ సి ఎస్ బి శుభవార్త అందించింది సులభంగా తిరిగి పొందేందుకు మనీ రిజిస్ట్రేషన్ మాడ్యూల్ అను ఆపును అందుబాటులోకి తీసుకువచ్చింది డైరెక్టర్ శ్రీమతి శాఖ గోయల్ ఐపీఎస్ తెలిపిన వివరాల ప్రకారం కేంద్ర హోమం శాఖ నుండి రిపండ్కు సంబంధించిన ఎస్ఎంఎస్ లేదా నోటిఫికేషన్ అందుకున్న అర్హులైన బాధితులకు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్ట్ ఇన్ హోటల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సంబంధిత బ్యాంకుల ధ్రువీకరణ



అనంతరం కారుకులైన బాధితులకు బ్యాంకాక్ లో నేరుగా జమ అవుతాయని అన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో కృషి చేద్దాం

## రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా అధికారులు చూడాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో, జులై 22( ప్రజాజ్యోతి ): రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని.. రోడ్డు ప్రమాదాల నివారణకు ఆయా



శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, రవాణా శాఖ, పోలీస్ శాఖ, ఆర్అండ్ బీ అధికారులు, ఆర్టీసీ, ఎన్ హెచ్ఏఐ పీడీ భరద్వాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.రోడ్డు భద్రత కమిటీ చైర్ పర్సన్ గా కలెక్టర్ మాట్లాడారు. వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలనిఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి, అక్కడ స్పీడ్ బ్రేకర్లు, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు, రోడ్డు మార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాకాలంలో వరద నిలిచే రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించి.. నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చి దెబ్బతిన్న రహదారులకు మరమ్మత్తులు చేయాలని పేర్కొన్నారు. వాహనదారులకు తెలిసేలా మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, కల్వర్టులకు పసుపు రంగు వేయించి హెచ్చరిక గుర్తులు ఏర్పాటు చేయాలన్నారు.

### నగరంలో లైటింగ్ వ్యవస్థ మెరుగుపరచాలి

కరీంనగర్ నగరపాలక పరిధిలో ప్రధాన రహదారులపై లైటింగ్ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అవసరమైన చోట లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రద్దీ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.ప్రజలకు,వాహనదారులకు సైతం రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం నడుచుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల వెంట ఆక్రమణలు, రోడ్డు ప్రమాదాల నివారించేందుకు నిఘా, పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలన్నారు. స్పీడ్ డిటెక్టర్లు, కెమెరాలు , సైన్ బోర్డులు, ఎమర్జెన్సీ కాల్ బాక్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. బ్లాక్ స్పాట్ వద్ద హైమాస్ట్ లైటింగ్ ఎన్ఫోర్స్మెంట్ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు. ఈ ప్రక్రియ



మొత్తం 60 రోజుల్లో పూర్తి కావాలని ఆదేశించారు. 15 రోజులకు ఒకసారి రవాణా శాఖ, పోలీస్ శాఖ, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు సమావేశమై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జాతీయ రహదారిపై ప్రయాణించే వారి కోసం అందిస్తున్న టోల్ ఫ్రీ నెంబర్ 1033 గురించి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడంతోనే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత నెల కంటే ఈసారి రోడ్డు ప్రమాదాలు తగ్గాయని.. హిట్ అండ్ రన్, ఈ చలాన్ కేసుల గురించి వివరించారు. వర్షాకాలంలో వాహనాల మెయింటెనెన్స్ పై ప్రత్యేక దృష్టి సారించాలని వాహనదారులకు సీపీ సూచించారు.ఈ సందర్భంగా బైపాస్ రోడ్డులోని ఎన్టీఆర్ బొమ్మ–పద్మా నగర్ జంక్షన్, నీరు నిలిచే, ప్రమాదాలు జరిగే ప్రాంతాల గురించి చర్చించారు. పలు ప్రమాదాల కేసులు వివరించారు.

అంతకుముందు కరీంనగర్– వరంగల్ జాతీయ రహదారి పనుల గురించి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు వివరించారు. సుమారు 95 శాతం వరకు పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కోట విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

## ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్

## సంబంధిత అధికారులకు ఫార్వర్డ్ బ్లాక్ ఫిర్యాదు

కరీంనగర్ బ్యూరో, జులై 22( ప్రజాజ్యోతి ): నగరంలోని పద్మనగర్‌లో ఉన్న కోట ఇన్స్టిట్యూట్ మరియు కె పి ఎస్ ప్రాంగణంలో నిబంధనలకు విరుద్ధంగా జూనియర్ కళాశాలను నిర్వహిస్తున్నారంటూ ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, అగ్నిమాపక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం,కోటా ఇన్స్టిట్యూట్ యాజమాన్యం నిబంధనలను ఉల్లంఘిస్తూ పద్మనగర్‌లో జూనియర్ కళాశాలను నిర్వహిస్తున్నట్లు ఆరోపించారు.

సంబంధిత సంస్థకు తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అవసరమైన గుర్తింపు లేకుండానే అడ్మిషన్లు చేపట్టి జూనియర్ కళాశాల తరగతులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తప్పుదారి పట్టే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.సంబంధిత భవనాలకు అగ్నిమాపక శాఖ నుంచి తప్పనిసరిగా



ఉండాల్సిన ఫైర్ సేఫ్టీ ఎన్ ఓ సి లేదని, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే ఫైర్ సేఫ్టీ పరికరాలు, ఫైర్ ఎస్కేప్ మార్గాలు వంటి భద్రతా ప్రమాణాలు కూడా తగిన విధంగా లేవని ఆరోపించారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే వందలాది మంది విద్యార్థుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.కె పి ఎస్ పాఠశాల ప్రాంగణంలోనే జూనియర్ కళాశాలను నిర్వహించడం విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదులో ఆరోపించారు. పాఠశాల అనుమతితో నడుస్తున్న ప్రాంగణంలో జూనియర్ కళాశాల నిర్వహించడం నిబంధనల ఉల్లంఘనగా పేర్కొన్నారు.

కరీంనగర్‌లోని వి-పార్క్ హోటల్ సమీపంలోని భవనంలో కూడా కోటా ఇన్స్టిట్యూట్ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొంటూ, అక్కడ కూడా అగ్నిమాపక శాఖ అనుమతులు, భద్రతా ప్రమాణాలు ఉన్నాయా అనే విషయాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని బండారి శేఖర్ కోరారు.విద్యార్థుల భద్రత, వారి విద్యా భవిష్యత్తు దృష్ట్యా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా జోక్యం చేసుకుని, విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు, అగ్నిమాపక శాఖ అధికారులతో సంయుక్త తనిఖీలు నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత విద్యాసంస్థలపై చట్టప్రకారం సస్పెన్షన్, సీలింగ్ తదితర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# భూ రీ సర్వే కు రైతులు సహకరించాలి

## జగిత్యాల అదనపు కలెక్టర్ (రెవెన్యూ)బిఎస్ లత

ఎండపల్లి, జూలై 22 ప్రజా జ్యోతి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వేకు రైతులు అందరూ సహకరించాలని జగిత్యాల అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి ఎస్ లత కోరారు. మండలంలోని సూరారం గ్రామంలో బుధవారం నిర్వహించిన భూ,రీ సర్వే అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. భూ,రీ సర్వే వల్ల అన్ని రకాలైన భూ



సమస్యలు పరిష్కారం అవుతాయని ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఇట్టి కార్యక్రమానికి రైతులు అందరూ తమ సహకారం అందజేసి వారి సమస్యల పరిష్కారం చేసుకోవాలని ఈ కార్యక్రమం అత్యంత పారదర్శకంగా చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ ఎ,అనిల్ కుమార్,మండల గిర్దావర్ అన్వేష్ , రెవెన్యూ సిబ్బంది, గ్రామ సర్పంచ్ ,వార్డు సభ్యులు,రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు,

# కరీంనగర్‌లో అర్ధరాత్రి దొంగల హల్చల్

- సినీ ఫక్కీలో భారీ దొంగతనం
- పీఎంజే జ్యువెలర్స్ దోపిడీ మరువక ముందే..మరో భారీ దోపిడీ
- ఇంట్లోకి చొరబడి కుటుంబాన్ని బంధించి దోపిడీ
- రూ.25 లక్షల నగదు,54 తులాల బంగారం అపహరణ
- వరుస దోపిడీలతో వణికిపోతున్న కరీంనగర్
- దొంగలకు కరీంనగర్ సేఫ్ జోన్‌గా మారుతోందా..?
- భయాందోళనలో నగర ప్రజలు

కరీంనగర్ క్రైం, జూలై 22, (ప్రజాజ్యోతి): ఒకప్పుడు ప్రశాంత నగరంగా పేరొందిన కరీంనగర్‌లో వరుస దొంగతనాలు ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి.ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పీఎంజే జ్యువెలర్స్ దోపిడీ ఘటనను పోలీసులు ఛేదించి నిందితులను అరెస్టు చేసినా,నేరగాళ్ల ఆగడాలకు మాత్రం అడ్డుకట్ట పడినట్లు కనిపించడం లేదు.ఆ ఘటన మరువకముందే తాజాగా నగరంలోని భగత్‌నగర్ చౌరస్తాలో ఓ ఇంటిలో అర్ధరాత్రి జరిగిన భారీ దోపిడీ మరోసారి నగర భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.అర్ధరాత్రి సమయంలో ఆరు నుండి ఎనిమిది మంది సాయుధ దుండగులు పక్కా ప్రణాళికతో ఓ ఇంటిని లక్ష్యంగా చేసుకుని దోపిడీకి పాల్పడ్డారు.

### సినీ ఫక్కీలో దోపిడీ..:

నగరంలోని భగత్‌నగర్ చౌరస్తాలో



అజ్మత్ అలీ అనే ఓ ఇంటి యజమాని మంగళవారం రాత్రి 12:30 గంటల సమయంలో బయట లైట్ ఆఫ్ చేసేందుకు రాగానే మాటు వేసిన దుండగులు అతడిని అదుపులోకి తీసుకుని బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించారు.అనంతరం ఇంట్లో ఉన్న వృద్ధులతో పాటు నలుగురు కుటుంబ సభ్యులందరినీ తుపాకులు,కత్తులతో బెదిరించి చేతులు కట్టేసి ఒకే చోట కూర్చోబెట్టారు.వారి కేకలు బయటకు వినిపించకుండా నోట్లో గుడ్డలు కుక్కి,ఇంట్లో టీవీ శబ్దాన్ని భారీగా పెంచి దాదాపు గంటన్నర పాటు బీభత్సం సృష్టించారు. ఆ తర్వాత ఇంట్లోని ప్రతి గదిని క్షుణ్ణంగా గాలించిన దుండగులు బీరువాల్లో దాచిన, ఒంటిపై ఉన్న 54 తులాల బంగారు ఆభరణాలు,30 తులాలవెండి వస్తువులు,రూ.25 లక్షల నగదు,రెండు మొబైల్ ఫోన్లను దోచుకెళ్లారు.అంతేకాకుండా ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న రెండు ద్విచక్ర వాహనాలను కూడా తీసుకుని ఎలాంటి ఆనవాళ్లు లేకుండా పరారయ్యారు.దుండగులు వెళ్లిపోయిన తర్వాత బాధితులు బంధనాల నుంచి బయటపడి పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరించారు.పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ ప్రత్యేక బృందాలతో



దర్యాప్తు ముమ్మరం చేశారు. దుండగులు ముందస్తుగా ఇంటిపై పూర్తి సమాచారం సేకరించి,పలుమార్లు రెక్కీ నిర్వహించిన అనంతరమే ఈ దోపిడీకి పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అదే సమయంలో ఇంటి వివరాలు తెలిసిన వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉందా? లేదా అంతర్గత సమాచారం ఆధారంగానే ఈ దోపిడీ జరిగిందా? అనే కోణంలోనూ దర్యాప్తును ముమ్మరం చేశారు.అన్ని కోణాల్లో విచారణ చేపట్టిన పోలీసులు



కీలక ఆధారాల కోసం సీసీటీవీ ఫుటేజీలు,సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తున్నారు.

### పీఎంజే దోపిడీ తర్వాత మరో భారీ షాక్..:

కొద్ది రోజుల క్రితమే కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలర్స్ లో జరిగిన భారీ దోపిడీ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.ఆ కేసును పోలీసులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఛేదించి నిందితులను అరెస్టు చేశారు.ఆ కేసును ట్రైనీ డీఎస్పీలకు కేస్ స్టడీగా కూడా వివరించే స్థాయిలో పోలీసులకు ప్రశంసలు లభించాయి. అయితే అదే నగరంలో మళ్లీ భారీ దోపిడీ జరగడం నేరగాళ్లు ఏమాత్రం భయపడటం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### పెరుగుతున్న నేరాలు.. ప్రజల్లో ఆందోళన..:

ఇటీవలి కాలంలో కరీంనగర్ నగరంలో చోరీలు, దోపిడీల ఘటనలు వరుసగా వెలుగుచూస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.ముఖ్యంగా రాత్రి వేళల్లో ఇళ్లలో ఉండాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. విలువైన వస్తువులను ఇంట్లో ఉంచుకోవడానికే ప్రజలు వెనుకంజ వేస్తున్నారు.

### గస్తీ మరింత పెంచాలంటున్న ప్రజలు..:

నగరంలో వరుస దోపిడీల నేపథ్యంలో రాత్రి గస్తీని మరింత కట్టుదిట్టం చేయాలని,ప్రధాన కూడళ్లతో పాటు కాలనీల్లో కూడా పోలీసు నిఘాను పెంచాలని నగర ప్రజలు కోరుతున్నారు.సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచిస్తున్నారు.వరుస ఘటనలకు చెక్ పెట్టి ప్రజల్లో భద్రతా భావం కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని అభిప్రాయపడుతున్నారు.

## కేకే కమిటీకి వినతిపత్రం అందజేసిన
# తెలంగాణ ఉద్యమకారిణి పోతురాజు రమాదేవి




ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి ఉద్యమకా కాలయాపన చేయకుండా తక్షణమే గుర్తింపు కార్డులు ఇవ్వాలి.ఉద్యమకారులకు అన్ని రాజకీయ పార్టీలు 20 శాతం అవకాశాలు కల్పించాలి.ముఖ్యంగా ఉద్యమ మహిళా నాయకులకు అన్ని రాజకీయ పార్టీల వాళ్లు నామినేటెడ్ పోస్టులు బి ఫామ్ లు అన్ని ఎలక్షన్స్ లో అవకాశాలు కల్పించాలి.ఉద్యమ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి.ఉద్యమకారుల పిల్లలకు ఉచిత విద్యను అందించేలా ఏర్పాటు చేయాలి. ఉద్యమకారుల కుటుంబాలకు హెల్త్ కార్డులు ఇచ్చి వారికి ఆరోగ్య భద్రతను కల్పించాలి.ఉద్యమకారులకు అన్ని ప్రభుత్వ ఆఫీసులలో చట్టపరమైన అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ అధికారులు స్పందించి తక్షణమే వారికి పని చేసి పెట్టాలి.ఉద్యమకారులకు తగిన గుర్తింపు గౌరవం అన్ని ప్రభుత్వ అధికారుల దగ్గర అన్ని పార్టీలలో లభించాలి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాల పరిమితిలోనే కాలయాపన లేకుండా తక్షణమే అమలు చేయాలి.ప్రభుత్వం ఇస్తానన్న 250 గజాల స్థలంలో ఇల్లు కట్టించి ఇవ్వాలి.తదిత డిమాండ్లు ఉద్యమకారుల తరఫున కేకే కమిటీకి పోతురాజు రమాదేవి అందించడం జరిగింది.

## ఏఐసీసీ ఆదేశానుసారం, టీపీసీసీ
# అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో లోక్ సభ పక్షనేత రాహుల్ గాంధీ,ప్రతిపక్ష నాయకుల అరెస్టును ఖండిస్తూ నిరసన
- నీట్ పేపర్ లీక్ పై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామ చేయాలని డిమాండ్
- ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి బుధవారం ఏ ఐ సి సి ఆదేశానుసారం, టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో లోక్ సభ పక్షనేత రాహుల్ గాంధీ అప్రజాస్వామిక అరెస్టు ను నిరసిస్తూ నీట్ పేపర్ లీక్ పై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామ చేయాలని డిమాండ్ చేస్తూ శ్రేణులతో కలిసి జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నుండి ర్యాలీగా బయలుదేరి ఖమ్మం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుత నిరసన ధర్నా నిర్వహించనైనది.ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అప్రజాస్వామిక అరెస్టు ను ఖండిస్తున్నామని, నీట్ పరీక్ష నిర్వహించలేని దద్దమ్మ కేంద్ర ప్రభుత్వం అని, విద్యార్థులు,నిరుద్యోగులు డిల్లీ వీధుల్లో ఆందోళన చేస్తుంటే ప్రధాని మోడీ మౌనంగా ఎందుకు అని శాంతియుతంగా నిరసనలు చేసే యువతపై అత్యంత పాశవికంగా లాఠీ చార్జి ని ఖండిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు లోక్ సభ పక్షనేత రాహుల్ గాంధీ అరెస్ట్ ను ఖండిస్తూ నీట్ పేపర్ లీక్ పై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ, నిరసన ధర్నా నిర్వహించామని కేంద్ర ప్రభుత్వం నిరంకుశపాలనకు చరంగీతం పాడాలని , కేంద్ర ప్రభుత్వ పతనానికి కథం తొక్కిన యువతే నిదర్శనమని అదే విధంగా తెలంగాణాలో గత ప్రభుత్వ హయాంలో పరీక్షలు నిర్వహించలేని అసమర్థ పాలకులను గద్దె దించారని అన్నారు. సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం నీట్ పేపర్ లీక్ పై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని యావత్ భారత్ యువత భవిష్యత్తు ను అంధకారంలోకి నెట్టిందని రాహుల్ గాంధీ అరెస్ట్ ను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,శాసనమండలి మాజీ సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, శాసనసభ మాజి సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న,ఖమ్మం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, టి పి సి సి ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి,రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భానోత్ బాలాజీ నాయక్, రాష్ట్ర ఓ బి సి సెల్ ఉపాధ్యక్షులు వడ్డేబోయిన నరసింహారావు, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య, రంగా జనార్ధన్,సహేల జావేద్, పి సి సి సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, ఏ ఐ సి సి సేవాదళ్ కో ఆర్డినేటర్ చోటా బాబా,రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ కుమార్,జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు సయ్యద్ గౌస్,మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, బండి మాధవరావు,పి ఏ సి ఎస్ చైర్మన్ రావూరి సైదు బాబు,విప్లవ కుమార్,యర్రం బాలగంగాధర్ తిలక్,మాజీ కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వరరావు,దుద్దుకూరి వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి,రాపర్తి శరత్,మిక్కిలినేని మా మంజులనరేంద్ర, కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ, నగర మైనారిటీ అధ్యక్షులు అబ్బాస్ బేగ్, జిల్లా కాంగ్రెస్ జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు పట్టాభి, కిలారు అనిల్ కుమార్, బచ్చలకూర నాగరాజు, దామా స్వరూప, ముక్రం అలీ ఖాన్, గాదెల ఝాన్సీ, శంకర్ నాయక్, ఫతే అహ్మద్, భానోత్ వినోద ,మద్దినేని రమేష్, లింగాల రవికుమార్, జిల్లా కాంగ్రెస్ ఓ బి సి సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ, గడ్డికొప్పుల ఆనందరావు, రజీభాయ్, దివ్య జహీర్ భాయ్, బీరెడ్డి రమేష్, ఫరీద్ ఖాద్రి, ఆసిఫ్, పంది రాజు గౌడ్, ప్రతిభారెడ్డి, అన్నపూర్ణ యశ్వంత్, కందుల శ్రీను,వీరయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

# రాజీనామా చేయమంటే లాఠీచార్జీ చేస్తారా..?

- సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అశోక్ అన్న వర్గం



టేకులపల్లి, జూలై 22,ప్రజాజ్యోతి: టేకులపల్లి మండల కేంద్రంలోని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ (అశోక్ అన్న వర్గం) కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేంద్ర ప్రభుత్వ విధానాలను పార్టీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. జిల్లా కార్యదర్శి భానోత్ ఊక్ల మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నిరుద్యోగ యువత, విద్యార్థులపై లాఠీచార్జీ, టియర్ గ్యాస్ ప్రయోగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, ఎన్‌టీఏను రద్దు చేసి పారదర్శక నియామకాలు చేపట్టాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చకపోతే రైతాంగ పోరాట స్ఫూర్తితో దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువత, విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పడిగా మంగన్న, గుగులోత్ రామచందర్, నెల్లూరి నాగేశ్వరరావు, ఈసం శ్రీను, ఆళ్లెం లక్ష్మి, బానోత్ సాలి, భూక్య బంగారి తదితరులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల చట్టాలపై విద్యార్థులకు అవగాహన

- టేకులపల్లి ప్రభుత్వ పాఠశాలలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సదస్సు

టేకులపల్లి,జూలై 22, ప్రజాజ్యోతి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ కమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లి మండల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం మానవ హక్కుల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వారి హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన కల్పిస్తూ సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాల్సిన అవసరాన్ని వివరించారు. అవగాహన సదస్సు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని ప్రధానోపాధ్యాయుడు అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని విద్యాసంస్థల్లో నిర్వహించాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ప్రతినిధులను కోరారు.ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాల్వ సుధాకర్ రావు, ఎన్జీవో ప్రతినిధి ఏ. జగన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. మోహన్‌రావు, టిటిఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, జిల్లా అడ్వైజర్ ఎస్‌కే అబ్బాస్, జిల్లా ఇన్‌చార్జ్ గడ్డం శామ్యూల్, జిల్లా కమిటీ సభ్యురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యామ్నాయ పంటల సాగువైపు రైతులు మళ్లాలి

- రాష్ట్ర వ్యవసాయ,మార్కెటింగ్,సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- వచ్చే జూన్ వరకు త్రాగునీటికి సరిపడా నీటి వినియోగంపై కార్యాచరణ సిద్ధం
- రాజీవ్ కాలువ ద్వారా గోదావరి జలాలను తిరిగి ఖమ్మం వైపు మళ్లించే వినూత్న ప్రయోగం కొనసాగుతోంది
- వరి, మిర్చికి బదులుగా ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగుపై రైతులు దృష్టి పెట్టాలి
- రూ.175 లక్షల యూఐడీఎఫ్ నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన
- వి.వెంకటాయపాలెం డీప్‌కట్ వద్ద గోదావరి జలాలను పరిశీలించిన మంత్రి తుమ్మల,జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి త్రాగునీటిని కాపాడుకుంటూ,రైతులు అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కలిసి వి. వెంకటాయ పాలెం డీప్‌కట్ వద్ద గోదావరి జలాల పరిస్థితిని పరిశీలించారు.అనంతరం అధికారులు,ఇంజినీర్లతో ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి సంరక్షణ,గోదావరి జలాలను ఖమ్మం వైపు మళ్లించే కార్యాచరణాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున ప్రతి చుక్క నీటిని జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా



కలెక్టర్ సూచించిన విధంగా రైతులు ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు,పప్పు ధాన్యాలు వంటి తక్కువ నీటిఅవసరమున్న పంటలను సాగు చేయాలని సూచించారు. ఏప్రిల్ 2026 నుంచే అధికారులు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు వరి సాగుపై పట్టుబడితే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు.1977లో వచ్చిన కరువు కంటే ప్రస్తుతం వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న సూపర్ ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రమై ఉండే అవకాశముందని అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో దీని ప్రభావం పెరిగి భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉందని,త్రాగునీటి పరిరక్షణపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఖమ్మం జిల్లాకు కృష్ణా జలాలు మాత్రమే సరిపోవని,దశాబ్దాలుగా గోదావరి జలాలను తీసుకురావాలనే ప్రజల ఆకాంక్ష ఉందన్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో సీతారామ ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి శ్రీరాముడి పేరుతో 'సీతారామ' ప్రాజెక్టుగా నామకరణం చేశామని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు జిల్లాకు అందుతున్నాయని చెప్పారు.ఇంజినీర్ల సూచనల మేరకు వైరాకు తరలించిన గోదావరి నీటిని రాజీవ్ కాలువ షట్టర్లు మూసివేసి తిరిగి ఖమ్మం వైపు మళ్లించే ప్రయోగం



జరుగుతోందన్నారు.మంచుకొండతో పాటు ఇతర ఎత్తిపోతల వ్యవస్థల ద్వారా చెరువులు నింపి, మంచుకొండ ఓవర్‌ఫ్లోను మున్నేరులోకి మళ్లించడం ద్వారా ఖమ్మం నగర త్రాగునీటి అవసరాలను తీర్చేప్రయత్నం చేస్తున్నామని వివరించారు. అవసరమైతే డీప్‌కట్ నుంచి మంచుకొండకు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలించే అత్యవసర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.సుమారు రూ.90 కోట్లతో నిర్మించిన రాజీవ్ కాలువ వల్ల రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పరిస్థితి ఏర్పడిందని, ఇది సాగునీటి రంగంలో విశేష విజయమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు సాంకేతిక సూచనలు అందించి విజయవంతంగా పూర్తి చేసిన ఇంజినీర్లను ప్రత్యేకంగా అభినందించారు.పశ్చిమాసియా యుద్ధాల ప్రభావంతో బొగ్గు, గ్యాస్ కొరత ఏర్పడి విద్యుత్ సరఫరా,యూరియా ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. రైతులకు పారదర్శకంగా యూరియా అందించేందుకు ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టిందని, ఇది పూర్తిగా రైతుల సంక్షేమం కోసమేనని చెప్పారు. రాజకీయ ప్రేరేపణలను నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.వీబీజీఆర్ఏఎం నిధులను వినియోగించి ఎన్ఎస్పీ కాలువల్లో పెరిగిన పొదలను తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు మంత్రి సూచించారు. ఖమ్మం నగరంలో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని, విద్యుత్ స్తంభాల సమీపంలో మొక్కలు నాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత చాలా తక్కువగా ఉందని, రాబోయే నెలల్లో వర్షాలు కురవకపోతే త్రాగునీటి సమస్య కూడా తలెత్తే అవకాశముందని అన్నార.అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగిస్తూ వచ్చే జూన్-2027 వరకు త్రాగునీటి అవసరాలు తీరేలా కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు.ఇప్పటి వరకు గోదావరి జలాలను వైరాకు తరలించామని, ప్రస్తుతం రాజీవ్ కాలువ షట్టర్లను మూసివేసి గోదావరి నీటిని తిరిగి ఖమ్మం వైపు మళ్లించి పాలేరు రిజర్వాయర్ ను నింపే అవకాశాలను ఇంజినీర్లు, నిపుణులు పరిశీలిస్తున్నారని చెప్పారు. ఈ ప్రక్రియను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.ఈ ప్రయోగం ద్వారా త్రాగునీటి సమస్యను అధిగమించగలమనే విశ్వాసం ఉ ఒదన్నారు. అయితే వర్షాలు లేకుంటే వరి, మిర్చి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగు కష్టసాధ్యమవుతుందని హెచ్చరించారు. నీరు కనిపిస్తున్నదని నిర్లక్ష్యం చేయకుండా అధికారులు సూచిస్తున్న ప్రత్యామ్నాయ పంటలనే సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.అనంతరం మంత్రి ఖమ్మం నగరంలోని 3, 4, 5 డివిజన్లలో యూఐడీఎఫ్ నిధులతో రూ.175 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, సిఇ ఇరిగేషన్ శ్రీనివాస రెడ్డి,ఎం.వెంకటేశ్వర్లు, డిపిఓ రాంబాబు,వివి పాలెం గ్రామ సర్పంచ్ కాపా ఆదినారాయణ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగు.. ఉద్యాన సాగు మేలు..

- జిల్లా ఇన్చార్జి ఉద్యాన అధికారి అనిత శ్రీ



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు చేయడమే మేలని జిల్లా ఇంచార్జ్ ఉద్యాన అధికారి అనిత శ్రీ అన్నారు. తక్కువ నీటి వినియోగం తక్కువ, సాగు ఖర్చు తక్కువ కలిగిన, నీటి ఎద్దడిని తట్టుకునే కూరగాయ పంటలు వేసుకోవడం వల్ల కొంతమేర ప్రయోజనం కలుగుతుంది. ఇటువంటి వర్షాభావ పరిస్థితులలో ఉద్యాన అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించడం, సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. దీనిద్వారా రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాల్సిందిగా,ప్రత్యామ్నాయ పంటలలో కూరగాయల సాగు చేపట్టాలని రైతులను కోరినారు.ఎల్ నినో అంటే ఏమిటి ఎల్ నినో అనేది మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా పెరగడం వల్ల ఏర్పడే వాతావరణ పరిస్థితి. దీని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం మరియు ఉష్ణోగ్రతలపై కనిపిస్తుంది.తెలంగాణపై ఎల్నినో ప్రభావంసాధారణం కంటే తక్కువ వర్షపాతం వచ్చే అవకాశం.రుతుపవనాల ప్రారంభం ఆలస్యం కావచ్చు.వర్షాల మధ్య ఎక్కువ విరామాలు ఏర్పడవచ్చు.అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం.పంటల పెరుగుదల మరియు దిగుబడిపై ప్రతికూల ప్రభావం.వ్యవసాయంపై ప్రభావం విత్తనాలు ఆలస్యంగా వేయాల్సిన పరిస్థితి.మొలక శాతం తగ్గే అవకాశం.పుష్పించే మరియు గింజలు ఏర్పడే దశల్లో తేమ కొరత.దిగుబడి తగ్గే అవకాశం.పశుగ్రాస కొరత ఏర్పడే అవకాశం.

### రైతులు తీసుకోవాల్సిన చర్యలు

వర్షాలు స్థిరంగా వచ్చిన తర్వాత మాత్రమే విత్తనాలు వేయాలి.తక్కువ కాలంలో పండే, కరువును తట్టుకునే పంటలను ఎంచుకోవాలి.పత్తి,మొక్కజొన్నతో పాటు కంది,పెసర,మినుము,కొర్ర,సజ్జ,నువ్వులు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి. వర్షపు నీటిని చెరువులు, ఫార్మ్ పాండ్లలో నిల్వ చేయాలి.అంతర పంటల సాగు చేపట్టాలి.కలుపు నివారణ, మల్చింగ్ ద్వారా నేల తేమను సంరక్షించాలి.రుతుపవనాల ఆలస్య ప్రారంభం మరియు దీర్ఘకాలిక బెట్ట పరిస్థితుల్లో పాటించాల్సిన యాజమాన్య చర్యలు రుతుపవనాల ప్రారంభం తరువాత ఏడు రోజులలో తేలిక నేలల్లో 50-60మి.మీ., బరువు నేలల్లో 60-75 మి.మీ. వర్షపాతం సమకూరిన తర్వాత మాత్రమే విత్తనాలు వేయాలి.నల్ల రేగడి నేలల్లో తేమ సంరక్షణ కోసం 120 సెం.మీ. వెడల్పు గల ఎత్తు బోదెలు, 60 సెం.మీ. వెడల్పు,30 సెం. మీ. లోతు గల కాలువలు ఏర్పాటు చేయాలి.మధ్యస్థ లేదా తేలికపాటి నేలల్లో బోదేలు మరియు కాలువలు పద్దతులను అనుసరించాలి.నేలలో తగిన తేమ ఏర్పడే వరకు ఎరువుల వినియోగాన్ని వాయిదా వేయాలి.కలుపు నియంత్రణ మరియు నేల తేమ సంరక్షణ కోసం తరచూ అంతర దుక్కులు చేయాలి.వర్షాలు వచ్చిన తరువాత సిఫారసు చేసిన మోతాదులో నత్రజని మరియు పొటాష్ ఎరువులను వేయాలి.పంట కీలక ఎదుగుదల దశలలో ప్రాణాధార నీటిపారుదల ఇవ్వాలి.పరిమిత నీటి వనరులు ఉన్నప్పుడు సాలు విడిచి సాలుకు నీటిపారుదల చేయాలి.దీర్ఘకాలిక బెట్ట పరిస్థితుల్లో 2% యూరియా లేదా 1% పొటాషియం నైట్రేట్ (ఖచీూ ) ద్రావణాన్ని 2-3 సార్లు పిచికారీ చేయాలి.విత్తిన 25--30 రోజుల తరువాత వర్షపు నీటి సంరక్షణ కోసం ప్రతి 3.6 మీటర్లకు వాలుకు అడ్డంగా ఒక లోతైన సాలు లేదా తేమ సంరక్షణ కాలువ తీయాలి.రసం పీల్చే కీటకాల ఉధృతిని పర్యవేక్షించి తగిన పురుగుమందులతో సకాలంలో నియంత్రించాలి.నీటి కుంటల్లో నిల్వ చేసిన నీటితో ప్రాణాధార నీటిపారుదల కల్పించాలి.విశ్వవిద్యాలయం ప్రతి మంగళవారం, శుక్రవారం విడుదల చేసే వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలను పాటించాలి.అంతర పంటల విధానాన్ని అనుసరించాలి.వాతావరణానికి అనుకూలమైన పంట రకాల ఎంపిక (కరువు, వరద, వేడి తట్టుకునే రకాలు)వాతావరణ సూచనల ఆధారంగా సకాలంలో విత్తడం అంతర పంటలు,మిశ్రమ పంటల సాగు సంరక్షణ వ్యవసాయం (కనిష్ట దుక్కి / జీరో టిల్లేజ్)పంట అవశేషాలను నేలపై కప్పుగా ఉంచడం నేల పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం సమగ్ర పోషక నిర్వహణ సేంద్రియ ఎరువులు మరియు జీవ ఎరువుల వినియోగం ఫార్మ్ పాండ్లు మరియు నీటి నిల్వ నిర్మాణాలు,డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ నీటిపారుదల పద్ధతులు,మల్చింగ్ ద్వారా నేల తేమ సంరక్షణ రిడ్జ్ అండ్ ఫరో,బ్రాడ్ బెడ్ అండ్ ఫరో సాగు వర్షాభావ పరిస్థితులలో కూరగాయ పంటలలో టవాటా, వంగ, బెండ, చిక్కుళ్ళు ృపాలకూరతోటకూర,మునగ,బీర,సొర,కాకర, దోస, పచ్చి మిర్చి వంటి రకాలు ఈ పరిస్థితిని తట్టుకుంటాయి.

### ఉద్యాన శాఖ రాయితీలు :

ప్లాస్టిక్ మల్చింగ్ ద్వారా నీటి పొదుపును చేసుకోవచ్చని దానికి ఉద్యాన శాఖ ద్వారా ఎకరాకు రూ.8000 సబ్సిడీ లభిస్తుందని తెలిపారు.కూరగాయ పందిర్లు వేసుకునే రైతులకు 50 శాతం రాయితీపై ఎకరానికి రూ.10000 రూపాయల రాయితీ అందిస్తుంది.ఆయిల్ ఫామ్, డ్రిప్ సౌకర్యం ఉద్యాన శాఖ కల్పిస్తుందని తెలిపారు.కూరగాయ పంటలలో టమాండా వంగ బెండ చిక్కుళ్ళు పాలకూర తోటకూర మునగ బీరస్వర కాకర దోస మిరప వంటి రకాలు ఈ పరిస్థితిని చుట్టుకుంటాయి.అధిక దిగుబడి నిచ్చు పండ్ల తోటల రకాల విస్తీర్ణం పెంపకంలో భాగంగా మామిడి జామ అరటి బొప్పాయి సీతాఫలం డ్రాగన్ ఫ్రూట్ లాంటి తోటలకు 40 శాతం రాయితీ కల్పిస్తుంది అని తెలిపారు.టమాటా సాగు చేయాలనుకునే రైతులు సాహు ఆరాధక్షక్ పూస రూబీ రకాలను వంగలో మంజరి అరబిల్ కాంత్ కోసం పురుగులాంగ్ రకాలను బెండ సాగులో అరానామిక్య భూసావని చిక్కుల్లో ఆకుకూరలు అంటే పంటల వర్షపాతం పరిస్థితులను తట్టుకునే రకాలను ఎంచుకోవాలని తెలిపారు.

# రోడ్లపై కేజ్ వీల్స్ ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు: ఏన్కూర్ ఎస్సై



ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి రోడ్లపై కేజ్ వీల్స్ అమర్చిన ట్రాక్టర్లను నడపడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏన్కూర్ ఎస్సై సంధ్య తెలిపారు.పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు కేజ్ వీల్స్ అమర్చి రోడ్లపై తిరిగే ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.ఏన్కూర్ మండలం,టి.ఎల్.పేట గ్రామ ప్రధాన రహదారిపై ట్రాక్టర్‌కు ఫుల్ వీల్స్ అమర్చి నడపడం వల్ల రోడ్డు తీవ్రంగా దెబ్బతిన్నట్లు గుర్తించి,ఈ ఘటనకు సంబంధించి టి.ఎల్.పేట గ్రామానికి చెందిన కూచిపూడి నరసింహారావు పై ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించినందుకు సంబంధిత చట్టాల ప్రకారం ఏన్కూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు.ప్రజల కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి గ్రామాల వరకు మెరుగైన రహదారులను నిర్మిస్తోందని, కాబట్టి వాటిని సురక్షితంగా ఉంచడం, రోడ్డు దెబ్బతినకుండా చూసుకోవడం అందరి బాధ్యతని అన్నారు.వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్లకు కేజ్ వీల్స్ అమర్చడం సాధారణమే అయినప్పటికీ,పొలాల వద్ద పనులు ముగిసిన తర్వాత కేజ్ వీల్స్ తొలగించి సాధారణ టైర్లు వేసుకోవాలి. లేదా రోడ్లకు నష్టం జరగకుండా ప్రత్యా మ్నాయాలు వాడాలన్నారు. ట్రాక్టర్ యజమానులు నిబంధనలు పాటించి,ట్రాక్టర్ డ్రైవర్లకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలాని సూచించారు. ఎవరైనా నిబంధనలుఉల్లంఘిస్తున్నట్లు గుర్తించినా డయల్ --100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవద్దు

మొదటిపేజీ తరువాయి..

పార్లమెంటులో సమాధానాలు ఇస్తామన్నారు. అయితే, విపక్షాలు చీటికిమాటికి గోల్‌పోస్టు మారుస్తున్నాయని, విద్యార్థుల భవిష్యత్ గురించి తమకు పూర్తి బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పేపర్లు లీక్ అయ్యాయని, యూపీఏ హయాంలో ఎన్నో రాష్ట్రాల్లో పేపర్లు లీక్ జరిగాయని నడ్డా వ్యాఖ్యానించారు. విద్యార్థుల అంశాన్ని రాజకీయంగా వాడుకోవటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కొన్ని అంశాలనే టార్గెట్‌గా చేసుకుని రాహుల్‌గాంధీ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో పేపర్లు



లీక్ జరిగిందని, తెలంగాణలో ఇంటర్ పేపర్, కేరళ, తమిళనాడులో పేపర్లు లీక్ అయ్యాయని తెలిపారు. బంగాల్, కర్ణాటకలోనూ ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని పేర్కొన్నారు. కానీ, బీజేపీ ప్రభుత్వం మాత్రం బాధ్యయుతంగా వ్యవహరిస్తోందని తెలిపారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఘటనపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న నిరసనల నేపథ్యంలో నడ్డా దిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మీడియాకు వివరాలు తెలియజేశారు. విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం చూసుకుంటుందని నీట్ పేపర్ లీక్ ఆందోళనకారులకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను విపక్షాలు కీలుబొమ్మలుగా చేసుకున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యార్థులు, యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు."దిల్లీలో జరుగుతున్న నిరసనలు తీవ్ర ఆందోళన కలిగించే విషయం. కొందరు వ్యక్తులు తమ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి మన దేశ విద్యార్థులను, యువతను రాజకీయ సాధనాలుగా వాడుకోవడానికి ప్రయత్నించడం అత్యంత దురదృష్టకరం. మోదీ నాయకత్వంలో విద్యార్థులు, యువత ఆకాంక్షలను నెరవేర్చడానికి, అలాగే వారి సంక్షేమం కోసం మా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది. విద్యార్థుల ప్రతి ఆందోళనను ఆలకించి, వాటిని పరిష్కరించడం మా బాధ్యత. అటువంటి మోసపూరిత ప్రయత్నాలను భారతదేశపు చైతన్యవంతమైన, తెలివైన యువత పూర్తిగా అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా. వారు పురోగతి, అభివృద్ధి, దేశ నిర్మాణ మార్గాన్ని ఎంచుకుంటారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. కొందరు ప్రతిపక్ష నాయకులు విద్యార్థుల్లో కోపావేశాలను సృష్టిస్తున్నారని రాజ్‌నాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. యువతను తప్పుదోవ పట్టించడానికి విఫల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటులో కాకుండా వీధుల్లో సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రతిపక్షం అనుచితమైన ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య సమస్యలను చర్చించడానికి సరైన వేదిక పార్లమెంట్ భవనమని, అక్కడ ప్రతిపక్షానికి తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వెల్లడించే పూర్తి స్వేచ్ఛ ఉందని తెలిపారు. తమ ప్రభుత్వం కూడా యువత భావాలు, ఆందోళనలను వినడానికి సిద్ధంగా ఉందని, ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రతి అంశంపై అర్థవంతమైన చర్చ జరగాలని ప్రభుత్వం కూడా చెప్పిందన్నారు. సభ సజావుగా పనిచేసేందుకు ప్రతిపక్షాలు అనుమతించాలని కోరుతూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఇదిలా ఉండగా, బుధవారం ఉదయం, ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. ఈ నిరసనలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# 56 కోట్లతో వివిధ విద్యుత్ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం..

**ఎల్ నినో' సవాలును సమర్థంగా ఎదుర్కొంటున్న తెలంగాణ విద్యుత్ వ్యవస్థ..**

**53 లక్షల కుటుంబాల బిల్లుల మొత్తాన్ని చెల్లిస్తున్న ఆర్థిక శాఖ..**

**రాష్ట ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ పై సమీక్ష..**

హనుమకొండ జిల్లా ప్రతినిధి జూలై 22 (ప్రజాజ్యోతి):
'ఎల్ నినో' ప్రతికూల ప్రభావంతో వర్షాకాలంలోనూ వేసవిని తలపించే స్థాయిలో విద్యుత్ డిమాండ్ పెరగడం, మరోవైపు జలాశయాల్లో నీటి లభ్యత తగ్గిపోవడంతో జలవిద్యుత్ ఉత్పత్తి గణనీయంగా పడిపోవడం వల్ల ఒకేసారి సుమారు 7,000 మెగావాట్ల అదనపు భారాన్ని తెలంగాణ విద్యుత్ వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం (విద్యుత్ భవన్)లో రూ.56 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు విద్యుత్ అభివృద్ధి పనులకు



ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి కాలనీ, ఆర్ అండ్ బీ క్వార్టర్స్, విద్యుత్ నగర్, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ ప్రాంతాల్లో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలు, హనుమకొండ నూతన సర్కిల్ కార్యాలయ భవనం, టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఐదో అంతస్తు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు 70 కొత్త 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలు, 31,448 కిలోమీటర్ల కొత్త విద్యుత్ లైన్లు, 35,736 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే కాలంలో 7.72 లక్షల కొత్త ఎల్టీ కనెక్షన్లు, 771 హెచ్‌టీ కనెక్షన్లు విడుదల చేయగా, 1,656 గ్రామాలు, 11.16 లక్షలకు పైగా వినియోగదారులు ప్రత్యక్షంగా లబ్ధి పొందినట్లు వెల్లడించారు. గృహజ్యోతి పథకం ద్వారా 26.59 లక్షల లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరగా, 6.73 కోట్లకు పైగా జీరో బిల్లులు జారీ చేసినట్లు తెలిపారు.




వ్యవసాయ రంగానికి రూ.17,524.09 కోట్ల సబ్సిడీ, 15,833 ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, సాధారణంగా వర్షాకాలంలో 11 వేల మెగావాట్లుగా ఉండే విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా 16,500 మెగావాట్లకు పెరగడం, మరోవైపు జలవిద్యుత్ ఉత్పత్తి 2,000 మెగావాట్లు తగ్గిపోవడం విద్యుత్ పంపిణీ వ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడి సృష్టించినప్పటికీ, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ముందస్తు ప్రణాళికలు, అంకితభావంతో పనిచేయడం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేశామని తెలిపారు. రాష్ట్ర విద్యుత్ రంగం దేశంలోనే ఆదర్శంగా నిలవడానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఇంజినీర్లు, లైన్‌మెన్లు, సిబ్బంది, కార్మికుల అంకితభావం, కృషి ప్రధాన కారణమని మంత్రి కొండా సురేఖ కొనియాడారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాత్రింబవళ్లు శ్రమిస్తున్న ప్రతి ఉద్యోగి, కార్మికుడికి ఆమె ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వం చేపడుతున్న విద్యుత్ రంగ సంస్కరణలు, సాంకేతిక ఆవిష్కరణలు, పునరుత్పాదక ఇంధన వనరుల విస్తరణతో తెలంగాణ దేశంలోనే అత్యుత్తమ విద్యుత్ వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా మరింత ముందంజలో నిలుస్తుందని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ టి. వెంకన్న, వరంగల్ జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) నిఖిల, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమార్జన..

మొదటిపేజీ తరువాయి..

బంగారం, వజ్రాభరణాలు, విదేశీ మద్యం బాటిళ్లతో పాటు కియా, మహీంద్రా, బలెనో కంపెనీలకు చెందిన మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ముత్యం వెంకటరమణ ప్రస్తుతం



రెడ్‌కోలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. సోదాల్లో ముత్యం వెంకటరమణ భార్య స్వప్న పేరుతో నిర్మాణ రంగంలో భారీ స్థాయిలో ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. ఆంజనేయనగర్, మూసాపేట్ ప్రాంతాల్లో 10 ప్లాట్లు, నాలుగు రెసిడెన్షియల్ ప్లాట్లు, కమర్షియల్ భవనాలు, ఖానామెట్ గుట్టల బేగంపేట్‌లో 5 కమర్షియల్ భవనం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 2019లో రూ.26 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ముత్యం వెంకటరమణపై అప్పటి నుంచే నిఘా కొనసాగుతోందని, విద్యుత్ శాఖలో వివిధ ప్రాంతాల్లో పనిచేసిన సమయంలో అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న ఆస్తులు, పత్రాల ఆధారంగా మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోంది.
ఏసీబీ డీఎస్పీ మాజిద్ ఖాన్ నేతృత్వంలో ఈ బృహత్తర సోదాల ప్రక్రియ సాగుతోంది. ఈ దాడుల కోసం ఏసీబీ అధికారులు మొత్తం 8 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి.. ముందస్తు ప్రణాళిక ప్రకారం ఆయా ప్రాంతాలపై ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. వెంకట రమణకు ఉన్న స్థిరాస్తులు, చరాస్తులకు సంబంధించిన అనేక కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు ఆయన ఇళ్లలో లభ్యమైన భారీ నగదును, బ్యాంక్ లాకర్లు, ఇతర ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ తనిఖీల ప్రక్రియ సుదీర్ఘంగా సాగుతుండటంతో సాయంత్రం వేళ వరకూ సోదాలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. తనిఖీలు పూర్తిగా పూర్తయిన తర్వాతే డీఈ ముత్యం వెంకట రమణకు సంబంధించి పట్టుబడిన మొత్తం ఆస్తుల విలువ, లభ్యమైన నగదు, స్వాధీనం చేసుకున్న కీలక పత్రాల వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని ఏసీబీ స్పష్టం చేసింది. ఈ సోదాల వార్త వెలువడటంతో రెడ్కో శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల్లోని అధికారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

## సంస్కరణలకు ప్రజల సంక్షేమమే ముఖ్యం

మొదటిపేజీ తరువాయి..

క్రీడలు తదితర కీలక రంగాల్లో జరుగుతున్న పురోగతిని కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రజల సంక్షేమమే అన్ని సంస్కరణలకు కేంద్రబిందువుగా ఉండాలని ప్రధాని స్పష్టం చేశారు. పౌరుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించే సంస్కరణలే దేశంలో నిజమైన మార్పును తీసుకురాగలవని మోదీ అన్నారు. ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడమే కాకుండా, భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే ప్రక్రియను వేగవంతం చేయడం కూడా సంస్కరణల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పరిపాలనా వ్యవస్థలు మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని ప్రధాని సూచించారు. వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో కొత్త అవసరాలను గుర్తించి, వాటిపై సమగ్ర మ్యాపింగ్ చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. దేశ అభివృద్ధి లక్ష్యాల సాధనకు హోల్-ఆఫ్-గవర్నమెంట్ విధానం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. విక్సిత్ భారత్ లక్ష్యం ప్రజా ఉద్యమంగా మారాలని, అందులో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల దుర్వినియోగంపై కూడా ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. యువతకు సంబంధించిన కార్యక్రమాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేలా ప్రత్యేక వ్యవస్థను రూపొందించాలని సూచించారు. అలాగే క్రీడల అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ అవసరమని, భారతదేశం భవిష్యత్తులో ప్రధాన అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇచ్చే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. క్రీడా రంగంలో సాంకేతికత, స్టార్టప్‌ల పాత్రను మరింత ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో పీఎం కుసుమ్ వంటి పథకాల అమలు రైతుల



ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని అన్నారు. భవిష్యత్ ప్రపంచ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను రూపొందించాలని, ప్రపంచ స్థాయి నైపుణ్య అవసరాలపై మ్యాపింగ్ చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వివిధ శాఖల కార్యదర్శులు తమ తమ రంగాల్లో అమలవుతున్న కార్యక్రమాలు, ఎదురవుతున్న సవాళ్లను వివరించారు. ప్రధానమంత్రి భవిష్యత్ కార్యాచరణపై కీలక సూచనలు చేశారు. సమర్థవంతమైన అమలు, శాఖల మధ్య సమన్వయం, వేగవంతమైన పురోగతితో విక్సిత్ భారత్ లక్ష్యాలను సాధించేందుకు కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో క్యాబినెట్ కార్యదర్శితో పాటు కీలక మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, ప్రధానమంత్రి కార్యాలయానికి చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో సన్నద్ధతపై రాష్ట్ర నిపుణుల కమిటీ తొలి సమావేశం

హైదరాబాద్,జూలై22(ప్రజాజ్యోతి):
వాతావరణ మార్పుల ప్రభావం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు సన్నద్ధత అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రంలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావాన్ని అంచనా వేయడం కోసం నిపుణుల కమిటీ భేటీ అయ్యింది. వ్యవసాయం దాని అనుబంధ రంగాల కోసం రాష్ట్ర స్థాయి అత్యవసర కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం, ఉపశమన, అనుసరణ చర్యలను సిఫారసు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 27 మంది సభ్యులతో కూడిన బహుళ విభాగాల నిపుణుల కమిటీ తొలి సమావేశం బుధవారం ప్రజాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షులు డా. జి. చిన్నారెడ్డి అధ్యక్షతన జరిగింది. కమిటీలో భారత వాతావరణ శాఖ, ఇక్రిశాట్, ఐసీఏఆర్-క్రిడా, నాబార్డ్, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాలు, భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ, భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ, మార్క్ ఫెడ్, ఆయిల్‌ఫెడ్, జాతీయ విత్తన సంస్థ, తెలంగాణ రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలు, పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలకు చెందిన నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంగా డా. జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత నైరుతి రుతుపవనాల కాలంలో తెలంగాణలో అసాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. గత ఆరు నెలలుగా ఎల్ నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనాలు ఉన్నప్పటికీ, రాష్ట్రంలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని చాలా మంది భావించారు.

## నీట్ పరీక్ష అవకతవకలపై నిరసన

మొదటిపేజీ తరువాయి..

విఫలమైనందుకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, అలాగే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 24న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. దేశ విద్యా వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన వరుస వైఫల్యాలకు కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని వామపక్ష, విపక్ష విద్యార్థి సంఘాల నాయకులు విమర్శించారు. ఇటీవల ఢిల్లీలో తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు జరిపిన దాడులను వారు తీవ్రంగా ఖండించారు. ఈ పోలీసు దాడులపై పారదర్శకమైన, స్వతంత్ర విచారణ జరిపించి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.దీంతోపాటు విద్యా వ్యవస్థ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా, అధికారాన్ని కేంద్రీకరించేలా ఉందంటూ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని ఐక్యవేదిక డిమాండ్ చేసింది. జూలై 24న చేపట్టే ఈ రాష్ట్రవ్యాప్త బంద్ ద్వారా కేంద్ర వైఖరిపై తమ నిరసన గళాన్ని గట్టిగా వినిపించేందుకు సిద్ధమయ్యారు. విద్యా రంగాన్ని పరిరక్షించుకోవడానికి జరుగుతున్న ఈ పోరాటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, మేధావులు, ప్రజలందరూ పెద్ద ఎత్తున మద్దతు తెలిపి, బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నేతలు పిలుపునిచ్చారు.




Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967